ఈ పేపర్ కోసం www.visionandhra.in చూడండి



# విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక

VISION ANDHRA TELUGU DAILY




ఆదివారం 26 మే 2026 | సంపుటి: 28 సంచిక: 57

Tuesday 26 May 2026 | Vol.No 28 Issue No .57

హైదరాబాద్ Hyderabad

పేజీలు: 12+12 | వెల: రూ.1.00

PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA

www.visionandhra.in


## ధాన్యం సేకరణలో సహకరించని కేంద్రం

- ఈ యేడు మొక్కజొన్న అధికంగా దిగుబడి
- సిపిఐ బృందంతో సిఎం రేవంత్ వెల్లడి




హైదరాబాద్,మే25 : కేంద్రప్రభుత్వం సహకరించకపోయినా ధాన్యం కొనుగోలు చేస్తున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ ఏడాది మొక్కజొన్న దిగుబడి బాగా వచ్చిందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ఎమ్మెల్యే కూనంనేని

మిగతా 2లో..

## తాజ్‌మహల్ సందర్శించిన మార్కో రుబియో

- గంటన్నరపాటు అక్కడ గడిపిన రుబియో జంట



న్యూఢిల్లీ,మే25 : అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో తాజ్‌మహల్ అందానికి ఫిదా అయ్యారు. భారత్ పర్యటనలో భాగంగా ఆగ్రాలోని తాజ్‌మహల్‌ను కొద్ది సేపటి క్రితం సందర్శించారు. ఆయనతో పాటు భార్య జెనెట్ రుబియో, భారత్‌లోని అమెరికా రాయబారి సెర్గియో గోర్ కూడా తాజ్‌మహల్‌ను సందర్శించారు.

మిగతా 2లో..

## కోటి మంది మహిళను
# కోటీశ్వరులను చేస్తాం

- ఆదానీ, అంబానీలను మించి పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి
- మహిళా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక మార్కెట్లు
- సోలార్ పవర్, పెట్రోల్ బంకుల ఏర్పాటుతో ఎదగాలి
- రుణపరిమితి రూ.5 లక్షల నుండి రూ.10 లక్షలకు పెంచుతున్నాం
- రైస్ మిల్లులు, గోడౌన్లు, ప్లాస్టిక్ పార్కులు ఏర్పాటుకు సహకారం
- వర్చువల్ గా 8వేల స్వయం సహాయక భవనాలకు శంకుస్థాపన
- మహిళా సంఘాలతో నేరుగా మాట్లాడిన సిఎం రేవంత్ రెడ్డి





హైదరాబాద్,మే25 : తెలంగాణ ఆడబిడ్డల ఆశీస్సులతోనే ఈ ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని, 2034 నాటికి కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే తమ అల్టిమేట్ టార్గెట్ అని సీఎం రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. వారు ఆర్థికంగా ఎదిగి ఆదానీ, అంబానీలను మించాలని ఆకాంక్షించారు. తెలంగాణలో మహిళా సాధికారత, ఆర్థిక అభ్యున్నతే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం మరో చారిత్రాత్మక ఘట్టానికి శ్రీకారం చుట్టింది. ప్రజా పాలన, ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న మహిళా వారోత్సవాల సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సెక్రటేరియట్ నుంచి వర్చువల్ విధానంలో ఏకంగా 8,000 స్వయం సహాయక మహిళా సంఘాల భవనాలకు ఒకేసారి శంకుస్థాపన చేశారు. ఒకే రోజు ఇంత భారీ స్థాయిలో మహిళా భవనాలకు పునాది రాళ్లు వేయడం దేశంలోనే ఒక సంచలన

మిగతా 2లో..

## నీట్ ప్రవేశ పరీక్షాపత్రం లీక్ కేసు

- గత ఘటనల నుంచి గుణపాఠం నేర్చుకోని ఎన్‌టిఎ
- సుప్రీం ధర్మాసనం అసహనం



న్యూఢిల్లీ,మే25 : దేశవ్యాప్తంగా దుమారం రేపిన నీట్ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారంపై

మిగతా 2లో..

## పెట్రో ధరల పెంపు ఎవరి కోసం

- ఎవరి లాభంకోసం ధరలు పెంచుతున్నారు
- కేంద్రం తీరుపై మండిపడ్డ మల్లికార్జన ఖర్గే



న్యూఢిల్లీ,మే25 : శంలో రోజురోజుకు పెరుగుతోన్న ఇంధన ధరల పై కాంగ్రెస్ చీఫ్

మిగతా 2లో..

## హైదరాబాద్ మెట్రోకు భారీ ఆర్థక ఊరట

- రూ.13,600 కోట్ల రుణ సదుపాయానికి ఒప్పందం

హైదరాబాద్,మే25 :హైదరాబాద్ మెట్రో రైలుకు భారీ ఆర్థిక ఊరట చేకూరింది. ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్‌తో (ఐఆర్‌ఎఫ్‌సీ) హైదరాబాద్ మెట్రో కీలక రీఫైనాన్సింగ్ ఒప్పందం కుదుర్చుకుంది. రూ.13,600 కోట్ల రుణ సదుపాయానికి సంబంధించిన ఈ ఒప్పందంపై సోమవారం ఢిల్లీలో సంతకాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఐఆర్‌ఎఫ్‌సీ సీఎండీ మనోజ్ కుమార్ దూబే, తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావు సమక్షంలో ఈ ఒప్పంద ప్రక్రియ పూర్తయింది. హైదరాబాద్ మెట్రోకు దీర్ఘకాలిక ఆర్థిక బలం చేకూర్చే కీలక అడుగుగా ఈ ఒప్పందాన్ని అధికారులు అభివర్ణించారు. తెలంగాణ



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో పట్టణ రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి

మిగతా 2లో..

## ఇప్పటికే 12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

- మిగతా ధాన్యం కూడా కొనడానికి ప్రభుత్వం సిద్ధం
- కేంద్రం తీరుతోనే ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు
- బిజెపి తీరుపై మండిపడ్డ మంత్రి తుమ్మల

ఖమ్మం,మే25 : దేశంలో అన్నిరకాల పంటలను తమ ప్రభుత్వం మాత్రమే కొనుగోలు చేస్తోందని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. వరిధాన్యం కొనుగోళ్లు ఆలస్యం కావడానికి ప్రధాన కారణం కేంద్ర



మిగతా 2లో..

## అట్టహాసంగా పద్మ పురస్కారాలు

- పలువురికి అవార్డులు అందచేసిన రాష్ట్రపతి
- కార్యక్రమంలో ప్రధాని మోడీ, అమిత్ షాల హాజరు



న్యూఢిల్లీ,మే25 : భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో సోమవారం పద్మ అవార్డుల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. దేశంలోని వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన ప్రముఖులకు భారత ప్రభుత్వం.. దేశ అత్యున్నత పౌర పురస్కారాలైన పద్మవిభూషణ్, పద్మభూషణ్, పద్మశ్రీలను ప్రదానం చేసింది. ఈ ఏడాది మొత్తం 131 మందికి ఈ పురస్కారం

మిగతా 2లో..

## తమిళనాడులోనూ రైతుల రుణమాఫీ

- కోఆపరేటివ్ బ్యాంకు రుణాల మాఫీ ప్రకటన
- 50వేల వరకు రుణమాఫీకి సిఎం విజయ్ ఆదేశం



చెన్నై,మే25 : తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ రైతులకు ఉపశమనం కలిగించే కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులు కోఆపరేటివ్ బ్యాంక్ నుంచి తీసుకున్న

మిగతా 2లో..

## బిఆర్ఎస్ వచ్చాక 24 గంటల తాగునీరిస్తాం

- ప్రతి ఇంటికీ మంచి నీరు అందించి తీరుతాం
- నగరంలో ఒక్క ఇందిరమ్మ ఇల్లు ఒక్కటైనా కట్టారా
- అలా చూపిస్తే రాజకీయాల నుంచి తప్పకుంటా
- సర్ ప్రక్రియతో జాగ్రత్తగా ఉండాల్సిందే
- కూకట్‌పల్లి కార్యకర్తల భేటీలో బిఆర్ఎస్ నేత కెటిఆర్

హైదరాబాద్,మే25 : బీఆర్‌ఎస్ అధికారంలోకి రాగానే హైదరాబాద్ సిటీలో 24 గంటల తాగునీటిని సరఫరా చేస్తామని మాజీమంత్రి కెటిఆర్ అన్నారు. 24 గంటల కరెంట్ ఇచ్చిన తీరుగానే ప్రతి ఇంటికి మంచి నీరు అందిస్తామని స్పష్టం చేశారు. తెలంగాణకు 24 గంటల కరెంట్ ఇచ్చింది కేసీఆరే అని.. హైదరాబాద్ లో 24 గంటల తాగునీరు ఇచ్చేది కూడా కేసీఆరే అని వెల్లడించారు. కాంగ్రెస్ పరిపాలన గురించి అవగాహన ఉంది కాబట్టే నగర ప్రజలు ఒక్క సీటు కూడా ఇవ్వలేదని



మాజీ మంత్రి అన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ జనరల్ బాడీ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో పార్టీ కార్యకర్తలకు స్పెషల్ ఇంటెన్సీవ్ రివ్యూపై బీఆర్‌ఎస్ వర్కింగ్

మిగతా 2లో..

## మద్దతు ధరలు పెంచి కేంద్రం చేతులు దులుపుకుంటోంది

- కనీసం 30శాతం కూడా ధాన్యం సేకరించడం లేదు
- తెలంగాణలో విద్యారంగం పటిష్టతకు కఠిన చర్యలు
- లెఫ్ట్ నేతల భేటీలో సిఎం రేవంత్ వివరణ
- కార్మికుల కనీస వేతనం పెంచడంపై లెఫ్ట్ నేతల అభినందన

హైదరాబాద్,మే25 : కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరలు పెంచడమే తప్ప పంటలను కొనుగోలు చేయడం లేదని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఘాటుగా విమర్శించారు. కనీసం 30 శాతం ధాన్యం కూడా సేకరించడం లేదన్నారు. రాష్ట్రంలో రైతులు పండించిన ప్రతి గింజా కొనుగోలు చేస్తున్నామని చెప్పారు. రాష్ట్ర సచివాలయంలో సీపీఎం, సీపీఐ బృందాలు వేర్వేరుగా సీఎంతో సమావేశమయ్యాయి. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు నేతృత్వంలో ఆయా పార్టీ నేతలు సీఎం రేవంత్‌తో భేటీ అయ్యారు. సుదీర్ఘ కాలం పెండింగ్‌లో ఉన్న కార్మికుల కనీస వేతనాల పెంపు నిర్ణయం

మిగతా 2లో..

## డైమండ్ హార్బర్‌లో బిజెపి అడుగు

- గోదావరి పుష్కరాలకు 10కోట్ల మంది
- అందుకు తగ్గట్లుగా ఏర్పాట్లు ఉండాలి
- రాజమహేంద్రిలో అధికారులతో పవన్ సమీక్ష



రాజమండ్రి,మే25 : గోదావరి పుష్కరాలకు సుమారు 10 కోట్ల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నామని, అందుకు తగిన విధంగా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశించారు. గోదావరి పుష్కరాల-2027 ఏర్పాట్లపై పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఈ క్రమంలో పుష్కరాల ఏర్పాట్లపై రాజమహేంద్రవరం కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం కీలక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు శాఖల అధికారులు, కూటమి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పనులు ఎలా జరుగుతున్నాయని అధికారులను అడిగి డిప్యూటీ సీఎం తెలుసుకున్నారు. ఈ క్రమంలో అధికారులకు పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు.ఈ సమావేశంలో అధికారుల పనితీరుపై డిప్యూటీ సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏడాది వ్యవధిలో రూ. 8,600 కోట్లతో చేపట్టాల్సిన పనులకు ఇంకా డీపీఆర్‌లు ఎందుకు సిద్ధం కాలేదని ప్రశ్నించారు. ఒకే సంవత్సరంలో 7 వేల పనులను ఎలా పూర్తి చేస్తారని నిలదీశారు. ముఖ్యంగా పుష్కరాల నిర్వహణలో టూరిజం శాఖ నుంచి సరైన సన్నద్ధత ఎందుకు కనిపించడం లేదని మందలించారు. ఇష్టానుసారంగా ఖర్చు పెడదామని అనుకుంటే కేంద్రప్రభుత్వం నిధులు

మిగతా 2లో..

## రతన్ టాటా హబ్ ద్వారా స్టార్టప్‌లకు ప్రోత్సాహం

- వంద యూనికార్న్ సంస్థల ఏర్పాటు లక్ష్యం
- విలేజ్ టూ గ్లోబల్ మా ప్రభుత్వ నినాదం
- దేశ ఆర్థిక వ్యవస్థకు సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలే ఊతం
- విజయవాడ ఎంఎస్ఎంఈ గ్రోత్ సమ్మిట్ లో చంద్రబాబు



అమరావతి,మే25 :రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా స్టార్టప్‌లను ప్రోత్సహిస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ఏపీ నుంచి వంద యునికార్న్ సంస్థలు ఏర్పాటు చేయాలని తాము లక్ష్యంగా పెట్టుకున్నామని పేర్కొన్నారు. వచ్చేది నాలెడ్జ్ ఎకానమీ అని.. దీనిని అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. విలేజ్ టు గ్లోబల్ మార్కెట్ అనేది తమ ప్రభుత్వ నినాదమని ఉద్ఘాటించారు. ఒక పరిశ్రమ వ్యర్థాలు.. మరో పరిశ్రమకు ముడి సరుకుగా మారుతుందని వివరించారు. సర్క్యులర్ ఎకానమీ వ్యవస్థ, ఎంఎస్ఎంఈ ఎకో సిస్టమ్ తయారు కావాలని

మిగతా 2లో..

## చిరంజీవితో ఎగ్జిబిటర్ల సమావేశం

- ఇరు పక్షాల నుంచి వివరాల సేకరణ
- ఇది పెద్ది సినిమాకు మాత్రమే కాదన్న దిల్ రాజు



హైదరాబాద్,మే25 : పర్సంటేజీ విధానంలో సినిమాల ప్రదర్శన అనేది కేవలం 'పెద్ది'కి సంబంధించింది మాత్రమే కాదని, ఇండస్ట్రీకిచెందినదని తెలంగాణ ఎఫ్‌డీసీ ఛైర్మన్, నిర్మాత దిల్‌రాజు అన్నారు. రెండు రోజుల్లో దీనికి పరిష్కారం లభిస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. సోమవారం అగ్ర కథానాయకుడు చిరంజీవిని తెలంగాణ ఛాంబర్ ఎగ్జిబిటర్లు, నిర్మాతలు దిల్ రాజు, సురేశ్‌బాబు, కేఎల్ నారాయణ, అల్లు అరవింద్ తదితరులు కలిశారు. దాదాపు

మిగతా 2లో..

## చిరంజీవితో ఎగ్జిబిటర్ల సమావేశం

గంటకు పైగా ఆయనతో సమావేశమయ్యారు. సినిమాలు ప్రదర్శించే విషయంలో ఎగ్జిబిటర్లు, థియేటర్ యజమానులు కోరుతున్న పర్సంటేజ్ విధానం సహా పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా పర్సంటేజ్ విషయంలో ఏదో ఒక స్పష్టమైన నిర్ణయానికి రావాలని ఇటు నిర్మాతలు, అటు ఎగ్జిబిటర్లకు చిరంజీవి సూచించినట్లు సమాచారం. రాబోయే చిత్రాలకు ఇబ్బంది లేకుండా అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకోవాలని అన్నట్లు తెలుస్తోంది. చిరంజీవితో సమావేశం అనంతరం నిర్మాత దిల్‌రాజు మాట్లాడుతూ..పర్సంటేజ్ విధానంపై ఎగ్జిబిటర్లు అన్ని విషయాలను చిరంజీవిగారికి వివరించారు. ఆయన సావకాశంగా విన్నారు. వారం కిందట ఛాంబర్ ఏర్పాటు చేసిన కమిటీ నుంచి మరిన్ని వివరాలు తెప్పించుకుని పరిశీలిస్తానన్నారు. రెండు రోజుల్లో ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుంది. అందుకు సంబంధించిన వివరాలను ఛాంబర్ అధికారికంగా ప్రకటిస్తుందని అన్నారు. ఎగ్జిబిటర్ల సమస్యలను చిరంజీవి సావకాశంగా విన్నారు. సింగిల్ స్క్రీన్ సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చాం. 'ఇన్ని ఇబ్బందులు ఉన్నాయా' అని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఛాంబర్ ఏర్పాటు చేసిన కమిటీని కూడా పిలిచి మాట్లాడతానని అన్నారు. మేము కూడా ఎగ్జిబిటర్లతో కూర్చొని మాట్లాడి తుది నిర్ణయం తీసుకుంటాం అని తెలంగాణ ఎగ్జిబిటర్ల కార్యదర్శి శ్రీధర్ అన్నారు.

## మద్దతు ధరలు పెంచి కేంద్రం చేతులు దులుపుకుంటోంది

తీసుకోవడంపై నేతలు సీఎం రేవంత్‌కు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు, మూసీ ప్రక్షాళన, విద్యారంగ అంశాలపైనా వారి మధ్య చర్చ జరిగింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల కారణంగా హమాలీలు వారి స్వస్థలాలకు వెళ్లడంతో ఇక్కడ కొరత ఏర్పడిందన్నారు. మరోవైపు ఎండల తీవ్రత కారణంగా మధ్యాహ్నం సమయంలో పని జరగడం లేదని చెప్పారు. ధాన్యం కొనుగోళ్లపై నిరంతరం సమీక్షిస్తున్నట్లు తెలిపారు. సన్నవడ్లకు రూ.500 బోనస్ ఇచ్చి.. మొక్కజొన్నను మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. మూసీ నిర్వాసితులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, స్థానికంగానే నివాసాలు మంజూరు చేస్తామని సీఎం స్పష్టం చేశారు. ఈ విషయంలో పార్టీలు రాజకీయం చేయడం తగదన్నారు. మూసీ పునరుజ్జీవం చేసి అద్భుతమైన పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. మూసీ కాలుష్యం నల్గొండ జిల్లా ప్రజలకు జీవన్మరణ సమస్యగా మారిందని, అక్కడ ఎదురవుతున్న పరిస్థితులను వివరించారు. ప్రభుత్వ విద్యను ప్రక్షాళన చేస్తున్నామని సీఎం చెప్పారు. విద్యా రంగంలో చేపడుతున్న కార్యక్రమాలను ఈ సందర్భంగా వారికి వివరించారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నామని చెబుతూ.. రంగారెడ్డి జిల్లా ఆరుట్ల పాఠశాలను ఒకసారి సందర్శించాలని సీపీఎం నేతలను రేవంత్ కోరారు. నాణ్యమైన విద్య అందించే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామని.. దానిలో భాగంగా విద్యార్థులకు నాణ్యమైన బ్రేక్‌ఫాస్ట్, భోజనం అందిస్తున్నామని తెలిపారు.

## హైదరాబాద్ మెట్రోకు భారీ ఆర్థిక ఊరట

ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎస్ రామకృష్ణ రావు తెలిపారు. హైదరాబాద్ దేశ ఆర్థిక వృద్ధికి కీలక కేంద్రంగా ఎదుగుతోందని, మెట్రో కనెక్టివిటీ విస్తరణతో ట్రాఫిక్ రద్దీ తగ్గి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుతాయని పేర్కొన్నారు. ఈ ఒప్పందం ప్రకారం ప్రస్తుతం ఉన్న రుణాలను రీ÷నాన్స్ చేసేందుకు రూ.13,600 కోట్ల రుణం మంజూరు చేయనున్నారు. నాన్ కన్వర్టిబుల్ డిబెంచర్లు, కమర్షియల్ పేపర్లు, వర్కింగ్ కాపిటల్ రీ÷నాన్సింగ్ కోసం ఈ నిధులను వినియోగించనున్నారు. 20 ఏళ్ల కాలపరిమితితో త్రైమాసిక చెల్లింపుల విధానంలో ఈ రుణ సదుపాయం ఇవ్వనున్నారు. రీ÷నాన్సింగ్ ద్వారా హైదరాబాద్ మెట్రోపై ఉన్న ఆర్థిక భారం తగ్గడమే కాకుండా, భవిష్యత్తులో విస్తరణ ప్రణాళికలకు కూడా ఆర్థిక వెసులుబాటు కలగనుంది. మరో కీలక పరిణామంగా, లార్సెన్ అండ్ టూబ్రో నుంచి ఎల్‌అండ్‌టీ మెట్రో రైల్ హైదరాబాద్ లిమిటెడ్ వందశాతం యాజమాన్యం తెలంగాణ ప్రభుత్వానికి బదిలీ కానుంది. దీంతో హైదరాబాద్ మెట్రో రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలోని ప్రధాన ప్రజా రవాణా ఆస్తిగా మారనుంది. ఈ సందర్భంగా భారత ప్రభుత్వం, ఐఆర్ఎఫ్‌సీ, ఎల్‌అండ్‌టీ, హైదరాబాద్ మెట్రో రైలు బృందాలకు సీఎస్ రామకృష్ణరావు కృతజ్ఞతలు తెలిపారు. హైదరాబాద్‌కు సమర్థవంతమైన, సుస్థిరమైన ప్రజా రవాణా వ్యవస్థను విస్తరించడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎస్ స్పష్టం చేశారు.

## అట్టహాసంగా పద్మ పురస్కారాలు

దక్కగా.. వారిలో ఐదుగురు పద్మవిభూషణ్, 13 మంది పద్మభూషణ్, 113 మంది పద్మశ్రీలకు ఎంపికయ్యారు. తొలుత సోమవారం 60 మందికి ఈ పురస్కారాలు అందచేశారు. కార్యక్రమానికి ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్ షా తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణకు చెందిన ముగ్గురు ప్రముఖులు ఈ పురస్కారాల్ని అందుకోవడం రాష్ట్రానికి గర్వకారణంగా నిలుస్తోంది. వైద్య రంగంలో విశిష్ట సేవలందించిన ప్రముఖ వైద్యుడు జి.వెంకట్రావుకు, క్యాన్సర్ వైద్య సేవల్లో విశేష కృషి చేసిన డాక్టర్ పి.విజయ్ ఆనంద్ రెడ్డికి పద్మ గౌరవం లభించింది. అలాగే కూచిపూడి నృత్యకారిణి దీపికా రెడ్డికి పద్మ అవార్డు దక్కింది. అవార్డు గ్రహీతలను రాష్ట్రపతి అభినందిస్తూ.. దేశాభివృద్ధికి వివిధ రంగాల్లో వారు అందించిన సేవలు భావితరాలకు ఆదర్శమని పేర్కొన్నారు.

## తమిళనాడులోనూ రైతుల రుణమాఫీ

పంట రుణాలను మాఫీ చేస్తున్నట్టు సోమవారంనాడు ప్రకటించారు. ప్రభుత్వం ప్రకటించిన రుణ మాఫీ ప్రకారం రూ.50,000 వరరూ పంట రుణాలు తీసుకున్న సన్నకారు రైతులకు పూర్తిగా రుణ మాఫీ చేస్తారు. రూ.50 వేలకు పైబడి తీసుకున్న రుణాలకు 50 శాతం మాఫీని ప్రకటించారు. ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలో సచివాలయంలో జరిగిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆ ప్రకారం 2025 మే 1 నుండి 2026 ఫిబ్రవరి 28 మధ్యకాలంలో సహకార బ్యాంకుల్లో తీసుకున్న రుణాలకు మాత్రమే తాజా రుణమాఫీ వర్తిస్తుంది. ప్రభుత్వ నిర్ణయంతో 14.22 లక్షల మంది రైతులకు లబ్ది చేకూరుతుందని, రాష్ట్ర ఖజానాపై రూ.2,044 కోట్ల భారం పడుతుందని విజయ్ తెలిపారు. కావేరీ నదిపై కర్ణాటక ప్రతిపాదిత మేకేదాటు ప్రాజెక్టుపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని స్పందించాలని దానిపై కూడా ముఖ్యమంత్రి విజయ్ ఉన్నత స్థాయి సమావేశంలో చర్చించారు. కర్ణాటక ప్రతిపాదనను తమిళనాడు వ్యతిరేకిస్తూ వస్తోంది. ప్రాజెక్టు నిర్మాణంతో రాష్ట్రానికి రావాల్సిన జలాలపై ప్రభావం పడుతుందని, రైతులకు నష్టం జరుగుతుందని తమిళనాడు ప్రభుత్వ వాదనగా ఉంది. కర్ణాటకలో ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఇటీవల భూమిపూజ జరగడం, ఈ వివాదంపై లీగల్ స్టాటస్‌ను విజయ్ సమావేశంలో అధికారులు సమీక్షించారు. కోర్టు అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని సమగ్ర సంప్రదింపుల అనంతరం తీసుకోవాల్సిన లీగల్ చర్యలను వేగవంతం చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. మంత్రి ఎన్.ఆనంద్, ఆధవ్ అర్జున, ఆర్.నిర్మల్‌కుమార్, అడ్వకేట్ జనరల్ విజయ్ నారాయణ్ తదితర అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## ధాన్యం సేకరణలో సహకరించని కేంద్రం

సాంబశివరావు నేతృత్వంలో సీపీఐ బృందం సోమవారం సచివాలయంలో సమావేశం అయ్యింది. సీఎంని కలిసిన వారిలో సీపీఐ ఎమ్మెల్యే సత్యం, పశ్య పద్మ , ఈ.నరసింహ, చాడ వెంకట్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే భాగం హేమంతరావు, శంకర్, బాల నరసింహ, వీఎస్ బోస్, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి ఉన్నారు. కార్మికులకు వేతనాల పెంపుపై ముఖ్యమంత్రికి సీపీఐ నాయకులు ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై సీఎంతో సీపీఐ నేతలు చర్చించారు. ధాన్యం సేకరణ, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రస్తావించారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులతో సీఎం మాట్లాడారు. కేంద్రప్రభుత్వం మొక్కజొన్న కొనుగోళ్లకు చేయూత ఇవ్వడం లేదని తెలిపారు. తమ ప్రభుత్వానికి నష్టం వచ్చినా మొక్కజొన్న కొనుగోలు చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

## తాజ్‌మహల్ సందర్శించిన మార్కో రుబియో

ఈ నేపథ్యంలో తాజ్ వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు తాజ్ మహల్ వద్ద దాదాపు గంటన్నర పాటు గడిపిన రుబియో దంపతులు సందర్శకుల పుస్తకంలో ప్రత్యేక సందేశం రాశారు. 'ప్రపంచంలోనే గొప్ప సంపదను సందర్శించేందుకు మాకు అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు' అంటూ రుబియో దంపతులు సంతోషం వ్యక్తం చేశారు. మార్కో రుబియో నాలుగు రోజుల పాటు భారత్‌లో పర్యటించేందుకు వచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పటికే ఆయన కోల్‌కతా, న్యూఢిల్లీ పర్యటనలు పూర్తి చేసి, ప్రధాని నరేంద్ర మోదీ, విదేశాంగ మంత్రి జైశంకర్‌తో కీలక చర్చలు జరిపారు . మంగళవారం జరగబోయే క్వాడ్ దేశాల విదేశాంగ మంత్రుల సమావేశంలో పాల్గొంటారు. అనంతరం భారత పర్యటనను పూర్తి చేసుకుని అమెరికాకు పయనమవుతారు.

## కోటి మంది మహిళను కోటీశ్వరులను చేస్తాం

నిర్ణయమని ముఖ్యమంత్రి అభివర్ణించారు. ఈ ఉన్నత స్థాయి వర్చువల్ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు సీతక్క, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస రెడ్డిలతో పాటు కీలక అధికారులు, మహిళా కమిషన్ చైర్మన్ గద్వాల్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా కోటీశ్వరులను చేసేందుకు ప్రభుత్వం రూపొందించిన భారీ రోడ్‌మ్యాప్‌ను ప్రకటించారు. రాష్ట్ర అభివృద్ధి మహిళల పురోగతితోనే ముడిపడి ఉందని నమ్మిన ప్రభుత్వం తమదని సీఎం స్పష్టం చేశారు. సాధారణంగా సోలార్ ఎనర్జీ అంటే అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ దిగ్గజాలు గుర్తొస్తారని, కానీ తెలంగాణలో మహిళా సంఘాల ద్వారానే 1,000 మెగావాట్ల సోలార్ ఎనర్జీ ప్లాంట్లను ఏర్పాటు చేయిస్తున్నామని వెల్లడించారు. అలాగే రిలయన్స్ వంటి సంస్థలు చేసే పెట్రోల్ బంక్ వ్యాపారాలను సైతం ఇకపై మహిళా స్వయం సహాయక సంఘాల చేతుల్లో పెట్టబోతున్నామన్నారు. మహిళల వ్యాపార సామర్థ్యాన్ని పెంచేందుకు వీలుగా బ్యాంక్ లింకేజీ లోన్ల పరిమితిని రూ.5 లక్షల నుండి రూ.10 లక్షలకు పెంచుతున్నట్లు సీఎం ప్రకటించారు. ఇప్పటివరకు రూ.60 వేల కోట్ల బ్యాంక్ లింకేజీ లోన్లు అందించామని, సున్నా వడ్డీ రుణాల కోసం ప్రభుత్వం ఇప్పటికే రూ.1,390 కోట్లు చెల్లించిందని గుర్తు చేశారు. పెద్ద పెద్ద వ్యాపారులు అప్పులు ఎగ్గొట్టి పారిపోతున్న ఈ రోజుల్లో.. మహిళలు మాత్రం తీసుకున్న ప్రతి రూపాయిని నిక్కచ్చిగా చెల్లిస్తూ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. మహిళలు కేవలం చిన్న చిన్న వ్యాపారాలకే పరిమితం కాకుండా పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఇందుకోసం మండలాల్లో రైస్ మిల్లులు, గోడౌన్లు, ప్లాస్టిక్ పార్కులు ఏర్పాటు చేసుకోవడానికి ప్రభుత్వం 100 ఎకరాల వరకు ప్రభుత్వ భూములను కేటాయించడానికి సిద్ధంగా ఉందన్నారు. ఆడబిడ్డలు ప్రతి గింజకూ జవాబుదారీగా ఉంటారని, అందుకే ఇకపై మిల్లులు, గోడౌన్లలో ధాన్యం స్టాక్స్ పెట్టకుండా, మహిళా సంఘాలే నేరుగా వడ్లు కొనుగోలు చేసి బియ్యాన్ని ప్రభుత్వానికి ఇచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. దీనికోసం సున్నా వడ్డీతో బ్యాంక్ లింకేజీ రుణాలను మంజూరు చేస్తామన్నారు. కార్పొరేట్ మార్కెట్ రంగంలోకి మహిళలను తీసుకెళ్లేందుకు 'మహిళా శక్తి సూపర్ బాజార్ల'ను ఏర్పాటు చేయబోతున్నట్లు సీఎం వెల్లడించారు. ఈ సూపర్ బాజార్లలో రాష్ట్ర ప్రభుత్వం కూడా భాగస్వామిగా ఉంటుందని, పట్టణ ప్రాంతాల్లో వీటి ఏర్పాటు కోసం ప్రభుత్వ భూములను చాలా తక్కువ ధరకే లీజుకు ఇస్తామని చెప్పారు. ఇవి దేశంలోనే బెస్ట్ సూపర్ బాజార్లుగా, డీమార్ట్, బిగ్ బాజార్ల కంటే మిన్నగా క్వాలిటీ వస్తువులతో కస్టమర్లను ఆకట్టుకోవాలని ఆకాంక్షించారు. గత ప్రభుత్వం ఇచ్చిన చీరలు నాణ్యత లేక పంట పొలాల్లో పిట్టలను కొట్టడానికి ఉపయోగపడ్డాయని, కానీ తమ ప్రభుత్వం ఇస్తున్న ఇందిరమ్మ చీరలతో ఆడబిడ్డలు పాలపిట్టల్లా కనిపిస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. త్వరలోనే పట్టణ ప్రాంతాల్లో కూడా చిలుక పచ్చ రంగులో ఇందిరమ్మ చీరలను పంపిణీ చేస్తామన్నారు. మహిళల అభ్యున్నతిని అడ్డుకోవాలని కొందరు కుట్రలు చేసి, ఉచిత బస్సు ప్రయాణం వద్దంటూ రెచ్చగొట్టినా వెనక్కి తగ్గలేదన్నారు. ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కోసం ఇప్పటివరకు రూ.10 వేల కోట్లను ప్రభుత్వమే సంస్థకు చెల్లించిందని స్పష్టం చేశారు. మహిళలను బస్సులకు యజమానులను చేయాలనే లక్ష్యంతో 1,000 బస్సులను కొనుగోలు చేసి ఆర్టీసీకి అ÷–దదెకు ఇచ్చేలా ప్రోత్సహిస్తున్నామని, అందులో భాగంగానే జూన్ 5న పరేడ్ గ్రౌండ్స్ వేదికగా 553 బస్సులను ప్రారంభించబోతున్నామని సీఎం వివరించారు. ఇదే సమయంలో సొంత చెల్లెళ్లను ఇళ్ల నుంచి వెళ్లగొడుతున్న ప్రస్తుత రాజకీయ పరిణామాలపై ఆయన పరోక్షంగా స్పందిస్తూ, బయటకు వెళ్లగొట్టబడిన చెల్లెలు ఎలా శాపనార్థాలు పెడుతుందో అందరం చూస్తున్నామన్నారు.

## ఇప్పటికే 12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

ప్రభుత్వమేనని ధ్వజమెత్తారు. ఇప్పుడు సిగ్గులేకుండా బీజేపీ నేతలు బస్సుయాత్రలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. పశ్చిమాసియా యుద్ధ ప్రభావంతో కనీసం గన్నీ బ్యాగులు తీసుకురాలేని పరిస్థితి ఉందని అన్నారు. కేంద్రప్రభుత్వ దుర్మార్గమైన విధానాల కారణంగానే రైతాంగం కష్టాల్లో ఉన్నారని తెలిపారు. కనీసం డీజిల్ ఇవ్వకపోవటంతో ఎక్కడికక్కడా ధాన్యం రవాణా ఆగిపోయిందని అన్నారు. బీఆర్ఎస్, బీజేపీ నేతలకు రైతుల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని ధ్వజమెత్తారు. అటు సాగర్ ఆయకట్టు.. ఇటు సీతారామ ఆయకట్టుతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కృష్ణా గోదావరి జలాలతో సస్యశ్యామలం కాబోతోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. పలు సంస్థలను నిర్వీర్యం చేశారని ఫైర్ అయ్యారు. తెలంగాణలో 12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని.. ఇంకా కొంటామని స్పష్టం చేశారు. సోమవారం యాతాలకుంట టన్నెల్‌ను మంత్రి పరిశీలించారు. యాతాలకుంట టన్నెల్ వద్ద అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడారు. ఖమ్మం జిల్లాకు గోదావరి జలాలు అందాలనేది తన చిరకాల వాంఛ అని మంత్రి తుమ్మల ఉద్ఘాటించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాల్లో గోదావరి పరీవాహక ప్రాంతం ఎక్కువ అని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లాకు గోదావరి ఆయకట్టు దక్కలేదని చెప్పుకొచ్చారు. తెలంగాణలో చివరి ప్రాంతమైన ఖమ్మానికి గోదావరి జలాలు అందలేదని ప్రస్తావించారు. ఎక్కువ భూభాగం ఎన్నెస్పీ కెనాల్ పైభాగం.. కింద భాగంలో గోదావరి ఉండటంతో నీరు అందలేదని అన్నారు. తాను తెలుగుదేశం పార్టీలో నీటిపారుదల శాఖ మంత్రిగా పనిచేసి.. అప్పటి ముఖ్యమంత్రిని.. ఖమ్మానికి గోదావరి జలాలు అందించాలని కోరానని ప్రస్తావించారు. నల్గొండ ఎ÷–లోరైడ్ పీడిత ప్రాంతానికి మాజీ సీఎం ఎన్టీఆర్ లిఫ్ట్ ఇరిగేషన్‌కు అవకాశం ఇచ్చారని తెలిపారు. గోదావరిపై మొట్టమొదట దేవాదుల ప్రారంభించామని చెప్పుకొచ్చారు. గోదావరిపై ఎత్తిపోతల పథకాలకు తప్ప మరో అవకాశం లేదని మంత్రి తుమ్మల తెలిపారు. గోదావరిపై 1998లో దుమ్ముగూడెం ప్రతిపాదన తీసుకువచ్చామని వివరించారు. ఆనాడు దుమ్ముగూడెం వద్ద రాజీవ్ సాగర్ – ఇందిరా సాగర్ వరకు ప్రారంభించిన పంపులు మోటార్లకే పరిమితమయ్యాయని అన్నారు. దుమ్ముగూడెం శ్రీరామచంద్రుడు నడయాడిన ప్రాతంలో సీతారామ ప్రారంభించామని చెప్పుకొచ్చారు. ఆ ప్రభుత్వంలో కేవలం పంప్‌హౌస్ నిర్మాణ పనులకే పరిమితమయ్యాయని అన్నారు. యాతాలకుంట టన్నెల్ ద్వారా సత్తుపల్లి ట్రంక్‌కు నీరు ఇవ్వబోతున్నామని స్పష్టం చేశారు. కేసీఆర్ హయాంలో ఈ టన్నెల్ పూర్తి చేయడానికి కూడా నిర్ణయం తీసుకోలేదని మంత్రి తుమ్మల అన్నారు.

ఇది తన జీవిత ఆశయమని.. లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని సీఎం రేవంత్‌రెడ్డికి చెప్పానని ప్రస్తావించారు. రేవంత్‌రెడ్డి మొదటిసారి రాజీవ్ లింక్ కెనాల్‌కు అనుమతి ఇచ్చారని అన్నారు. ఆరునెలల్లో రాజీవ్ లింక్ కెనాల్ పూర్తి చేశామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి యాతాలకుంట టన్నెల్‌కు అనుమతి ఇచ్చారని వెల్లడించారు. 15 నెలల్లో రెండు కిలోమీటర్ల పొడవు టన్నెల్ నిర్మాణం జరిగిందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. యాతాలకుంట టన్నెల్ పనులు చేపట్టిన ఏజెన్సీ, అధికారులను మంత్రి తుమ్మల అభినందించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా గోదావరి జలాలతో సస్యశ్యామలం కాబోతోందని.. ఇది తన రాజకీయ కోరిక అని వ్యాఖ్యానించారు. తనను ఆశీర్వదించిన రైతాంగాన్ని ఆదుకోవాలన్నదే తన ఆశయమని ఉద్ఘాటించారు. ఆగష్టు 15వ తేదీలోగా లైనింగ్ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. 35 సంవత్సరాల క్రితమే డొక్కా సీతమ్మ ఆక్విడెక్ట్ కట్టామని ప్రస్తావించారు. రైతుల త్యాగానికి ఫలితంగా నష్టపరిహారం ఇచ్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఒప్పించానని తెలిపారు.

## రతన్ టాటా హబ్ ద్వారా స్టార్టప్‌లకు ప్రోత్సాహం

ఆకాంక్షించారు. సోమవారం విజయవాడలో ఎంఎస్ఎంఈ గ్రోత్ సమ్మిట్ – 2026 జరిగింది. ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొని ప్రసంగించారు. దేశ ఆర్థిక వ్యవస్థకు సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈలు) వెన్నెముక అని సీఎం చంద్రబాబు అన్నారు. ఈ రంగం యువత కలలకు వేదికని చెప్పారు. విజయవాడలో నిర్వహించిన ఎంఎస్ఎంఈ గ్రోత్ సమిట్‌లో స్టాళ్లను సందర్శించి, స్టార్టప్ సంస్థలు తయారు చేసిన ఉత్పత్తులను పరిశీలించారు. అనంతరం 38 పారిశ్రామిక పార్కులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయం తర్వాత ఎక్కువమందికి ఉపాధి కల్పిస్తున్న రంగం ఎంఎస్ఎంఈ అని అన్నారు. మహిళా ఉత్పత్తులను ప్రపంచానికి పరిచయం చేసేది ఎంఎస్ఎంఈలే. ఇవి సరికొత్త ఆలోచనలకు వేదిక కావాలి. ఈ వేదిక ద్వారా అనేక ఒప్పందాలకు శ్రీకారం చుట్టాం. రాష్ట్రంలో కోటి ఎంఎస్ఎంఈలు ప్రారంభం కావాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ప్రత్యేక రాయితీలు ఇస్తున్నాం. 175 ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నాం. రాష్ట్రంలో 550 ఇండస్ట్రియల్ పార్కులు ఉన్నాయి. నియోజకవర్గానికి ఒకటి చొప్పున 175 ఎంఎస్ఎంఈ పార్కులు వస్తున్నాయి. ఇవి సరికొత్త ఆలోచనలకు వేదికలు కావాలని చంద్రబాబు అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరిట ఓ కళావేదికను ఇవాళ ప్రారంభించు కుని ఎంఎస్ఎంఈ సమ్మిట్ – 2026 నిర్వహిస్తున్నామని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. 4.4 ఎకరాల్లో 1.45 చదరపు అడుగుల స్థలంలో ఈ కన్వెన్షన్ సెంటర్ నిర్మించామని తెలిపారు. ఓ చిన్న ఆలోచనను పెద్ద పరిశ్రమగా మార్చే అవకాశం ఎంఎస్ఎంఈలకు మాత్రమే ఉందని ప్రస్తావించారు. దేశంలో వ్యవసాయం తర్వాత ఎక్కువ ఉద్యోగాలు కల్పిస్తున్న రంగం ఇదేనని చెప్పుకొచ్చారు. ఏపీలో వనరులు వినియోగిం చుకునేలా ఎంఎస్ఎంఈలకు అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. ఎంఎస్ఎంఈ పాలసీతో పాటు ప్రైవేటు పారిశ్రామిక పార్కుల పాలసీలు తీసుకువచ్చామని సీఎం పేర్కొన్నారు. ఈ సమ్మిట్ ద్వారా స్టార్టప్‌లు, పారిశ్రామిక యూనిట్‌లు, నిపుణులు, బ్యాంకులు ఒకే వేదికపైకి వచ్చాయని వివరించారు. వన్ ఫ్యామిలీ వన్ ఎంటర్‌ప్రెన్యూర్ కింద పెద్ద ఎత్తున పారిశ్రామిక యూనిట్‌లు ఏర్పాటు కావాలని సూచించారు. రూ.500 కోట్ల మేర పారిశ్రామిక ప్రోత్సాహకాలు కూడా ఇప్పటికే విడుదల చేశామని చెప్పుకొచ్చారు. రూ.200 కోట్లతో క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ కూడా ప్రారంభిస్తున్నామని వివరించారు. ప్రతీ నియోజక వర్గంలో ఒక ఏంఎస్ఎంఈ పారిశ్రామిక పార్క్ ఏర్పాటు చేయాలని తమ ప్రభుత్వం నిర్ణయించిందని సీఎం చంద్రబాబు తెలిపారు. ఇవాళ శంకుస్థాపన చేసిన 38 పార్కులతో పాటు వందపార్కులకు ఇప్పటికే శంకుస్థాపన చేశామని ప్రస్తావించారు. ఎలాంటి వివాదాలు లేకుండా ఈ పారిశ్రామిక పార్కులకు భూములు ఇచ్చిన రైతులకు ధన్యవాదాలు తెలిపారు. ప్రైవేటు పారిశ్రామిక పార్కులకు కూడా ఇన్సెంటివ్స్ ఇస్తామని స్పష్టం చేశారు. శ్రీసిటీ విజయవంతమైన పారిశ్రామిక పార్క్ అని చెప్పుకొచ్చారు. రూ.28 వేల కోట్ల కార్పస్ ఫండ్ డ్వాక్రా మహిళల సంఘాల వద్ద ఉందని తెలిపారు. ఈ ఏడాది 5 లక్షల మంది డ్వాక్రా సంఘాల మహిళలను ఎంటర్ ప్రెన్యూర్లుగా మారుస్తామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. కార్యక్రమంలో మంత్రులు టిజి భరత్, డోలా బాలవీరాంజనేయ స్వామి, శ్రీనివాస్, ఎంపి కేశినేని చిన్ని, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

## డైమండ్ హార్బర్‌లో బిజెపి అడుగు

ఇవ్వదని స్పష్టం చేశారు. ప్రణాళికాబద్ధంగా, నాణ్యతతో పనులు చేయాలని దిశానిర్దేశర చేశారు. హడావిడిగా పాచిపోయిన సిమెంట్‌తో పనులు చేస్తే అవి కూలిపోతాయని హెచ్చరించారు. గత పుష్కరాల్లో జరిగిన తొక్కిసలాట వంటి ఘటనలు మళ్లీ జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని పవన్ కల్యాణ్ సూచించారు. గోదావరి పుష్కరాలు అంటే కేవలం రాజమండ్రికే పరిమితం కాదని, 6 జిల్లాల్లోని 274 పంచాయతీల్లో ఏర్పాట్లు చేయాల్సి ఉంటుందని పవన్ కల్యాణ్ తెలిపారు. అన్ని ప్రాంతాల్లో భక్తులకు సమాన సౌకర్యాలు కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. పుష్కరాల పనుల సన్నద్ధతపై రాష్ట్ర కేబినెట్‌లో చర్చిస్తామని వెల్లడించారు. కేంద్ర నిధుల కోసం ప్రధానమంత్రి నరేంద్రమోదీ వద్దకు వెళ్లే సమయంలో అన్నివిధాలుగా సిద్ధంగా ఉండాలని అధికారులకు సూచించారు. గోదావరి నదిలో భక్తులు మురికినీళ్లలో స్నానం చేయడం సరికాదని పేర్కొన్నారు. గోదావరి కాలుష్య నివారణకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. గోదావరి పుష్కరాలను విజయవంతం చేయడానికి అధికారులు, ప్రజాప్రతినిధులు, అన్ని శాఖలు సమన్వయంతో కలిసి పనిచేయాలని పవన్ కల్యాణ్ దిశానిర్దేశర చేశారు. అలాగే, తూర్పుగోదావరి జిల్లా అధికారులతో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో గోదావరి నది కాలుష్యానికి కారణాలపై ఆరా తీశారు. క్లీన్ కృష్ణా, గోదావరి మిషన్ పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పరిశ్రమ వ్యర్థాలు ఎట్టి పరిస్థితుల్లోనూ నదుల్లో కలవకూడదని హుకుం జారీ చేశారు.

## నీట్ ప్రవేశ పరీక్షాపత్రం లీక్ కేసు

సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఎన్ని ఆదేశాలు జారీ చేసినా.. గత పేపర్ లీక్ ఘటనల నుంచి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఎలాంటి గుణపాఠాలు నేర్చుకోలేదని అత్యున్నత న్యాయస్థానం అసహనం వ్యక్తంచేసింది. ఈ వ్యవహారంపై ఎన్‌టీఏతో పాటు కేంద్రం, సీబీఐకి నోటీసులు జారీ చేసింది. ఈ ఏడాది మే 3వ తేదీన దేశవ్యాప్తంగా జరిగిన నీట్ యూజీ 2026 పరీక్షకు సంబంధించిన ప్రశ్నపత్రం లీకవడం వివాదాస్పదమైన సంగతి తెలిసిందే. అంతకుముందు 2024లోనూ ఈ పరీక్ష పేపర్ లీక్ చోటుచేసుకుంది. దీంతో ఏటా ఈ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తోన్న ఎన్‌టీఏపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలోనే వైద్య విద్య ప్రవేశపరీక్ష నిర్వహణ కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీకి బదులుగా ఓ స్వతంత్ర సంస్థను ఏర్పాటుచేయాలని కోరుతూ ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా మెడికల్ అసోసియేషన్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై సోమవారం విచారణ జరిపిన న్యాయస్థానం.. ఎన్‌టీఏ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసింది. 'ఎన్‌టీఏ తమ వైఫల్యాల నుంచి ఎలాంటి పాఠాలు నేర్చుకోకపోవడం విచారకరం. ఈ అంశం గతంలోనూ సుప్రీంకోర్టును చేరింది. అప్పుడు మానిటరింగ్ కమిటీని ఏర్పాటుచేశాం. ఆ కమిటీ కొన్ని ప్రతిపాదనలు చేయగా.. వాటిని ఎన్‌టీఏ అంగీకరించింది. మరి వాటి అమలు కోసం ఎలాంటి చర్యలు చేపట్టారో మేం తెలుసుకోవాలనుకుంటున్నాం. ఆ వివరాలకు సంబంధించి గురువారం లోగా అఫిడవిట్ దాఖలు చేయండని ధర్మాసనం ఎన్‌టీఏను ఆదేశించింది. దీంతో పాటు ఈ పిటిషన్‌పై తమ స్పందన తెలియజేయాలంటూ కేంద్రం, సీబీఐకి కూడా సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది.

## పెట్రో ధరల పెంపు ఎవరి కోసం

మల్లికార్జున ఖర్గే ఆందోళన వ్యక్తంచేశారు. ఈ రోజూవారీ దోపిడీ వల్ల ఎవరు లాభపడుతున్నారని ప్రశ్నించారు. సామాన్యుల పొదుపును తగలబెట్టడానికి మోదీ ప్రభుత్వం పెట్రోల్ చల్లుతోందని విమర్శించారు. 2014లో రూ.71.41 ఉన్న లీటర్ పెట్రోల్ ధరను మోదీ సర్కారు 2026 నాటికి రూ.102.12కు చేర్చిందని ఎద్దేవా చేశారు. రెండు వారాల లోపే పెట్రోల్, డీజిల్ ధరలను పెంచడం ఇది నాలుగోసారి అని.. ఈ రోజువారీ ఇంధన దోపిడీ ఇంకా ముగిసిపోలేదన్నారు. గత 12 ఏళ్లలో మోదీ ప్రభుత్వం ఇంధనంపై రూ.43 లక్షల కోట్లు దోచుకుందని దుయ్యబట్టారు. పెట్రోల్, డీజిల్ ధరలు నాలుగోసారి పెరగడంతో ఈరోజు హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్, ఐఓసీ షేర్లు వరుసగా 5.8, 4.44, 3.90 శాతం పెరిగాయన్నారు. ప్రజల అవసరాల కంటే లాభానికే ప్రాధాన్యం ఇవ్వడం భాజపా నైజమన్నారు. ఇంధన ధరల పేరుతో రైతుల నుంచి ఎంఎస్ఎంఈల వరకు, సమాజంలోని ప్రతి వర్గం భాజపా దోపిడీ భారాన్ని మోస్తోందన్నారు. దేశవ్యాప్తంగా నేడు మరోసారి భారీగా పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయి. లీటర్ పెట్రోల్‌పై రూ.2.84, డీజిల్‌పై రూ.2.86 చొప్పున ప్రభుత్వ రంగ చమురు సంస్థలు పెంచాయి. పెంచిన ధరలు ఇవాళ ఉదయం 6 గంటల నుంచి అమల్లోకి వచ్చాయి. కాగా ఇప్పటికే మూడు విడతలుగా పెట్రోల్, డీజిల్ ధరలను పెంచిన విషయం తెలిసిందే. దీంతో దిల్లీలో పెట్రోల్ ధర రూ.102.12, డీజిల్ రూ.95.20కు చేరింది. హైదరాబాద్‌లో లీటర్ పెట్రోల్ ధర రూ.115.58, డీజిల్ ధర రూ.103.74గా ఉంది.

## బిఆర్ఎస్ వచ్చాక 24 గంటల తాగునీరిస్తాం

ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రత్యేక ప్రజెంటేషన్ ఇచ్చారు. సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. కేసీఆర్ కట్టిన ఫ్లై ఓవర్లు, ఆసుపత్రులు, భవనాలను ఓపెన్ చేస్తూ తామే చేశామని అబద్ధాలు చెప్పుకుంటున్నారని మండిపడ్డారు. గతంలో కేవలం అభివృద్ధిపైన మాత్రమే దృష్టి సారించామని.. ఈసారి అధికారంలోకి వచ్చాక పార్టీకి అండగా ఉన్న కార్యకర్త, నాయకుడికి తగిన అవకాశం, గౌరవం కల్పిస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్, బీజేపీ నమోదు చేసిన దొంగ ఓట్లు, డూప్లికేట్ ఓట్ల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ఏ ఒక్కరి ఓటు కోల్పోకుండా బీఆర్ఎస్ శ్రేణులు పనిచేయాలని నేతలకు కేటీఆర్ దిశానిర్దేశర చేశారు. కేసీఆర్ ఒక్క రూపాయికే నల్లా కనెక్షన్ ఇచ్చి ఇంటింటికీ మంచినీటి గోస తీర్చారని కేటీఆర్ తెలిపారు. ఏడాదిన్నరలోనే కేసీఆర్ 24 గంటల కరెంటు ఇచ్చారని పేర్కొన్నారు. 2028లో మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి అవ్వడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో 24 గంటలు మంచినీళ్లు ఇస్తామని తెలిపారు. వ్యవసాయం, పరిశ్రమలకు కేసీఆర్ 24 గంటల కరెంటు ఇచ్చారని కేటీఆర్ తెలిపారు. 24 గంటలు మంచినీళ్లు ఇచ్చేది కూడా కేసీఆరే అని స్పష్టం చేశారు. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం దివాళా తీసిందని కేటీఆర్ తెలిపారు. ఇందిరాపార్క్ దగ్గర సెంట్రింగ్ కార్మికులు ఆందోళన చేస్తున్నారని పేర్కొన్నారు. సెంట్రింగ్ వర్కర్లు, నిర్మాణ రంగ కార్మికులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. మళ్లీ రాబోయేది కేసీఆర్.. గులాబీ జెండానే అని చెప్పారు. బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే మిమ్మల్ని ఆదుకుంటామని అన్నారు. సెంట్రింగ్ కార్మికులకు బీమాతో పాటు ఇతర సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తాం.. సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. కూకట్‌పల్లిలోని 15 డివిజన్లలో కొత్త అధ్యక్షులను నియమిస్తామని కేటీఆర్ తెలిపారు. జూన్‌లో బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. కూకట్‌పల్లిలో కార్పొరేటర్లు నిబద్ధత కలిసిన సైనికుల్లా పనిచేశారని అన్నారు. ఎవరైతే ప్రజల చుట్టూ తిరుగుతారో.. వాళ్లకే కార్పొరేట్ టికెట్లు ఇస్తామని పునరుద్ఘాటించారు. ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని బీఆర్ఎస్ నాయకులకు పిలుపునిచ్చారు. సర్వేల ఆధారంగా కార్పొరేటర్లకు టికెట్లు కేటాయిస్తామని చెప్పారు. డిజిటల్ పద్ధతిలో పార్టీ సభ్యత్వ నమోదు చేపడుతున్నామని తెలిపారు. సభ్యత్వ నమోదు తర్వాత కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సర్‌పై అవగాహన కల్పిస్తామని చెప్పారు. తెలంగాణలో 3.39 కోట్ల ఓటర్లు ఉన్నారని అన్నారు. రాష్ట్రంలో 35,985 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. మన పార్టీ తరఫున బూత్ లెవల్ ఏజెంట్లను ఏర్పాటు చేసుకున్నామని చెప్పారు. ప్రతి ఓటు విలువైనదే.. నా పోలింగ్ బూత్ నా బాధ్యత అనే స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో పేదలు సుఖంగా జీవించారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. తమ హయాంలో ఏ ఒక్కరినీ ఇబ్బంది పెట్టలేదని చెప్పారు. పేదలు తెలియక ప్రభుత్వ భూముల్లో ఇళ్లు కట్టుకుంటే జీవో 58, 59 కింద పట్టాలు ఇచ్చామని అన్నారు. రెండున్నర లక్షల మంది పేదలకు పట్టాలు ఇచ్చిన మహానాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. హైదరాబాద్ నగరంలో ఒక్క ఇందిరమ్మ ఇల్లు కట్టినట్లు చూపిస్తే నేను శాశ్వతంగా రాజకీయ సన్యాసం తీసుకుంటానని సవాలు విసిరారు. ఇందిరమ్మ రాజ్యం అంటూ శనివారం, ఆదివారం నాడు ఇండ్లు కూలగొట్టారని కేటీఆర్ మండిపడ్డారు. కూకట్‌పల్లిలో బుచ్చమ్మ ఇంటికి హైడ్రా అధికారులు నోటీసులు అంటించారని.. ఇల్లు పోతుందనే భయంతో ఆ మహిళ ఆత్మహత్య చేసుకుందని తెలిపారు. హైదరాబాద్‌లో ఒక్క ఇల్లు కట్టలేదు.. కానీ కూలగొట్టిన ఇండ్లు వేలల్లో ఉన్నాయని పేర్కొన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం అంటే ఇండ్లు కూలగొట్టే ప్రభుత్వమని ఎద్దేవా చేశారు. గుంపు మేస్త్రీ అంటే ఇళ్లను కట్టాలి కానీ రేవంత్ రెడ్డి మాత్రం ఇళ్లను కూలగొడుతున్నాడని మండిపడ్డారు. దేశం మొత్తం కాంగ్రెస్ దరిద్రాన్ని వదిలించు కున్నారని.. తెలంగాణలో మాత్రం ఆ దరిద్రాన్ని తెచ్చుకున్నామని అన్నారు. దొంగ గ్యారంటీ కార్డులతో కొంప ముంచారని మండిపడ్డారు. కేసీఆర్ కల్యాణ లక్ష్మికి రూ.లక్ష ఇస్తే.. కాంగ్రెస్ వాళ్లు అదనంగా తులం బంగారం ఇస్తామని అన్నారని గుర్తుచేశారు. రెండున్నరేళ్లలో కాంగ్రెస్ ఒక్క రూపాయి అయినా పెన్షన్ పెంచిందా అని కేటీఆర్ ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లయ్యిందని.. ఒక్కరికైనా రూ.2500 వచ్చాయా అని అడిగారు. కోడలుకు రూ.2500 ఇస్తామన్నాడని.. అత్తకు 4వేల పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చాడని తెలిపారు. ఇలా ప్రతి వర్గానికి శఠగోపం పెట్టారని అన్నారు. కేసీఆర్ హైదరాబాద్‌లో 350 బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేశారని కేటీఆర్ తెలిపారు. టీ హబ్ పేరిట డయాగ్నోస్టిక్ సెంటర్లు ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. నిజాం కట్టిన ఆస్పత్రులు తప్ప కాంగ్రెస్ ఒక్క ఆస్పత్రి కట్టలేదని అన్నారు. కేసీఆర్ హయాంలో నగరానికి నాలుగు వైపులా 4వేల పడకలతో టిమ్స్ పేరుతో 4 ఆస్పత్రుల నిర్మాణం చేపట్టామని తెలిపారు. కేసీఆర్ నిర్మాణం చేస్తే రేవంత్ రెడ్డి కత్తెర పట్టుకుని తిరుగుతున్నాడని విమర్శించారు.

విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY

## సంపాదకీయం

# కాంగ్రెస్, ఆప్ ఎజెండాతో కాక్రోచ్ పార్టీ

భారత రాజకీయాల్లో యువత ప్రవేశించాలి. నేతల అక్రమాలను ప్రశ్నించాలి. అక్రమాలను నిలదీయాలి. అక్రమార్కులను ఎండగట్టాలి. పాచిపోయిన విధానాలను తూర్పరా పట్టాలి. ఈ దేశానికి ఏది అవసరమో దానిని ఎజెండగా ముందుకు తీసుకుని రావాలి. కానీ యువత ఎందుకనో అచేతనంగా ఉంటోంది. ఓటు వేయడానికే బద్దకిస్తోంది. జెన్ జి అంటూ వార్తలు వస్తున్నా..గట్టిగా నిలబడి రాజకీయ అవినీతిని నిలదీయడం లేదు. రాజకీయ అక్రమాలను నిలదీయడం లేదు. కానీ కాక్రోచ్ జనతా పార్టీ పేరుతో ఆన్‌లైన్ వేదికగా పుట్టుకు వచ్చిన ఓ పార్టీకి కోట్లల్లో లైక్‌లు కొడుతూ..వస్తున్నారు. నిజంగానే ఈ పార్టీ పెట్టిన వారు..దీని లక్ష్యం గురించి ఆలోచిస్తే..అసలు విషయం బయటపడుతుంది. పక్కాగా కాంగ్రెస్, ఆప్ పార్టీల ఎజెండాతో ఇది అవతరించింది. ఇందులో ప్రధాన ఎజెండాలో ఉన్న ఐదు హామీలు కాంగ్రెస్, ఆప్‌లవే అని చెప్పాలి. ఈ రెండు పార్టీల సూత్రధారులుగా అభిజిత్ అన్న వ్యక్తి అమెరికా నుంచి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ద్వారా ప్రకటించిన ఈ పార్టీ కేవలం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత యువతను బొద్దింకలతో, పరాన్నజీవులతో పోల్చడం వల్లే జెన్‌జీ గొంతెత్తిందని ప్రచారం చేస్తున్నారు. అయితే ఇక్కడ జస్టిస్ సూర్యకాంత ఏ సమయంలో ఎవరిని ఉద్దేశించి, ఎందుకు బొద్దింకులు, పరాన్న జీవులు అన్నాడో తెలుసుకోకుండా ఇష్టం వచ్చినట్లుగా బొద్దింకల పార్టీ అంటూ ప్రకటించడం, దానికి గొర్రెల్లాగా మద్దతు తెలపడం దారుణం. ఇది ఓ రకంగా కోర్టు ధిక్కరణ కిందకు వస్తుంది. కొందరు ఫేక్ సర్టిఫికెట్లతో లాయర్లుగా, ఆర్టిఐ కార్యకర్తల్లాగా సమాజం మీద పడి పోతున్నారన్న సందర్భంగా జస్టిస్ట్ సూర్యకాంత బొద్దింకలు పదాన్ని వాడారు. నిజంగానే జెన్‌జీ పోరాటం చేయాల్సిన సామాజిక రుగ్మతలు ఉన్నాయి. పాలకుల దుష్ట పన్నాగాలను దునుమాడాలి. మన విద్యావ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నందుకు గొంతెత్తాలి. మన వైద్యారోగ్య రంగాన్ని ప్రైవేటుకు తాకట్టు పెట్టినందుకు నిలదీయాలి. స్వాతంత్రోద్యమ కాలంలోనూ, ఆ తరవాత కూడా యువత దేశంలో కీలక భూమిక పోషించింది. అసోంలో విదేశీ చొరబాట్లకు వ్యతిరేకంగా అస్సాగణపరిషత్ చేసిన పోరాటం అనన్యసామాన్యం. ఇలాంటివి ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. తెలంగాణ తొలిదశ, మలిదశలోనూ యువతే కీలక భూమిక పోషించింది. అయితే ఇవన్నీ పక్కన పెట్టి కేవలం కాంగ్రెస్, ఆప్ గేమ్ ప్లాన్‌లో యువత పడిపోవడం దౌర్భాగ్యం. నిజానికి చట్టసభల్లో అటు పార్లమెంటులోనూ,ఇటు అసెంబ్లీల్లోనూ కొన్ని కుటుంబాలే ఏళ్లుగా పట్టుకుని వేళ్లాడుతున్నాయి. ఆప్ చరిత్ర ఎవరికీ తెలియనిది కాదు. అన్నా హజారే అవినీతి వ్యతిరేక ఉద్యమాన్ని హైజాక్ చేసుకుని వచ్చిన అరవింద్ కేజ్రీవాల్ అవినీతిలో కూరుకుపోయారు. ప్రజల్లో కల్పించిన ఆశలను వమ్ముచేశారు. అన్నా హజారానేనే మోసం చేసి మనముందు ఇప్పుడు నిలబడ్డాడు. ఇకపోతే గబ్బిలాల్లాగా చట్టసభల్లో తరతరాలుగా కొందరే పట్టుకుని వేలాడుతున్నారు. ఒకే కుటుంబం నుంచి కొందరే పార్లమెంట్ లేదా, అసెంబ్లీల్లో ఉంటున్నారు. పార్లమెంటులో సోనియా, రాహుల్, ప్రియాంక ఉన్నారు. ఒకే కుటుంబం నుంచి వీరు ముగ్గురూ ఎందుకు ఉండాలి. అమిత్ షా కొడుకు ఏం అర్హత ఉందని బిసిసి అధ్యక్షుడయ్యారు. ఇలాంటివి ప్రశ్నించాలి. చంద్రబాబు కుటుంబంలో చంద్రబాబు, లోకేశ్, బాలకృష్ణ, శ్రీభరత్, పురందేశ్వరిలు మాత్రమే ఎందుకు ఉండాలి. తెలంగాణలో వెంకటస్వామి ఇద్దరు కొడుకులు వివేక్, వినోద్‌లు ఎమ్మెల్యేలుగా ఉన్నారు. వివేక కొడుకు వంశీ ఎంపిగా ఉన్నారు. వీరంతా ఎస్సీ రిజర్వ్ కేటగిరీలో ఎంపికయ్యారు. మల్లు భట్టివిక్రమార్క బ్రదర్స్, ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఆయన భార్య పద్మవతిలు కూడా ఒకే ఇంటినుంచి ఎమ్మెల్యేలుగా ఉన్నారు. వీరే నాయకులా..ఇక వేరే వారు లేరా. తెలంగాణ ఉద్యమంలో యువత బలిదానాలు చేస్తే...కెసిఆర్, ఆయన కొడుకు, కూతురు, అల్లుడు, ఇంకా కొందరు బంధువులు తెలంగాణను భ్రష్టు పట్టించి దోచుకున్నారు. ఇలాంటి ఉదాహరణలు కోకొల్లుగా ఉన్నాయి. జెన్‌జీ అని చెప్పకుంటున్న యువత వీటిని నిలదీయాలి. కొందరే ఎల్లకాలం ప్రజాప్రతినిధులుగా ఎందుకు ఉండాలో అడగాలి. ప్రస్తుత డిజిటల్ యుగంలో రాజకీయాలను విశ్లేషించే విధానం పూర్తిగా మారిపోయింది. గతంలో తీవ్రమైన చర్చలు, వీధిపోరాటాల ద్వారా సాగిన రాజకీయ నిరసన నేడు సామాజిక మాధ్యమాల వేదికగా జరుగుతున్నది. మీమ్స్, పొలిటికల్ సెటైర్ల రూపంలో సాగుతున్నది. ఈ క్రమంలో జెన్-జీ యువత సృష్టించిన సరికొత్త వ్యంగ్యాస్త్రమే 'కాక్రోచ్ జనతా పార్టీ'. ఇది నిజమైన రాజకీయ పార్టీ కాకపోయినా ప్రస్తుత రాజకీయ వ్యవస్థలోని లోపాలను, నాయకుల అవకాశవాదాన్ని ఎండగట్టే విధంగా సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నది. అయితే ముందే చెప్పినట్లు దీని ఎజెండా కేవలం కాంగ్రెస్, ఆప్ ఎజెండగా నిలవడమే పెద్ద లోపభూయిష్టంగా ఉంది. అసలు సమస్యలు వదిలి రిటైర్డ్ జడ్జిలని ఎంపిలుగా తీసుకో, ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను నిలదీస్తాం వంటివన్నీ కాంగ్రెస్ ఎజెండా. సుమారు 145 కోట్ల ఈ దేశ జనాభాలో 65శాతానికి పైగా జనాభా 35ఏండ్ల లోపు ఉన్నవారే. అంటే ప్రపంచంలోనే అత్యధిక యువతను కలిగిన దేశమిది. ఈ దేశ భవిష్యత్తును నిర్ణయించాల్సింది వీరే. వీరే ముందుండి నడపాల్సిన అసవరం ఉంది. అపారమైన శక్తి కలిగిన ఈ దేశ యువతను తప్పుదోవ పట్టించేలా అభిజీత్ దీప్కే సామాజిక మాధ్యమాల వేదికగా కాక్రోచ్ జనతా పార్టీ ఏర్పాటుకు ముందుకు రావడం, యువతను ఆకట్టుకోవడం చేశాడు. అంతవరకు మంచిదే అయినా, ఆయన గతమంతా ఆప్‌లో పనిచేసిన అనుభవాన్ని మరువ రాదు. అధికార బీజేపీ, ప్రతిపక్ష కాంగ్రెస్‌లకంటే కూడా 1.6 కోట్ల ఫాలోవర్స్‌తో దేశంలోనే అతిపెద్ద ఫాలోయింగ్ ఉన్నట్లుగా తేలింది. దేశంలో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా, ఏ సిద్ధాంతం గెలిచినా.. కొందరు నాయకులు మాత్రం తమ పదవులను, ఉనికిని కాపాడుకోవటానికి రాత్రికి రాత్రే అధికార పార్టీలోకి మారిపోతుంటారు. సిద్ధాంతాలు, విలువలతో సంబంధం లేకుండా ఎల్లప్పుడూ అధికారంలో కొనసాగే అవకాశవాద, ఫిరాయింపు నాయకులను ఈ బొద్దింకల పార్టీ నిలదీయగలిగితే మంచిదే. మన దేశ యువతరం ఆలోచనలు ఎంత ఉన్నతంగా ఆలోచనాత్మకంగా ఉన్నాయనేదానికి వారి కార్యాచరణ ముఖ్యం. సమాజంలో పెరుగు తున్న అవినీతిని, రాజకీయ అస్థిరతను సంస్కరించేందుకు యువత నడుం బిగించాలి. ప్రజాస్వామ్యంలో పాలకులను ప్రశ్నించటానికి, విమర్శించటానికి ఆరోగ్యకర మైన వేదిక అవసరం ఉంది. దేశంలో నిరుద్యోగాన్ని పెంచిపోషిస్తున్న పాలకులను ఎంతమాత్రం క్షమించ రాదు. వారు ఏ పార్టీ వారైనా నిలదీయల్సిందే. ప్రజల ముందు దోషులగా నిలబెట్టాల్సిందే. నీట్ పరీక్షా పత్రం లీకేజీపై కూడా నిలదీయాల్సిందే. నేర చరిత్రలేని నాయకులు చట్టసభల్లో ఉండాలి. దేశం కోసం పాటుపడేవారంతా ప్రశ్నించటం నేర్చుకున్నప్పుడే భారత ప్రజాస్వామ్యం బలపడుతుంది. ప్రశ్నించడం మంచిదే అయితే, అనేక అంశాలను ప్రశ్నించడం ఎజెండాగా చేసుకుంటే మంచిది. అంతే తప్ప మరో రాజకీయ పార్టీ సృష్టించిన వేదిక ద్వారా చేయడం మాత్రం సరికాదు.

# అలరించిన కబిత ప్రధాన్ మ్యూజికల్ నైట్

హైదరాబాద్ మే 2026, విజన్ ఆంధ్ర ( ఆకెళ్ళ. విశ్వనాథ్) : ప్రఖ్యాత సంస్కృతిక సేవా సంస్థ, "కాస్ ఫౌండేషన్, కాస్ మ్యూజిక్" ఆధ్వర్యంలో ప్రముఖ ప్లేబ్యాక్ సింగర్, ఆర్గనైజర్ 'కబిత ప్రధాన్' నేతృత్వంలో నగరానికి చెందిన ప్రముఖ గాయనీ గాయకులతో కలిసి లైవ్ ఆర్కెస్ట్రాతో సమర్పించిన "ప్యార్ కర్లే ఘడి దో ఘడి" కబిత ప్రధాన్ మ్యూజికల్ నైట్ కార్యక్రమం ప్రేక్షకులను విశేషంగా, అద్భుతంగా అలరించింది. ఆదివారం సాయంత్రం రవీంద్ర భారతి మెయిన్ హాల్లో ఏర్పాటు చేసిన ఈ కబిత ప్రధాన్ మ్యూజికల్ నైట్ లో ప్రముఖ గాయనీయమనిణి దివంగత 'ఆశాభోంస్లే' సినీ హిట్స్ పాటలను గాయనీ గాయకులు ఎంతో సుమధురంగా ఆలపించి ప్రేక్షకుల హృదయాలను దోచుకున్నారు. గౌరవ అతిథులుగా లీనా రవి గురువు హిందూస్తాని ఒకెలిస్ట్, హెచ్.కె ఉమేష్, రిటైర్డ్ సిఐ పోలీస్, నాగరాజు. అడ్వకేట్, కల్నల్ శ్రీ నగేష్, ఎండి . తస్కీన్ సహారా గ్రూప్ ఇతర ప్రముఖులు హాజరై గాయకులను సత్కరించి శ్రవణానందకరంగా కార్యక్రమాన్ని నిర్వహించి మెప్పించిన నిర్వాహకరాలు కబిత ప్రధాన్ ని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.









తెలంగాణ ప్రభుత్వ భాష సంస్కృతిక శాఖ సహాయంతో ప్రముఖ సామాజిక కార్యకర్త 'అభిజిత్ భట్టాచార్జీ', గ్రామీ జ్యూరీ, గిమా విజేత 'ప్రొద్యుత్ ముఖర్జీ' నిర్వహణలో ప్రసిద్ధ పాటియాలా ఘరానాకు చెందిన ప్రముఖ నేపథ్య గాయకుడు, గాత్ర కళాకారుడు 'రాఘవ్ చటర్జీ' నేపథ్యంలో క్లాసికల్ కాన్సెప్ట్ సిరీస్ 2026 – సీజన్ 6 – కార్యక్రమం శనివారంనాడు రవీంద్ర భారతి, మెయిన్ హాల్, సైఫాబాద్, హైదరాబాద్ లో సంగీత ప్రియుల నడుమ శ్రవణానందకరంగా, ఆనందమయంగా జరిగింది.

– (ఆకెళ్ళ. విశ్వనాథ్).

# జర్నలిస్టును బెదిరించిన సింగల్ విండో ప్రెసిడెంట్ కృష్ణారెడ్డి పై కేసు నమోదు చేసిన పోలీసులు

మైదుకూరు, మే 25 (విజన్ ఆంధ్ర) పోరుమామిళ్ళకు చెందిన జర్నలిస్టు శ్రీనివాసులను దుర్భాషలాడి, ప్రాణభీతి కలిగించేలా బెదిరింపులకు పాల్పడిన పోరుమామిళ్ల సింగిల్ విండో ప్రెసిడెంట్ కల్లూరి వెంకట కృష్ణారెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మైదుకూరు డీఎస్పీ ఆదేశాల మేరకు పోరుమామిళ్ల పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోరుమామిళ్లకు చెందిన సీనియర్ రిపోర్టర్ దియ్యాల శ్రీనివాసులు ప్రైమ్ 9 టీవీలో పోరుమామిళ్ల, కలసపాడు, బి.కోడూరు, శ్రీ అవధూత కాశినాయన మండలాల రిపోర్టర్‌గా పనిచేస్తున్నారు. కాగా, పోరుమామిళ్ల సింగిల్ విండో ప్రెసిడెంట్‌గా ఉన్న కల్లూరి వెంకట కృష్ణారెడ్డి, ప్రైమ్ 9 సంస్థకు చెందిన క్యాలెండర్ ప్రకటన (అడ్వర్టైజ్‌మెంట్) నిమిత్తం రూ. 15,000 ఇవ్వాల్సి ఉంది. అయితే ఐదు నెలలు గడిచినా సదరు మొత్తాన్ని ఇవ్వకుండా కాలయాపన చేస్తూ వచ్చారు. ఈ నెల 23న ఉదయం, సాయంత్రం వేళల్లో జర్నలిస్ట్ శ్రీనివాసులు ఫోన్ చేసి డబ్బులు అడిగినప్పటికీ కృష్ణారెడ్డి నుంచి స్పందన కరువైంది. దీంతో ఆయన కృష్ణారెడ్డి ఇంటికి వెళ్లడంతో. ఆ సమయంలో కృష్ణారెడ్డి తీవ్ర ఆగ్రహంతో ఊగిపోతూ.. జర్నలిస్టును నోటికొచ్చినట్లు దుర్భాషలాడటమే కాకుండా, తల్లిని దూషిస్తూ అసభ్య పదజాలంతో విరుచుకుపడ్డారు. కర్రతో దాడి చేయడానికి ప్రయత్నించాడడు. బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ బద్వేల్ నియోజకవర్గం అధ్యక్షుడు ఆవుల కిషోర్, ప్రధాన కార్యదర్శి ఉప్పలపాటి రఘురాములు, నరసింహ, సురేష్ బాబు, అన్నిక కిషోర్, కమల్, భాస్కర్ రెడ్డి, శ్రీకాంత్, ప్రసాద్, మైదుకూరు డీఎస్పీని కలిసి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. జర్నలిస్టుపై దాడి ప్రయత్నం, బెదిరింపుల ఉదంతాన్ని తీవ్రంగా పరిగణించిన డీఎస్పీ, తక్షణమే కేసు నమోదు చేయాలని స్థానిక పోలీసులను ఆదేశించారు. డీఎస్పీ ఆదేశాల మేరకు పోరుమామిళ్ల ఎస్ఐ పి. హనుమంతు స్పందించి, మే 24న సింగిల్ విండో ప్రెసిడెంట్ వెంకట కృష్ణారెడ్డిపై ఎఫ్ఐఆర్ (నెం. 65/2026) నమోదు చేశారు. కొత్త చట్టం (దీచీూ) లోని సెక్షన్లు 126(2), 351(2) కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేసినట్లు పోలీసులు తెలిపారు.



# ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ఉండాలి

**- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**



నిర్మల్ జిల్లా, మే 25,(విజన్ ఆంధ్ర); ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఆయన స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆయా శాఖల అధికారులు ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా, ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను కలెక్టర్ కు సమర్పించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మౌలాలి సర్కిల్ కార్యాలయంలో అందుబాటులో లేని అధికారులు

**- చుట్టపు చూపుగా వచ్చిపోతున్న అధికారులు**
**- ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువు... ప్రజల ఇబ్బందులు**




మల్కాజిగిరి, మే 25,(విజన్ ఆంధ్ర): మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మౌలాలి సర్కిల్ కార్యాలయంలో అధికారులు అందుబాటులో ఉండటం లేదని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ నిరంతరం సేవలందించాల్సిన అధికారులు, సమయ పాలన పాటించకపోవడంతో వివిధ పనులు నిమిత్తం ఈ కార్యాలయానికి వచ్చే పలు కాలనీల ప్రజలకు ఇక్కడ ఖాళీ కుర్చీలు కనిపిస్తుం డటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అసలు అధికారులు సర్కిల్ కార్యా లయానికి వస్తున్నారా...? వస్తే వారు ఎక్కడ ఉంటున్నారు...ఏ పనులు నిమిత్తం వారు బయట ఉంటున్నారని సమాధానం చెప్పే నాధుడే లేడు. దీంతో అధికారుల ఇష్టారాజ్యంగా మారింది. ఎప్పుడో నెలకు ఒకసారి జీతాలు వచ్చే రోజున ఉదయం వచ్చి టంచన్ గా వచ్చి, అటెండెన్స్ బుక్ లో సంతకాలు చేసి జీతాలు జేబులో నింపుకుని వెళ్ళడమే తప్పా, ఏ రోజు వారు కనిపించరని మౌలాలి సర్కిల్ ప్రజలు ఆరోపిస్తున్నా రు. ప్రజలు నుంచి వస్తున్న ఫిర్యాదుల మేరకు సోమవారం...'విజన్ ఆంధ్ర' దినపత్రిక విలేఖరి మౌలాలి సర్కిల్ కార్యాలయం విజిట్ చేయగా ఖాళీ కుర్చీలు కనబడడం గమనార్హం. ఇలా పలు మార్లు ఈ కార్యాల యంలో ఖాళీ కుర్చీలే విజన్ ఆంధ్ర విలేఖరికి కనిపిం చాయి. ఇకనైనా మల్కాజి గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి స్పందించి, మౌలాలి సర్కిల్ కార్యాలయంపై డేగ కన్ను వేసి, ఇక్కడ పని చేసే అధికారులు ఉదయం నుండి సాయంత్రం 5 గంటల వరకు ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

**ఫీల్డ్ విజిట్ పేరుతో విధులకు దుమ్మా...?**

ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న అధికారులు, ఫీల్డ్ విజిట్ సాకుతో తమ విధులకు దుమ్మా కొడుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కొత్తగా ఏర్పడిన మౌలాలి సర్కిల్ కార్యాలయం వల్ల ఈ ప్రాంత ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేకుండా పోయింది. ఇందులో పని చేసే అధికారుల నిర్లక్ష్యంతో కనీసం కాలనీలలో కనీస సదుపాయాలు కూడా కరువైనాయి. దీనికి ఈ కార్యాలయంపై ఉన్నతాధికా రుల పర్యవేక్షణ లోపమే కారణమని తెలుస్తోంది. అందుకే ఇక్కడ అధికారులు తమ ఇష్టానుసారంగా వ్యవహారిస్తున్నారని ప్రజలు వారి పని తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు, పర్యవే క్షణ జరిపి అధికారులు, విధులకు హాజరై ప్రజలకు సేవలందించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# వాస్తవాధారిత వివరాలతో వినతులు సమర్పించాలి

## డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా పిలుపు



కడప,మే 25 (విజన్ ఆంధ్ర) గ్రామీణ, పట్టణ ప్రాంత స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల అమలుకు సంబంధించి సమగ్ర అధ్యయనం చేస్తున్న "డెడికేటెడ్ కమిషన్"కు వాస్తవాధారిత సమాచారంతో కూడిన వినతులనే సమర్పించాలని ప్రజలు, కుల సంఘాలు, ప్రజాప్రతినిధులకు డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా (రిటైర్డ్) సూచించారు.సోమవారం కడప కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్ డాక్టర్ సి.మల్లికార్జునతో కలసి జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధ్యక్షతన నిర్వహించిన "గ్రామీణ పట్టణ ప్రాంత స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల అమలు"పై అధ్యయనం మరియు వినతుల స్వీకరణ" కార్యక్రమంలో డెడికేటెడ్ కమిషన్ రాజీవ్ రంజన్ మిశ్రా పాల్గొని ప్రసంగించి అనంతరం విజ్ఞప్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా రాజీవ్ రంజన్ మిశ్రా ఐఏఎస్ (రిటైర్డ్) మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జి.ఓ.ఎం.ఎస్. నెం.03, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ద్వారా గౌరవ సుప్రీంకోర్టు వివిధ తీర్పుల మేరకు ట్రిపుల్ టెస్ట్ నిబంధనలను అమలు చేయడానికి ఈ డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్ల శాతం నిర్ణయించేందుకు రాజ్యాంగబద్ధంగా, శాస్త్రీయంగా,అనుభవాధారితంగా అధ్యయనం చేయడం కమిషన్ ప్రధాన ఉద్దేశమని వివరించారు. బీసీల సామాజిక, ఆర్థిక, రాజకీయ వెనుకబడిన స్థితిగతులు ఏ మేరకు ఉన్నాయో క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి, వాటి ప్రభావాన్ని అంచనా వేయడం జరుగుతుందని చెప్పారు. ప్రజల నుంచి వచ్చే వినతులు,మెమోరాండములు కమిషన్‌కు ఎంతో ఉపయోగపడతాయని, అందులో పేర్కొనే ప్రతి అంశం వాస్తవాధారితంగా ఉండాలని స్పష్టం చేశారు. వినతిపత్రాలతో పాటు సంబంధిత పత్రాలు, ఆధారాలు,గణాంకాలు, నివేదికలు, ధృవీకరణ పత్రాలు కూడా సమర్పించాలని సూచించారు. తమ వద్ద లేని పత్రాలు ఎవరి నుంచి పొందవచ్చో వారి వివరాలను కూడా తెలియజేయాలని కోరారు. కమిషన్ పరిశీలనలో పారదర్శకత, నిష్పాక్షికతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని పేర్కొన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించేందుకు రాజ్యాంగ నిబంధనలకు అనుగుణంగా సమగ్ర నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పిస్తామని రాజీవ్ రంజన్ మిశ్రా తెలిపారు. ఈ ప్రక్రియ లో ప్రజల భాగస్వామ్యం కీలకమని,బీసీల స్థితిగతులపై అవగాహన ఉన్న ప్రతి ఒక్కరూ తమ అభిప్రాయాలను తెలియజేయాలని పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ డాక్టర్. శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ. ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాల ప్రకారం జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తోందన్నారు. కమిషన్ నిర్వహిస్తున్న అధ్యయనం బీసీ వర్గాల భవిష్యత్తు ప్రాతినిధ్యానికి కీలకమైందని పేర్కొన్నారు. ప్రజలు సమర్పించే వినతులు సమగ్రంగా, స్పష్టంగా ఉండేలా అధికారులు మార్గనిర్దేశనం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పి సీఈఓ సుబ్రమణ్యం, డిపిఓ వెంకట సుబ్బయ్య, సీపీఓ హజరతయ్య, జిల్లా బిసి సంక్షేమ మరియు సాధికారిత అధికారి ఎస్.కృష్ణ, మున్సిపల్ కమిషనర్లు,కడప, అన్నమయ్య జిల్లాల సంబంధిత శాఖల అధికారులు,కుల సంఘాల ప్రతినిధులు,ప్రజా ప్రతినిధులు,పౌర సమాజ సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

**- వర్షాలకంటే ముందే కొనుగోలు పూర్తి చేయాలి**
**- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి**



నిర్మల్ జిల్లా, మే 25,(విజన్ ఆంధ్ర); జిల్లాలో వరి, మొక్కజొన్న ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి సూచించారు. వర్షాకాలం ప్రారంభానికి ముందే కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆదివారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయిలో వరి, మొక్కజొన్న ధాన్యం కొనుగోళ్లపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, సంబంధిత శాఖల అధికారులతో కలిసి కొనుగోలు కేంద్రాల పరిస్థితి, ధాన్యం తరలింపు, నిల్వ సామర్థ్యాలపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, రైతులు పండించిన ధాన్యం కొనుగోలు విషయంలో ఎక్కడా ఆలస్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. మండలాల వారీగా వివిధ ఏజెన్సీల ఆధ్వర్యంలో జరుగుతున్న కొనుగోళ్ల పురోగతిని సమీక్షించారు. కొనుగోలు కేంద్రాల్లో సరిపడినన్ని లారీలు అందుబాటులో ఉంచడంతో పాటు, హమాలీల సంఖ్యను పెంచి ధాన్యం తరలింపును వేగవంతం చేయాలని సూచించారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో రైతులకు తాగునీరు, నీడ, కూర్చునే ఏర్పాట్లు వంటి మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా మాట్లాడుతూ, జిల్లాలో వరి, మొక్కజొన్న కొనుగోళ్లు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రభుత్వ ఏజెన్సీల లారీలతో పాటు ఇతర రవాణా సౌకర్యాలను వినియోగించి ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నట్లు వెల్లడించారు. ధాన్యం నిల్వ కోసం ప్రభుత్వ, ప్రైవేటు గోదాములు, రైస్ మిల్లులు, జిన్నింగ్ మిల్లులు, రైతు వేదికలు, అవసరమైన చోట్ల ప్రైవేటు ఫంక్షన్ హాలులను కూడా వినియోగిస్తున్నట్లు వివరించారు. రైతులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా సంబంధిత అధికార యంత్రాంగం క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు. అంతకుముందు కలెక్టరేట్‌కు చేరుకున్న రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డికి జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పూలమొక్క అందించి స్వాగతం పలికారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, అదనపు ఎస్పీ సాయికిరణ్, ఆర్డీఓ రత్నకళ్యాణి, పౌర సరఫరాల శాఖ, రెవెన్యూ శాఖ అధికారులు, వ్యవసాయ, మార్కెట్ కమిటీ చైర్మన్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిభకు అండ

## - ఎంబీబీఎస్ విద్యార్థినికి సీఐ రాజువర్మ ఆర్థికసాయం





చర్ల, మే 25 (విజన్ ఆంధ్ర): కష్టపడి చదివి వైద్య విద్య (ఎంబీబీఎస్) సీటు సాధించిన మండల పరిధిలోని ఓ పేద విద్యార్థిని ప్రతిభకు అండగా నిలిచారు, చర్ల సర్కిల్ ఇన్స్పెక్టర్ (సీఐ) రాజువర్మ, దుమ్ముగూడెం మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన అపక శ్రీనిధి ఇటీవల ఎంబీబీఎస్ సీటు సాధించింది, ఆమె ఉన్నత చదువులకు మద్దతుగా సీఐ ఆలం రాజువర్మ తన మిత్ర బృందంతో కలిసి ముప్పై వేల రూపాయల నగదును సోమవారం శ్రీనిధికి ఆర్థిక సహాయంగా అందజేశారు, ఈ సందర్భంగా సీఐ రాజువర్మ మాట్లాడుతూ, గ్రామీణ నేపథ్యం నుండి వచ్చి, ఎన్నో అడ్డంకులను అధిగమించి వైద్య సీటు సాధించడం ఎంతో అభినందనీయమన్నారు, శ్రీనిధి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకుని, పేద ప్రజలకు, సమాజానికి నిస్వార్థ సేవలు అందించే మంచి వైద్యురాలిగా ఎదగాలని ఆకాంక్షించారు, ప్రతిభ ఉన్న విద్యార్థులకు సమాజం నుంచి ఇలాంటి ప్రోత్సాహం ఎంతో అవసరమని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థిని వైద్య విద్యకు ఎంపిక కావడంపై స్థానిక నాయకులు హర్షం వ్యక్తం చేశారు, ఈ కార్యక్రమంలో నారాయణరావుపేట సర్పంచ్ కల్లూరి ఆదినారాయణ, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు ముగ్రం వీరభద్రం, సోడి చలపతి, ఆదివాసీ సీనియర్ నాయకులు పాయం సత్యనారాయణ, కల్లూరి కోగ్రాజు, కొర్స మరయ్య తదితరులు పాల్గొని శ్రీనిధిని శాలువాతో సత్కరించి, ఉజ్వల భవిష్యత్తును కాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రజావాణి దరఖాస్తులకు సమస్యలను వెంటనే పరిష్కరించాలి

**- జిల్లా కలెక్టర్ భోర్ఖడే హేమంత్ సహదేవరావు**



ములుగు మే 25; విజన్ ఆంధ్ర ప్రతినిధి : సోమవారం: కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అర్జీదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 113 దరఖాస్తులు రాగా, వాటిలో ఇందిరమ్మ ఇళ్లకు 25, పెన్షన్లకు 51, ఇతర శాఖలకు సంబంధించినవి 37 దరఖాస్తులు అందగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత శాఖల అధికారులకు పంపించడం జరిగిందని తెలిపారు. వచ్చిన దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించి, సమస్యను పరిష్కరించాలని, ప్రజలకు జవాబుదారీతనంతో వ్యవహరించాలని అధికారులకు సూచించారు. గతవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తుల స్థితిగతులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఏదైనా కారణాలవల్ల క్రింది స్థాయి కార్యాలయాల్లో సమస్యను పరిష్కరించలేకపోతే, వాటికి సంబంధించిన పూర్తి వివరాలను ఫిర్యాదుదారునికి తెలియజేయాలని, పై స్థాయి కార్యాలయంలో ఏ అధికారికి, ఏ విధంగా తమ సమస్యను తెలియజేయాలో క్షుణ్ణంగా వివరించాలని స్పష్టం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజావాణి దరఖాస్తులు అధికారుల వద్ద పెండింగ్‌లో ఉండకూడదని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు సి.హెచ్. మహేందర్ జీ, సంపత్ రావు, అన్ని శాఖల జిల్లా అధికారులు, అన్ని మండలాల ఎమ్మార్వోలు, ఎంపీడీవోలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

**- అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్**



వనపర్తి జిల్లా ప్రతినిధి, మే 25 (విజన్ ఆంధ్ర) : ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను అధికారులు సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్యా నాయక్ ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లాస్థాయి ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జిల్లా రెవెన్యూ అధికారి సూర్య ప్రకాష్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తిరుపతయ్య తో కలిసి ప్రజల నుంచి అర్జీలు, వినతి పత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ అధికారులకు సూచనలు ఇస్తూ, ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులకు ఎప్పటికప్పుడు పరిష్కరించి సమాచారాన్ని సంబంధిత ఫిర్యాదు దారునికి పంపించటమే కాకుండా ఆన్లైన్ లో పెట్టాలని ఆదేశించారు. ఒకవేళ ఫిర్యాదుకు సంబంధించిన అంశం తమ శాఖ పరిధిలో లేనిది అయితే సంబంధిత శాఖకు లేఖ రాస్తూ పంపించాలని తెలియజేశారు. పరిష్కరించలేని అంశం ఏదైనా ఉంటే పై అధికారులకు పంపించడం లేదా ఏ నిబంధన ప్రకారం పరిష్కారం చేయలేమో ఫిర్యాదు దారునికి తెలియజేయాలి తప్ప తమ వద్ద పెండింగ్ లో పెట్టుకోవద్దని సూచించారు. పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి, వెంటనే పరిష్కరించేలా తగు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. సీఎం, జిల్లా మంత్రి ప్రజావాణి నుంచి వచ్చి పెండింగ్ లో ఉన్న అర్జీలను సైతం సత్వరం పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. నేటి ప్రజావాణి కార్యక్రమంలో 53 దరఖాస్తులు వచ్చాయి. ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఆరు దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## వడ్లు తడవకుండా వేగంగా కొనుగోలు చేయండి

**- పౌర సరఫరాల శాఖ సంచాలకులు శ్యాంప్రసాద్ లాల్**



వనపర్తి జిల్లా ప్రతినిధి, మే 25 (విజన్ ఆంధ్ర) : వడ్లు వర్షానికి తడిచిపోయి రైతులు నష్టపోకుండా ప్రణాళికబద్ధంగా కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని పౌర సరఫరాల శాఖ సంచాలకులు శ్యాంప్రసాద్ లాల్ ఆదేశించారు. సోమవారం ఐ.డి. ఓ సి కాన్ఫరెన్స్ హాల్లో ఉమ్మడి జిల్లా సివిల్ సప్లై అధికారులు, డి.యం లు, కోపరేటివ్ అధికారులు, రవాణా శాఖ అధికారులతో వడ్లు కొనుగోలుపై సమీక్ష నిర్వహించారు. అకాల వర్షాల వల్ల వడ్లు తడిచిపోతే ప్రభుత్వానికే నష్టమని, ధాన్యం తడిచిపోయినను ప్రభుత్వం కొనుగోలు చేయక తప్పదని చెప్పారు. వర్షాకాలం ప్రారంభం కాకముందే ధాన్యం తడిచిపోకుండా కొనుగోలు ప్రక్రియ పూర్తి అయ్యేవిధంగా ప్రణాళికబద్ధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో ప్రస్తుతం ఉన్న వడ్లు ఎన్ని? ఇంకా రైతుల నుండి రానున్న వడ్లు ఎన్ని అనేది ఖచ్చితమైన లెక్కలు తెలిసి ఉండాలని చెప్పారు. తేమ వచ్చిన వడ్లు వెంటనే తూకం వేసి తరలించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం నుండి ధాన్యం కొనుగోలుకు అవసరమైన అన్ని వసతులు కల్పిస్తామని, జిల్లాలో కొనుగోలు చేసిన ధాన్యం ఎక్కడ నిల్వ చేసుకోవాలి, హమాలీల కొరత లేకుండా చూసుకోవడం, అన్లోడింగ్ ప్రక్రియ వేగవంతం చేయడం వంటి చర్యలు జిల్లా అధికారులు తీసుకోవాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని దగ్గరలోని మిల్లులకు తరలించడానికి ట్రాక్టర్లు ఉపయోగించుకోవాలని, ధాన్యం దింపుకునే కేంద్రాల సంఖ్య సాధ్యమైనంత ఎక్కువ మొత్తంలో పెంచాలని ఆదేశించారు. రాష్ట్రంలో గన్ని బ్యాగుల కొరత లేదని వడ్లు ఎప్పటికప్పుడు తూకం వేసి కొనుగోలు చేయాలని సూచించారు. బ్లాక్ లిస్టులో ఉన్న మిల్లులో వడ్లు నిల్వ చేసుకోడానికి ఉపయోగించుకోవాలని సూచించారు. సి.యం.ఆర్ ప్రక్రియను సైతం వేగవంతం చేయాలని సూచించారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి కాశి విశ్వనాథ్, మహబూబ్ నగర్ సివిల్ సప్లై అధికారి శ్రీనివాస్, ట్రాన్స్పోర్ట్ అధికారి మానస, కోఆపరేటివ్ అధికారి బి. రాణి, నారాయణపేట, నాగర్ కర్నూల్ జిల్లాల పౌర సరఫరాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఇచ్చిన మాటకు కట్టుబడి పాల్వంచ ప్రజల చిరకాల సమస్యకు పరిష్కారం చూపిన ఎమ్మెల్యే కూనం నేని సాంబశివరావు .పొంగులేటి శ్రీనన్న



పాల్వంచ ప్రతినిధి మే 25(విజన్ ఆంధ్ర) : పాల్వంచలోని 444, 727, 817, 999 సర్వే నెంబర్ల భూములను రెగ్యులరైజ్ చేయాలని గత ప్రభుత్వాలకు ఎన్నోసార్లు మెమోరాండాలు ఇవ్వడం జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కూడా ప్రజల తరఫున పదేపదే వినతిపత్రాలు అందజేయడం జరిగింది. ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలల్లో సమస్యను పరిష్కరిస్తామని మంత్రులు హామీలు ఇచ్చినా, మూడు సంవత్సరాలు పూర్తవుతున్నా ఇప్పటికీ పూర్తి స్థాయి పరిష్కారం కనిపించలేదు. ఈ సమయంలో ప్రజల సమస్యను తన సమస్యగా భావించిన కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అసెంబ్లీ వేదికగా ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీశారు. ప్రజల తరఫున ధైర్యంగా స్వరం వినిపిస్తూ, మంత్రులను నేరుగా ప్రశ్నించి పాల్వంచ ప్రజల ఆవేదనను రాష్ట్ర స్థాయికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే గారి పోరాటంతో ఈ సమస్య సీఎం రేవంత్ రెడ్డి గారి దృష్టికి వెళ్లి, వెంటనే సర్వే నిర్వహణకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్య పరిష్కార దిశగా కదలడం ఎమ్మెల్యే గారి కృషికే నిదర్శనం. పదవికోసం కాదుడ ప్రజల హక్కుల కోసం పోరాడే నాయకుడు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పాల్వంచ ప్రజల తరఫున ఎమ్మెల్యే పోరాటానికి ఫలితం అని ప్రజలు ఆనందాన్ని వ్యక్తం చేశారు.

# ప్రభుత్వ తోడ్పాటును సద్వినియోగం చేసుకోవాలి

**- అద్దె బస్సుల పంపిణీ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి**

**- పాల్గొన్న కలెక్టర్ ఇలా త్రిపాఠి**



నిజామాబాద్, మే 25 :( విజన్ ఆంధ్ర) ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తోందని ప్రభుత్వ సలహాదారు, బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్ రెడ్డి అన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే మహోన్నత సంకల్పంతో మహిళల అభ్యున్నతి కోసం విస్తృత కార్యక్రమాలను అమలు చేస్తోందని గుర్తు చేశారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మహిళా సంక్షేమ వారోత్సవాన్ని పురస్కరించుకుని మండల మహిళా సమాఖ్యలకు ప్రభుత్వం కేటాయించిన ఆర్టీసీ అద్దె బస్సులను వారికి అందజేశారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి జెండా ఊపి బస్సులను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, మహిళల అభ్యున్నతి కోసం ప్రభుత్వం విరివిగా రుణాలు అందించడమే కాకుండా సోలార్ విద్యుత్ ప్లాంట్లు, పెట్రోల్ బంకులు, ఆర్టీసీ అద్దె బస్సులు, స్కూల్ యూనిఫాంల స్టిచింగ్, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ వంటి ద్వారా మహిళల ఆర్థిక ప్రగతికి తోడ్పాటును అందిస్తోందని గుర్తు చేశారు. ఇందిరమ్మ ఇళ్ళను, రేషన్ కార్డులను కూడా మహిళల పేరిట మంజూరు చేస్తోందని అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండున్నర సంవత్సరాల స్వల్ప కాలంలోనే కేవలం నిజామాబాద్ జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల పరిధిలోని మహిళా స్వయం సహాయక సంఘాలకు.రూ. 1100 కోట్ల ఆర్థిక సహాయం అందించడం జరిగిందని తెలిపారు. కేవలం మహిళలు అనే కాకుండా అన్ని వర్గాల వారి అభ్యున్నతికి కృషి చేస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు ప్రతిపక్షాలకు ఎంతమాత్రం లేదన్నారు. ప్రజలు కూడా వాస్తవాలను గమనించాలని, సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు పెద్దపీట వేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలని కోరారు. మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు తమ పిల్లల చక్కటి భవిష్యత్తు కోసం అన్ని వసతులు, నాణ్యమైన విద్యను అందిస్తున్న ప్రభుత్వ బడులలో చేర్పించాలని, ప్రభుత్వ ఆసుపత్రుల సేవలను వినియోగించుకోవాలని, తద్వారా అనవసర ఆర్థిక దుబారాను నివారించుకోవాలని హితవు పలికారు. అదేవిధంగా ప్రజలకు ఆరోగ్యాల పరిరక్షణకు దోహదపడే ఆహార ఉత్పత్తులను తయారు చేయాలని సూచించారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, మహిళల గౌరవాన్ని మరింతగా ఇనుమడింపజేసేలా ప్రభుత్వం విస్తృత స్థాయిలో కార్యక్రమాలు అమలు చేస్తోందని గుర్తు చేశారు. ఇందులో భాగంగానే జిల్లాకు 18 అద్దె బస్సులను కేటాయించిందని తెలిపారు. అద్దె బస్సుల నిర్వహణను పక్కాగా పర్యవేక్షణ జరపాలని సమాఖ్య ప్రతినిధులకు సూచించారు. మహిళా స్వయం సహాయక సంఘాలకు నిజామాబాద్ జిల్లాలోనే అత్యధికంగా వడ్డీ లేని రుణాలను ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటును పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సరికొత్త ఆలోచనలతో ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తే వ్యాపార పరంగా అద్భుత విజయాలు సాధించవచ్చని అన్నారు. నిజామాబాద్ నగరంలో కలెక్టరేట్ కు ఆనుకుని అన్ని హంగులతో నూతనంగా నిర్మించిన ఇందిరా మహిళా శక్తి భవనం త్వరలోనే అందుబాటులోకి రానుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, డాక్టర్ కవితా రెడ్డి, అదనపు కలెక్టర్ భుజంగరావు, డీఆర్డీఏ సాయన్న, ఆర్టీసీ ఆర్ఎం జ్యోత్స్న, నిజామాబాద్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నగేష్ రెడ్డి, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు హేమలత, మండల మహిళా సమాఖ్యల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# పాలిసెట్, టీజీఐఆర్‌సెట్‌లో వనపర్తి విద్యార్థుల ప్రభంజనం!

**- ప్రతిభ చాటిన విజేతలను అభినందించిన జిల్లా ఎస్పీ సునిత రెడ్డి**

**- తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల కృషితోనే విజయం సాధ్యం ఎస్పీ**



వనపర్తి జిల్లా ప్రతినిధి, మే 25 (విజన్ ఆంధ్ర) : పాలిసెట్, టీజీఐఆర్‌సెట్-2026 ప్రవేశ పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించి జిల్లా ఖ్యాతిని చాటిన విజ్ఞం అకాడమీ విద్యార్థులను వనపర్తి జిల్లా ఎస్పీ సునిత రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, అకాడమీ నిర్వాహకులు ఎస్పీని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎస్పీ శాలువాలతో సత్కరించి, స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ సునిత రెడ్డి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత నేపథ్యం, ప్రభుత్వ పాఠశాలల చదువు, సాధారణ కుటుంబ పరిస్థితులు విజయానికి ఎన్నడూ అడ్డంకి కావని ఈ విద్యార్థులు నిరూపించారని కొనియాడారు. ఈ అద్భుత విజయం కేవలం ఆయా కుటుంబాలకే కాకుండా మొత్తం వనపర్తి జిల్లాకే గర్వకారణమని ఎస్పీ పేర్కొన్నారు. భవిష్యత్తులో వీరంతా ఉన్నత ఉద్యోగాలు సాధించి జిల్లాకు మరింత మంచి పేరు తీసుకురావాలని ఆమె హృదయపూర్వకంగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విజ్ఞం అకాడమీ డైరెక్టర్లు, అధ్యాపకులు, విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలు, వివాహాలను రూపుమాపుదాం.

**- గాంధీనగర్ గ్రామ సర్పంచ్ బానోత్,నిర్మల వెంకన్న.**



ములుగు మే 25;విజన్ ఆంధ్ర ప్రతినిధి : గోవిందరావుపేట: మండలంలోని కోటగడ్డ , గాంధీనగర్ గ్రామంలో ప్రత్యేక గ్రామసభ ఏర్పాటుచేసి గ్రామపంచాయతీ సర్పంచ్ బానోత్ నిర్మల వెంకన్న అధ్యక్షతన బాల్య వివాహ రహిత గ్రామం లక్ష్యంతో గ్రామసభలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు, పిల్లలు దివ్యాంగుల సంక్షేమ శాఖ పరిధిలోని జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారులు పాల్గొని బాల్య వివాహాల నిర్మూలన, బాలికల విద్య ప్రోత్సాహం, గ్రామ స్థాయిలో చైల్డ్ ప్రొటెక్షన్ వ్యవస్థను బలోపేతం చేయడం గ్రామాన్ని " బాల్య వివాహ రహిత గ్రామం"గా ప్రకటించేందుకు అవసరమైన ప్రమాణాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శి రఘు, గ్రామం ప్రజలు,ఐ సి డి ఎస్ ఇన్చార్జి సీడీపీఓ విజయ , జిల్లా బాలల పరిరక్షణ విభాగం నుండి సోషల్ వర్కర్ జ్యోతి , అంగన్వాడీ టీచర్లు, ఏఎన్ఎం సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదుకు న్యాయం అందించడమే మా బాధ్యత

**- ప్రతి వినతిని స్వయంగా పరిశీలించిన జిల్లా ఎస్పీ సునిత రెడ్డి**

**- బాధితులకు భరోసా కలిగించేలా ప్రజావాణిలో స్పందన**

**- ప్రజావాణిలో 11 ఫిర్యాదుల స్వీకరణ**



వనపర్తి జిల్లా ప్రతినిధి, మే 25 (విజన్ ఆంధ్ర) : ప్రజల సమస్యల పరిష్కారమే పోలీసుశాఖ ప్రధాన బాధ్యతని, ప్రజావాణిలో అందిన ప్రతి ఫిర్యాదుపై అధికారులు, సిబ్బంది వెంటనే స్పందించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని వనపర్తి జిల్లా ఎస్పీ సునిత రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లా నలుమూలల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి ఎస్పీ నేరుగా వినతులు స్వీకరించారు. బాధితులు వివరించిన సమస్యలను ఓర్పుతో విన్న ఆమె, ప్రతి ఫిర్యాదును స్వయంగా పరిశీలిస్తూ సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వెంటనే చర్యలు తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఫిర్యాదు చేసిన ప్రజలకు వేగంగా న్యాయం అందేలా చర్యలు తీసుకోవడం ద్వారా ప్రజల్లో పోలీసు శాఖపై విశ్వాసం మరింత పెరగాలని ఎస్పీ సూచించారు. బాధితుల సమస్యలను సానుభూతితో పరిశీలిస్తూ, చట్టపరమైన రీతిలో త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఫిర్యాదులను స్వయంగా స్వీకరించి వెంటనే స్పందించిన జిల్లా ఎస్పీ తీరు పట్ల ఫిర్యాదుదారులు సంతృప్తి వ్యక్తం చేస్తూ, తమ సమస్యలకు న్యాయం జరుగుతుందనే నమ్మకం కలిగిందన్నారు.

## "పాల్వంచలో రోడ్డు ప్రమాదం..

**చికిత్స పొందుతూ వ్యక్తి మృతి.**

పాల్వంచ ప్రతినిధి 25 (విజన్ ఆంధ్ర) భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పాల్వంచ పట్టణంలోని నవభారత్ ఎల్వీ ప్రసాద్ ఐ హాస్పిటల్ సమీపంలో రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పాల్వంచ పట్టణంలోని నవభారత్ ఎల్వీ ప్రసాద్ ఐ హాస్పిటల్ సమీపంలో రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో అశ్వాపురం హెవీ వాటర్ ప్లాంట్‌కు చెందిన ప్రభాత్ కుమార్‌తో పాటు మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి 108 అంబులెన్స్‌లో క్షతగాత్రులను పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ ప్రభాత్ కుమార్ మృతి చెందినట్లు సమాచారం. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది."

# ఆస్తి కోసం కన్నతండ్రిని వేధిస్తే జైలుకే!

**- వనపర్తి జిల్లా ఎస్పీ సునీత రెడ్డి హెచ్చరిక**

**- ప్రజావాణిలో తండ్రి గోడు.. ఇద్దరు కుమారులపై కేసు నమోదు**

**- బాధితుడిని వృద్ధాశ్రమంలో చేర్పించి మానవత్వం చాటుకున్న ఎస్పీ**



వనపర్తి జిల్లా ప్రతినిధి, మే 25 (విజన్ ఆంధ్ర) : కన్నతండ్రి ఆస్తులను తమ పేర్లపై రిజిస్టర్ చేయించుకొని, వృద్ధాప్యంలో అన్నం పెట్టకుండా, ఇంటికి రానీయకుండా వేధిస్తే ఎంతటి వారైనా సహించేది లేదని వనపర్తి జిల్లా ఎస్పీ సునీత రెడ్డి హెచ్చరించారు. సమాజంలో వృద్ధ తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయడం, వేధించడం వంటి అమానుష ఘటనలపై చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని ఆమె స్పష్టం చేశారు. ఆస్తి కోసం కన్నతండ్రిని హింసించిన ఇద్దరు కుమారులపై కేసు నమోదు చేయాల్సిందిగా ఆమె పోలీసులను ఆదేశించారు.

ప్రజావాణిలో వెలుగు చూసిన అమానుషం

సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వనపర్తి జిల్లా కేంద్రంలోని మెట్టుపల్లికి చెందిన వృద్ధుడు రంగం హనుమన్న జిల్లా ఎస్పీని కలిసి తన బాధను విన్నవించుకున్నారు. తనకు ముగ్గురు కుమారులు ఉండగా, అందులో ఒకరైన బాలాజీ అనారోగ్యంతో మరణించారని తెలిపారు. మిగిలిన ఇద్దరు కుమారులు చిన్న కృష్ణయ్య (హోంగార్డ్), రాములు (బంగారు వ్యాపారి) తన పేరు మీద ఉన్న భూమిని మొత్తం బలవంతంగా తమ పేర్లపై రిజిస్టర్ చేయించుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆస్తి చేతికి రాగానే ప్రస్తుతం తనను ఇంటికి రానీయకుండా, కనీసం అన్నం కూడా పెట్టకుండా, శారీరకంగా, మానసికంగా వేధిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని హనుమన్న కన్నీరుమున్నీరయ్యారు.

ఎస్పీ తక్షణ స్పందన.. మానవత్వం

వృద్ధుడి హృదయవిదారక గాథను విన్న ఎస్పీ సునీత రెడ్డి వెంటనే స్పందించారు. హనుమన్నను ఓదార్చి, పూర్తి న్యాయం చేస్తామని భరోసా కల్పించారు. అనంతరం వనపర్తి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఇద్దరు కుమారులపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అంతేకాకుండా, వృద్ధుడి పరిస్థితిని మానవతా దృక్పథంతో పరిశీలించిన ఎస్పీ మేడం, ఆయనకు తక్షణ ఆశ్రయం కల్పించేందుకు వృద్ధాశ్రమంలో చేర్పించి తన మానవత్వాన్ని చాటుకున్నారు.

పెద్దలను గౌరవించడం అందరి బాధ్యత:

"తల్లిదండ్రులు జీవితాంతం పిల్లల భవిష్యత్తు కోసమే కష్టపడతారు. అలాంటి వారిని వృద్ధాప్యంలో ఆస్తుల కోసం వేధించడం, ఇళ్లనుంచి వెళ్లగొట్టడం అత్యంత దుర్మార్గమైన చర్య, మానవత్వానికే మచ్చ. వృద్ధులపై శారీరకంగా, మానసికంగా, ఆర్థికంగా వేధింపులకు పాల్పడే వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదు. వృద్ధుల భద్రత, సంక్షేమం కోసం పోలీసుశాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది. ఎవరైనా ఇలాంటి వేధింపులకు గురైతే వెంటనే పోలీసులను ఆశ్రయించాలన్నారు.

# ప్రజావాణికి 99 ఫిర్యాదులు

**- జిల్లా అదనపు కలెక్టర్ మధు మోహన్**



గద్వాల మే 25 (విజన్ ఆంధ్ర) : ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ మధు మోహన్ అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 99 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి తమ సమస్యల పరిష్కారం కోసం వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్ (రెవెన్యూ) తో పాటు, అదనపు కలెక్టర్ నర్సింగరావు, భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కృష్ణ, కలెక్టరేట్ ఏవో భూపాల్ రెడ్డి లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, ఫిర్యాదులను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ మధుమోహన్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## తాగునీరు, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

**- అదనపు కలెక్టర్ నర్సింగరావు**



గద్వాల మే 25 (విజన్ ఆంధ్ర) : జిల్లా ప్రజలకు తాగునీటిని అందిస్తూనే పారిశుద్ధ్యంపై కూడా సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ నర్సింగరావు అన్నారు. మిషన్ భగీరథ శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఐడిఓసి సమావేశపు మందిరంలో డిస్టిక్ వాటర్ శానిటేషన్ మిషన్ పై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ జల జీవన్ మిషన్ ప్రకారం ప్రతి కుటుంబానికి అవసరమైనన్ని నీటిని సరఫరా చేయాలని, జిల్లాలో ఎక్కడ తాగునీటి సమస్యలు ఉత్పన్నమవ్వకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీలతోపాటు మునిసిపాలిటీలలోని గృహ అవసరాలకేకాక, విద్యాసంస్థలు, వైద్యశాలలు వంటి ప్రభుత్వ విభాగాలకు కూడా నల్ల కనెక్షన్లు ఇవ్వడం జరుగుతోందన్నారు. ఎక్కడైనా ఏమైనా సమస్యలు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తారన్నారు. స్వచ్ఛభారత్ మిషన్లో భాగంగా కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ నిర్మాణాలకు కూడా కృషి చేస్తున్నట్లు తెలిపారు. వసతి గృహాలతో పాటు ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీలలో మురుగు వ్యవస్థ నిర్వహణకు ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలన్నారు. వ్యర్థాలను రీసైక్లింగ్ చేసేందుకు అవసరమైన కార్యాచరణ రూపొందించుకొని ముందుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో మిషన్ భగీరథ ఈఈ శ్రీధర్ రెడ్డి, డి డబ్ల్యు ఓ సునంద, కలెక్టరేట్ ఏవో భూపాల్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## కారుణ్య నియామకాల ద్వారా ఐదుగురికి ఉద్యోగ నియామక ఉత్తర్వులు.

**- జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు**



ములుగు మే 25; విజన్ ఆంధ్ర ప్రతినిధి : సోమవారం జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు,అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు తో కలిసి కారుణ్య నియామకాల ద్వారా అర్హులైన ఐదుగురికి ములుగు జిల్లా పరిధిలోని వివిధ మండల పరిషత్ కార్యాలయాలలో జూనియర్ అసిస్టెంట్ పోస్టులలో నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగుల కుటుంబాలకు ఉపాధి భరోసా కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి నిబంధనల ప్రకారం న్యాయం జరిగేలా జిల్లా యంత్రాంగం కట్టుబడి పనిచేస్తోందన్నారు. ఈ నియామకాలతో సంబంధిత కుటుంబాలకు ఆర్థిక స్థిరత్వం లభించడంతో పాటు వారి కుటుంబ సభ్యులకు భవిష్యత్తుపై నమ్మకం పెరుగుతుందని పేర్కొన్నారు. ఏ. వెంకటలక్ష్మిని వెంకటాపూర్ మండల పరిషత్ కార్యాలయంలో,పి.భానును ములుగు మండల పరిషత్ కార్యాలయంలో, డి.హరీష్‌ను ఏటూరు నాగారం మండల పరిషత్ కార్యాలయంలో,పి.వంశీకృష్ణను వాజేడు మండల పరిషత్ కార్యాలయంలో, పి.సునీతను తాడ్వాయి మండల పరిషత్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్లుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు పేర్కొన్నారు.

## డ్రైనేజీ మురుగునుండి 9వ వార్డును కాపాడండి.

**- గంద్రకోట వాణి కుమార్.**

ములుగు మే 25;విజన్ ఆంధ్ర ప్రతినిధి : ములుగు మున్సిపాలిటీ పరిధిలోని బుద్ధారం మూల మలుపు నుండి బండారుపల్లి వైపునకు కిలోమీటర్ మేర గల డ్రైనేజీ లోని నీరు సక్రమంగా ప్రవహించుటకు వీలు లేక ఎక్కడి నీరు అక్కడే నిలిచి ఉండి వర్షాకాలంలో ఆ డ్రైనేజీ లోని నీరు అధిక ప్రవాహం వల్ల తొమ్మిదో వార్డ్ ను ముంచెత్తుతూ చెత్తాచెదరంతో కూడిన దుర్వాసన వెదజల్లుతోందని, అలాగే బీడీ కార్మికుల ప్రాంతం వైపున డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా నిర్మాణం జరగక మధ్యలోనే వదిలేసి అస్తవ్యస్తంగా మార్చడం చే ప్రజలు వర్షాకాలంలో డ్రైనేజీ మురుగుతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రజాఆరోగ్య రీత్యా డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపడేట్లు చూసి తగు న్యాయం చేయాలని 9వ వార్డు కౌన్సిలర్ “గంద్రకోట వాణి కుమార్“ సోమవారం జరిగిన ప్రజావాణిలో కలెక్టర్కు వినతిపత్రం అందించారు,

### ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకల ఆస్పత్రిగా మార్చాలని స్పీకర్కు వినతి

భూదాన్ పోచంపల్లి మే 26 విజన్ ఆంధ్ర : భూదాన్ పోచంపల్లి పట్టణ కేంద్రంలోని ప్రైమరీ హెల్త్ సెంటర్ ను కమ్యూనిటీ హెల్త్ సెంటర్ 30 పడకల ఆసుపత్రిగా మార్చాలని భూదాన్ పోచంపల్లి గోపాలక కార్యాలయం ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ను కోరారు పట్టణ కేంద్రంలో ఆరోగ్య కేంద్రానికి మండల వ్యాప్తంగా ఉన్న రోగులు చికిత్స నిమిత్తం వస్తుంటారు అదే మాదిరిగా వివిధ రాష్ట్రాల నుండి ఉత్తర ప్రదేశ చతిస్గడ్ ఒరిస్సా బీహార్ రాష్ట్రాల నుండి వచ్చిన కూలీలు సైతం హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నారు కావడంతో ఇక్కడ ప్రజలకు శ్వాసకోశ వ్యాధులు క్యాన్సర్ వంటి వ్యాధులకు దూర ప్రాంతాలకు చికిత్స నిమిత్తం వెళ్లాల్సి వస్తుంది చేనేతకు ప్రపంచ ఖ్యాతిగాంచిన పోచంపల్లిలో ఆరోగ్య కేంద్రము సరిగా లేక వైద్య మందకపోవడంతో బిపిఎల్ కుటుంబాలు రైతు కుటుంబాలు ఆరోగ్యానికి దూరం అవుతున్నారు ఈ ప్రాంత ప్రజలకు అవసరమైన ఆసుపత్రిని 30 పడకల ఆస్పత్రిగా మార్చి 24 గంటల వైద్యం అందేలా సిబ్బందిని నియమించి ఆదుకోవాలని ఆరు కోరారు కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశం కౌన్సిలర్లు సూరపల్లి రమేష్ కొయ్యడ శీను రావుల జంగయ్య జింకల యాదగిరి తదితరులు పాల్గొన్నారు

# పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

**- అదనపు కలెక్టర్ వినోద్ కుమార్**
**- రోజువారీ ఆహారంలో పోషకాలకు పెద్దపీట వేయాలి**
**- శారీరక దృఢత్వానికి మతుల్య ఆహారమే కీలకం**



వనపర్తి జిల్లా ప్రతినిధి, మే 25 (విజన్ ఆంధ్ర) : పోషకాహార పదార్థాలను రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవాలని, తద్వారా శారీరక దృఢత్వాన్ని మరియు ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చని అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్ తెలిపారు. సోమవారం ఐడీఓసీ నందు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మహిళా వారోత్సవాల తొలి రోజు సందర్భంగా పోషకాహార ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాస్థాయిలో స్థానికంగా లభ్యమయ్యే తక్కువ ఖర్చుతో కూడిన పోషకాహార పదార్థాలు మరియు వంటకాల ప్రదర్శన ఏర్పాటు చేసి, ప్రజల్లో ఆహార వైవిధ్యం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. అలాగే “జంక్ ఫుడ్‌కు నో చెప్పండి” అనే అంశంపై ప్రత్యేకంగా చైతన్య కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా గర్భిణీ స్త్రీలకు రక్తహీనత (అనీమియా) నిర్ధారణ కోసం ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. మహిళలు, బాలింతలు మరియు గర్భిణీలు ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అధికారులు సూచించారు. స్థానికంగా లభించే తక్కువ ఖర్చుతో కూడిన పోషకాహార పదార్థాలను రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవాలని, తద్వారా శారీరక దృఢత్వాన్ని మరియు ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా చిన్న పిల్లలు, యువత ఆరోగ్యాలను పాడుచేస్తున్న జంక్ ఫుడ్ సంస్కృతికి దూరంగా ఉండాలని, ప్రకృతిసిద్ధమైన ఆహారానికే ప్రాధాన్యత ఇవ్వాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ అధికారులు, అంగన్‌వాడీ సిబ్బంది, మహిళలు, గర్భిణీలు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సాధికారతకు ‘మహిళా శక్తి’ భవనాలు మైలురాయి

**- సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి 8,000 భవనాలకు వర్చువల్ భూమిపూజ**
**- మహిళా సమాఖ్య సభ్యులతో ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్**
**- 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ‘మహిళా శక్తి వారోత్సవాలు‘ ప్రారంభం**




వనపర్తి జిల్లా ప్రతినిధి, మే 25 (విజన్ ఆంధ్ర): వనపర్తి జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద 104 మహిళా శక్తి స్వంత భవనాల నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయడం జరిగిందని, అన్నింటిని డిసెంబర్ లోపు పూర్తి చేసుకొని ప్రారంభోత్సవం చేసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా మే, 25 నుండి 30 వరకు జరుగనున్న మహిళా శక్తి వారోత్సవాల్లో భాగంగా సోమవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని అన్ని జిల్లాల మహిళా సమాఖ్య సభ్యులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఒకేసారి రాష్ట్రంలోని 8000 మహిళా శక్తి స్వంత భవనాలకు వర్చువల్ గా భూమి పూజ నిర్వహించారు. అదేవిధంగా డిసెంబర్ నాటికి రాష్ట్రంలోని కోటి మంది మహిళలకు కోటి చీరలు పంపిణీ చేసే విధంగా చిలకపచ్చ రంగు చీరను ఆమోదించి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తేనే రాష్ట్రం ఆర్థికాభివృద్ధి సాధిస్తుంది అన్నారు. అందుకే ఈరోజు కొన్ని జిల్లాల్లో సోలార్ ప్లాంట్ లను, పెట్రోల్ బంక్ లు, మహిళా శక్తి భవనాలు, ఆర్టీసీ బస్సులను ప్రారంభోత్సవం చేసుకోవడం జరిగిందన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం పూర్తి సహాయ సహకారం అందిస్తుందని, మహిళలు సద్వినియోగం చేసుకొని ప్రతి మండలంలో గోదాములు నిర్మించుకోవడం, రైస్ మిల్లులు ఏర్పాటు చేసుకోవడం, అన్ని జిల్లాల్లో పెట్రోల్ బంక్ లు, సోలార్ ప్లాంట్ , సూపర్ మార్కెట్, లాజిస్టిక్ హబ్ లు నిర్మించుకోవాలని సూచించారు. 2034 నాటికి కోటి మంది మహిళలు కోటీశ్వరులు కావాలని ఆకాంక్షించారు. జిల్లాలోని మహిళా సమాఖ్య సభ్యులతో వారి అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ వనపర్తి జిల్లాలో 356 మహిళా సంఘాలు ఉన్నాయని వాటిలో 91 మహిళా సంఘాలకు స్వంత భవనాలు ఉన్నట్లు తెలిపారు. ఉపాధి హామీ ద్వారా ఇప్పుడు 104 స్వంత భవనాలు మంజూరు అయ్యాయని, మరో 55 భవనాలు మంజూరు కొరకు ప్రతిపాదనలు పంపించినట్లు తెలియజేశారు. మిగిలిన 94 సంఘాలకు స్థల పరిశీలనలో ఉన్నట్లు తెలిపారు. 104 మహిళా సంఘాల భవనాలు త్వరగా పనులు ప్రారంభించి డిసెంబర్ లోపు పూర్తి చేసుకోవడం జరుగుతుందన్నారు. జిల్లాలో మహిళా సంఘాల మొండి బకాయిలు కేవలం ఒక శాతం మాత్రమే ఉందని, అదికూడా త్వరలో చెల్లించి జీరో ఎన్.పి.ఎ గా జిల్లాను తీర్చిదిద్దుతామని తెలియజేశారు. అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఎన్ ఖీమ్యా నాయక్, పి.డి. డిఆర్డిఓ ఉమాదేవి , మహిళా సంఘాల మండల అధ్యక్షులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మతసామరస్యం తో పండగలు జరుపుకోవాలి

**మత పెద్దలతో పీస్ కమిటీ మీటింగ్ ఏర్పాటు చేసిన సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేష్**



శేరిలింగంపల్లి.మే 25;( విజన్ ఆంధ్ర) : శాంతియుత వాతావరణంలో ప్రజలంతా పండుగలను ఆనందంగా జరుపుకోవాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ కోరారు. రాబోయే బక్రీద్ పండుగ సందర్భంగా ఈ రోజు సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయ ఆడిటోరియంలో మత పెద్దలు, పీస్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్ మాట్లాడుతూ,,లి ప్రజలంతా పండుగలను మతసామరస్య వాతావరణంలో ప్రశాంతంగా జరుపుకోవాలని కోరారు. రాబోయే బక్రీద్ పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా మత పెద్దలు, ప్రజలు పరస్పర సహకారంతో ముందుకు రావాలని సూచించారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే అసాంఘిక శక్తులపై పోలీసులు పటిష్ట నిఘా ఏర్పాటు చేస్తున్నారని, ఎవరైనా గొడవలు సృష్టించే ప్రయత్నం చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సైబరాబాద్ పరిధిలోని వివిధ మత పెద్దలు పాల్గొన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా ప్రజలు శాంతియుతంగా వేడుకలు జరుపుకోవాలని సూచించారు. ఏదైనా అత్యవసర పరిస్థితులు లో వెంటనే డయల్ 100 కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. బక్రీద్ పండుగను ప్రశాంతంగా నిర్వహించేందుకు గత 45 రోజులుగా పోలీస్ శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేపడుతోందని సీపీ తెలిపారు. నగరంలోని పలు ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి ఇతర శాఖల అధికారులతో సమన్వయంగా పనిచేస్తున్నామని చెప్పారు. సోషల్ మీడియాలో వ్యాపించే ఫేక్ న్యూస్, పాత వీడియోలు, తప్పుడు ప్రచారాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనుమానాస్పద సమాచారం కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. శేరిలింగంపల్లి డీసీపీ సీ.హెచ్. శ్రీనివాస్ మాట్లాడుతూ,లి అందరి సహకారంతో పండుగలను చట్టపరంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని కోరారు. సోషల్ మీడియాలో ఫేక్ న్యూస్, అసత్య ప్రచారాలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఎలాంటి పరిస్థితులు వచ్చినా పోలీసు సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహిస్తారని, సమాజంలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని చెప్పారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. వాలంటీర్లు, యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ట్రాఫిక్ నియంత్రణ, ప్రజలకు అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాల్లో సహకరించాలని కోరారు. ఈ పీస్ కమిటీ సమావేశంలో కుత్బుల్లాపూర్ డీసీపీ ఎన్. కోటిరెడ్డి, శేరిలింగంపల్లి డీసీపీ సీ హెచ్. శ్రీనివాస్, కూకట్పల్లి డీసీపీ రితిరాజ్, ఎస్ బి డీసీపీ సుధీంద్ర, క్రైమ్స్ డీసీపీ ముత్యం రెడ్డి సైబరాబాద్ పరిధి లో స్టేషన్ హౌస్ ఆఫీసర్స్, పలువురు హిందూ, ముస్లిం మత పెద్దలు మరియు నాయకులు పాల్గొన్నారు.

## మహిళా గ్రామ సంఘ భవనాలకు వర్చువల్ గా భూమి పూజ చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**కలెక్టరేట్లో వీసీ ద్వారా వీక్షించిన జిల్లా అధికారులు, మహిళా సంఘాల సభ్యులు**



గద్వాల మే 25 (విజన్ ఆంధ్ర) : కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా మహిళా స్వయం సహాయక సంఘాలకు పెద్ద ఎత్తున రుణాలను ఇచ్చి మహిళల ఆర్థిక ప్రగతికి ప్రభుత్వం చేయూతనిస్తున్నట్లు అదనపు కలెక్టర్ నర్సింగరావు అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల షెడ్యూల్లో భాగంగా నిర్వహిస్తున్న మహిళా వారోత్సవాల్లో భాగంగా సోమవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలువురు మంత్రులతో, సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా ఎనిమిది వేల మహిళ గ్రామ సంఘాల భవనాలకు వర్చువల్ గా భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ మహిళలు తమ గ్రామ సంఘాల సమావేశాలు నిర్వహించుకునేందుకు, ఉపాధి నైపుణ్య శిక్షణకు, తయారు చేసిన వస్తువుల విక్రయాలకు ఈ భవనాలు తోడ్పడతాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మహిళా సంఘాలకు రూ.60,472 కోట్ల రూపాయలను ఇవ్వడం జరిగిందన్నారు. వచ్చే ఐదేళ్లలో రూ. లక్ష కోట్ల రుణాలు ఇచ్చి మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం సహకరిస్తుందన్నారు. పెట్రోల్ బంకులు, ఆర్టీసీకి అద్దెకిచ్చేందుకు బస్సుల కొనుగోలుకు, సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రభుత్వం సహకరిస్తుందని ఫలితంగా మహిళా సంఘాల సభ్యులు మంచి ఆదాయాన్ని అర్జించవచ్చన్నారు. ప్రభుత్వం మహిళల సంక్షేమానికి అనేక కార్యక్రమాల నిర్వహిస్తోందని, అందులో భాగంగానే తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మహిళలకు ఆర్టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామన్నారు. నాణ్యమైన ఇందిర మహిళా శక్తి చీరల పంపిణీతో మహిళ సంఘాల సభ్యులకు ఒక గుర్తింపును ఇవ్వడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా పలు జిల్లాల మహిళా సంఘాల సభ్యులు ప్రసంగించారు. గద్వాల ఐడిఓసి సమావేశపు మందిరంలో వీసీ ద్వారా ముఖ్యమంత్రి ప్రసంగాన్ని జిల్లా అధికారులు, మహిళా సంఘాల సభ్యులు తిలకించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ ముషాహిదా బేగం, ఏపీడి శ్రీనివాస్, పంచాయతీరాజ్ ఈఈ ప్రభాకర్, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు ప్రభావతమ్మ, మహిళా సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలకు విస్తృత ఏర్పాట్లు



నిజామాబాద్, మే 25 :( విజన్ ఆంధ్ర ) తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి బి.గీత అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో సోమవారం అన్ని శాఖల అధికారులతో సమీక్ష జరిపారు. జూన్ 2న జరిగే రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుక సందర్భంగా చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి ఆయా శాఖల వారీగా అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా అట్టహాసంగా వేడుకలు జరిగేలా ఆయా శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. వివిధ వర్గాల వారి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింబించేలా సమగ్ర వివరాలతో జిల్లా ప్రగతి నివేదిక రూపొందించాలని అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు సంబంధించి శకటాలను ప్రదర్శించాలని సూచించారు. అదేవిధంగా వ్యవసాయ, ఉద్యానవన, జిల్లా గ్రామీణాభివృద్ధి, పశు సంవర్ధక, విద్య, వైద్యం, స్త్రీ శిశు సంక్షేమం, ఫిషరీస్, ఇరిగేషన్ తదితర శాఖల పనితీరును చాటేలా స్టాల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. వేడుకల సందర్భంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని ట్రాన్స్కో అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్ర కుమార్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు

## ప్రజావాణికి 177 ఫిర్యాదులు



నిజామాబాద్, మే 25 :( విజన్ ఆంధ్ర) ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 177 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్లు కిరణ్ కుమార్, వి.భుజంగరావుతో పాటు ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, డీఆర్ఓ బి.గీత, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీపీఓ శ్రీనివాస్ రావులకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్లు కిరణ్ కుమార్, భుజంగరావు అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం విఫలమైంది

**రైతు గోస.. బీజేపీ భరోసా యాత్రలో అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్**



నిజామాబాద్ మే25 :( విజన్ ఆంధ్ర ) ధాన్యం కొలుగోలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన “ రైతు గోస బీజేపీ భరోసా“ కార్యక్రమంలో భాగంగా సోమవారం వికారాబాద్ జిల్లా కులకచర్ల మార్కెట్ కమిటీ, గజ్వేల్ ధాన్యం కేంద్రాలను రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు, ఎంపీలు, సహచర ఎమ్మెల్యేలతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...45 రోజులు దాటినా గన్నీ బస్తాలు ఇవ్వకుండా , కాంటా పెట్టకుండా, కొన్ని చోట్ల తూకం వేసినా బస్తాలను తరలించేందుకు లారీలు లేకపోవడంతో తీవ్రమైన ఇబ్బందులు ఎదురుకుంటున్నారన్నారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు వరంగల్ సభలో రాహూల్‌గాంధీ రైతు డిక్లరేషన్ పేర అనేక హామీలు ఇచ్చి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. డిక్లరేషన్ పేరుతో హామీలిచ్చి అమ లు చేయని రైతు ద్రోహి సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. దేశానికి అన్నంపెట్టే రైతును కాంగ్రెస్ పార్టీ నిలువునా మోసం చేస్తుందని ఆరోపించారు. మొక్కజొన్న పండించిన రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా మారిందనీ చెప్పారు. రైతుల కష్టాలను పరిష్కరించాల్సిన ప్రభుత్వ పెద్దలు ఏసీ గదులకు పరిమితం అయ్యారని ఆరోపించారన్నారు.

## బొప్పాపూర్ గ్రామంలో అంగన్‌వాడీ సెంటర్ల ప్రారంభోత్సవం

ఎల్లారెడ్డిపేట (విజన్ ఆంధ్ర) మే 25: రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలోని బొప్పాపూర్ గ్రామంలో ఈ రోజు బొప్పాపూర్-1 మరియు బొప్పాపూర్ ఎస్సీ అంగన్‌వాడీ సెంటర్లను ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ సబేరా బేగం, సర్పంచ్ గీతాంజలి, ఉపసర్పంచ్ కొండాపురం వెంకట్ రెడ్డి, పాలకవర్గ సభ్యులు, ఈఓ వనిత, అంగన్‌వాడీ టీచర్లు, పి.ఆర్.ఏ.ఈ శ్రీనివాస్, కార్యదర్శి సంతోష్, మహిళలు, అంగన్‌వాడీ బాలలు తదితరులు పాల్గొన్నారు. గ్రామంలోని చిన్నారులకు మెరుగైన విద్యా, పోషకాహార సేవలు అందించేందుకు అంగన్‌వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తాయని కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు తెలిపారు.

# పేద విద్యార్థులకు అండగా ఉంటా

- వైశ్యులు కేవలం లక్ష్మీ పుత్రులే కాదు.. సరస్వతీపుత్రులని నిరూపించారు..
- ప్రతిభా పురస్కార కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్



నిజామాబాద్ మే 25:( విజన్ ఆంధ్ర ) పేద విద్యార్థులకు తమ ట్రస్టు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ స్పష్టం చేశారు. జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని లక్ష్మీ కళ్యాణం మండపంలో పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైశ్యులు అంటే లక్ష్మీ పుత్రులే కాదని సరస్వతీ పుత్రుడు కూడా ఉంటారని తెలిపారు. పదో తరగతి ఇంటర్మీడియట్ లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. మున్ముందు మరిన్ని విజయాలు సాధించి ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలన్నారు. ధన్పాల్ లక్ష్మీబాయి విఠల్ గుప్తా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఇప్పటికే అనేకమంది పేద విద్యార్థులకు విద్యను అందజేస్తున్నామన్నారు. ప్రస్తుతం ఇంటర్లో ఉత్తమ మార్కులు సాధించిన వారికి కూడా భవిష్యత్తులో తన సహకారం ఉంటుందన్నారు. ఇలాంటి ప్రోత్సాహకాల వల్ల విద్యార్థులు మరింత ఉత్తమంగా రాణించే అవకాశం ఉంటుందన్నారు. జీవితంలో ఏదైనా దోచుకునే అవకాశం ఉంటుంది కానీ.. విద్యను ఎవరూ దోచుకోలేరన్నారు. అనంతరం విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ శాసన సభ్యులు బిగాల గణేష్ గుప్తా, ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ, జిల్లా అధ్యక్షుడు పోల విఠల్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

# వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలు సాగు చేయాలి

- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి
- మేలు రకం విత్తనాలను వినియోగించాలని రైతులకు పిలుపు



నిజామాబాద్, మే 25 :( విజన్ ఆంధ్ర వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సూచనల మేరకు మేలైన పంటలు సాగు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి రైతులకు పిలుపునిచ్చారు. ఖరీఫ్ సీజన్ ను పురస్కరించుకుని సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ఖరీఫ్ సీజన్ కు సరిపడా ఎరువులు, విత్తనాల పంపిణీపై చర్చించి, అధికారులకు సూచనలు చేశారు. అనంతరం ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, ఈసారి ఎల్ నినో ప్రభావం వల్ల వర్షాలు తక్కువగా కురుస్తాయని వాతావరణ శాఖ సూచనలు చేసినందున, తక్కువ నీటి వినియోగం అవసరం అయ్యే స్వల్పకాలిక పంటలను సాగు చేయాలని రైతులను కోరారు. కేవలం వరి పంటకే పరిమితం కాకుండా జొన్న, మొక్కజొన్న, పొద్దు తిరుగుడు వంటి పంటలను సాగు చేయాలని హితవు పలికారు. అధిక దిగుబడిని అందించే నాణ్యమైన విత్తనాలను వినియోగించాలని, మేల్ సీడ్ ను వాడవద్దని సూచించారు. ఖరీఫ్ లో జిల్లాలో రైతుల అవసరాలకు సరిపడా ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉండేలా జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో చర్యలు తీసుకోవడం జరుగుతోందని అన్నారు. లారీలు, హమాలీల కొరత, ఎండ తీవ్రత వంటి అనేక ప్రతికూల పరిస్థితులు నెలకొని ఉన్నప్పటికీ, వాటిని అధిగమిస్తూ రబీలో రాష్ట్రంలోనే అత్యధిక స్థాయిలో నిజామాబాద్ జిల్లాలో దాదాపు 7 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగిందని అన్నారు. దిగుబడులు ఆలస్యంగా వచ్చిన బాల్కొండ నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాల్లో మినహాయిస్తే, జిల్లాలో ధాన్యం సేకరణ పూర్తయ్యిందని అన్నారు. బాల్కొండ సెగ్మెంట్ లో సైతం ఒకటి రెండు రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తవుతాయని తెలిపారు.

**యువత కోసం ప్రత్యేకంగా శిక్షణ తరగతులు**

యువత విరివిగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించేలా జిల్లా కేంద్రంలోని న్యాక్ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి శిక్షణ తరగతుల ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. సాంకేతిక విద్యకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎనలేని ప్రాధాన్యత ఇస్తున్నారని గుర్తు చేశారు. ఇందులో భాగంగానే నిజామాబాద్ జిల్లాలోని నిరుద్యోగ యువతకు న్యాక్ ద్వారా ప్లంబింగ్, హౌజ్ వైరింగ్, ఫిట్టర్, సెంట్రింగ్, మేసన్, యూనిఫాం స్టిచింగ్ వంటి కోర్సులలో శిక్షణ అందించేందుకు జిల్లా యంత్రాంగం ద్వారా త్వరలోనే ప్రవేశాలకు సంబంధించిన నోటిఫికేషన్ వెలువరిస్తారని అన్నారు. మూడు నెలల పాటు ఈ శిక్షణ ఉంటుందని, యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమీక్షా సమావేశంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ గవర్నింగ్ కౌన్సిల్ చైర్ పర్సన్ డాక్టర్ కవితా రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు

- కలెక్టర్ ఇలా త్రిపాఠి
- విస్తృత స్థాయిలో తనిఖీలు నిర్వహించాలని ఆదేశం



నిజామాబాద్, మే 25 :( విజన్ ఆంధ్ర ) ఖరీఫ్ సీజన్ ను దృష్టిలో పెట్టుకుని జిల్లాలో నకిలీ విత్తనాలు చెలామణి కాకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. రైతాంగ ప్రయోజనాలను కాపాడడమే పరమావధిగా అంకితభావంతో కృషి చేయాలని హితవు పలికారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్ లో సోమవారం వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులతో పాటు ఎరువులు విత్తనాల డీలర్లతో, రైస్ మిల్లర్లతో కలెక్టర్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఖరీఫ్ పంటల సాగుకు అవసరమైన ఎరువులు, విత్తనాల కొరత తలెత్తకుండా రైతులకు అందుబాటులో ఉండేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. అయితే నకిలీ, నాసిరకం విత్తనాలతో రైతులు నష్టపోకుండా చూడాల్సిన గురుతర బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా ప్రైవేట్ కంపెనీల ద్వారా మార్కెట్లో చెలామణి అయ్యే అన్ని రకాల విత్తనాలను క్రమబద్ధీకరించాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఎక్కడ కూడా నకిలీ విత్తనాలు అనే పదం వినిపించకూడదని, ఈ విషయంలో అప్రమత్తతో విధులు నిర్వర్తించాలని అన్నారు. మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు నకిలీ విత్తనాల బెడద లేకుండా పకడ్బందీగా తనిఖీలు నిర్వహించాలని అన్నారు. ఎవరైనా నకిలీ, నాసిరకం విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే లైసెన్సులు రద్దు చేస్తామని, కేసులు నమోదు చేసి రికవరీ యాక్టు అమలు చేస్తామని కలెక్టర్ హెచ్చరించారు. డీలర్లను ఇబ్బంది పెట్టాలన్నది తమ అభిమతం కాదని, ఏ ఒక్క రైతు నకిలీ విత్తనాల వల్ల నష్టపోకూడదు అన్న సంకల్పంతో ఈ చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. దీనిని దృష్టిలో పెట్టుకొని తనిఖీకి వచ్చే అధికారులకు సహకరించాలని డీలర్లకు సూచించారు. జిల్లాకు వ్యవసాయ రంగంలో మంచి పేరు ఉందని, దానిని నిలుపుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉన్నదని అన్నారు. క్షేత్రస్థాయిలో ఎరువులు విత్తనాల దుకాణాలలో తనిఖీలు నిర్వహించిన వివరాలను నివేదిక రూపంలో తనకు ఎప్పటికప్పుడు సమర్పించాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. క్రాప్ బుకింగ్ ఫార్మర్ రిజిస్ట్రీ విషయంలోనూ ఖచ్చితత్వంతో వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. లేనిపక్షంలో పంట సేకరణ సమయంలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంటుందని అన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వ్యవసాయ అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. అవగాహన సదస్సులో జిల్లా వ్యవసాయ అధికారి వీరస్వామి, డీఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, సివిల్ సప్లైస్ డీఎం ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# దేశానికి ఆదర్శం మన మహిళలు

- ఒకేరోజు 8 వేల ఇందిరా స్త్రీ శక్తి భవనాల నిర్మాణం
- త్వరలోనే ఇందిరా మహిళా శక్తి కార్పొరేట్ సూపర్ బజార్లు, లాజిస్టిక్ హబ్లు, గోదాములు, రైస్ మిల్లులు
- సచివాలయం నుంచి వర్చువల్ గా శంకుస్థాపన చేసిన ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి



నిజామాబాద్, మే 25 :( విజన్ ఆంధ్ర) 2034 నాటికి కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేస్తామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మహిళా శక్తిని దేశానికి ఆదర్శంగా నిలబెట్టడమే ప్రజా ప్రభుత్వ సంకల్పమని అన్నారు. 'మహిళలు ఆర్థికంగా నిలబడితే కుటుంబం నిలబడుతుంది, కుటుంబం నిలబడితే గ్రామం బలపడుతుంది, గ్రామం బలపడితే తెలంగాణ అభివృద్ధి చెందుతుంది.. ' అన్నారు. మహిళా సంఘాలకు బ్యాంక్ లింకేజీ రుణాల పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచుతున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. సోమవారం సచివాలయం వేదికగా రాష్ట్రంలో నిర్మిస్తున్న 8 వేల ఇందిరా గాంధీ స్త్రీ శక్తి భవనాల నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ప్రజాపాలనప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న మహిళా వారోత్సవాల సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టారు. మహిళలను ఆర్థికంగా నిలబెట్టే దిశగా ఇది చారిత్రక కార్యక్రమమని సీఎం అన్నారు. అదే వేదికపై చిలకపచ్చ రంగులో ఉన్న ఇందిరమ్మ చీరల నాలుగు కొత్త డిజైన్లను కూడా సీఎం ఆవిష్కరించారు. సీఎంతో పాటు డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు సీతక్క, శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాజ్య సభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు హర్కార వేణు గోపాల్, మహిళా కమిషన్ చైర్మన్ గద్వాల్ విజయ లక్ష్మి, ఎంఎల్ ఏలు, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు, ఆయా విభాగాల ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఇప్పటివరకు ప్రజా ప్రభుత్వం మహిళా సంఘాలకు రూ.60,472 కోట్ల బ్యాంక్ లింకేజీ రుణాలు అందించిందని, వడ్డీ లేని రుణాలకు ఇప్పటికే రూ.1,390 కోట్లను చెల్లించిందన్నారు. మహిళా సంఘాలు ఇకపై చిన్నచిన్న ఉపాధి కార్యక్రమాలకే పరిమితం కాకుండా పెద్ద వ్యాపారాల్లోకి రావాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. రైస్ మిల్లులు, మండల స్థాయిలో గోదాములు, లాజిస్టిక్ పార్కులు నిర్మించుకోవాలని సూచించారు. వాటికి అవసరమైన చోట భూములను కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. అవసరమైతే 100 ఎకరాల వరకు భూములు ఇవ్వడానికి సిద్ధమని అన్నారు. ధాన్యం కొనుగోలు, నిల్వ, మిల్లింగ్ వ్యవస్థలో మహిళా సంఘాల పాత్ర పెరగాలని సీఎం అన్నారు. సంఘాలే వడ్లు కొనుగోలు చేసి, బియ్యం ప్రభుత్వానికి అందించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆడబిడ్డలు ప్రతి గింజకు జవాబుదారులుగా ఉంటారని, వారి చేతుల్లోకి ఈ వ్యవస్థ వెళ్తే పారదర్శకత, బాధ్యత మరింత పెరుగుతుందన్నారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో కార్పొరేట్ తరహాలో మహిళా శక్తి సూపర్ బజార్లు నెలకొల్పాలని ముఖ్యమంత్రి సూచించారు. డీమార్ట్, బిగ్‌బజార్‌లకు పోటీగా ఉండేలా అద్భుతమైన మహిళా శక్తి సూపర్ బజార్లు ఏర్పాటు చేయాలని అన్నారు. పట్టణాల్లో సూపర్ బజార్ల ఏర్పాటుకు తక్కువ ధరకు స్థలాలను లీజుకు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. నాణ్యమైన వస్తువులు ప్రజలకు అందుబాటులోకి రావాలి, రైతుల ఉత్పత్తులకు మార్కెట్ దొరకాలి, మహిళా సంఘాలకు ఆదాయం రావాలి అన్నదే ఈ ఆలోచన వెనుక ఉన్న లక్ష్యమని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా మహిళా శక్తి సూపర్ బజార్లలో వాటాదారుగా ఉంటుందని, రైతులు పండించే మంచి పంటలు, ఆర్గానిక్ ఉత్పత్తులు, నిత్యావసర సరుకులు వీటి ద్వారా వినియోగదారులకు చేరేలా చూడాలని అన్నారు. గ్రామీణ ఉత్పత్తులకు మంచి మార్కెట్ లభిస్తే రైతులకు మేలు జరుగుతుందని, వినియోగదారునికీ నాణ్యమైన వస్తువు, మహిళా సంఘాలకూ ఆదాయం లభిస్తుందని చెప్పారు. ఒకే రోజు, ఒకే సమయంలో 8 వేల భవనాలకు శంకుస్థాపన చేయడం దేశంలోనే సంచలన నిర్ణయమని సీఎం అన్నారు. మహిళా సంఘాలకు సొంత భవనాలు ఉండటం అంటే కేవలం సమావేశాల స్థలం ఇవ్వటం కాదని, వారి ఆర్థిక కార్యకలాపాలకు, శిక్షణకు, వ్యాపార ప్రణాళికలకు శాశ్వత వేదికను నిర్మించడమని చెప్పారు. తెలంగాణ ఆడబిడ్డల ఆశీర్వాదంతో ఏర్పడిన ప్రజా ప్రభుత్వం మహిళా శక్తిని దేశానికి ఆదర్శంగా నిలబెట్టాలన్న సంకల్పంతో ముందుకు సాగుతోందని అన్నారు. మహిళా అభ్యున్నతే రాష్ట్ర అభివృద్ధికి మార్గమని భావించి ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. తమ ప్రభుత్వం బాధ్యతలు చేపట్టిన రెండు రోజుల్లోనే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించామని గుర్తు చేశారు. ఇప్పటివరకు ఈ పథకంలో ఆర్టీసీకి రూ.10 వేల కోట్ల వరకు చెల్లించిందని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అవసరం లేదని కొందరు రెచ్చగొట్టారని, ఈ పథకాన్ని అడ్డుకునేందుకు కుట్రలు చేశారని విమర్శించారు. మహిళల ప్రయోజనాల విషయంలో ప్రభుత్వం వెనక్కి తగ్గలేదని, ఆ కుట్రలను తిప్పికొట్టి ఉచిత ప్రయాణాన్ని కొనసాగించిందని అన్నారు. మహిళలను బస్సులను యజమానులుగా మార్చాలన్న ఆలోచనతో మహిళా సంఘాల ద్వారా 1000 బస్సులు కొనుగోలు చేయించి, వాటిని ఆర్టీసీకి అద్దెకు ఇచ్చే ప్రణాళికను అమలు చేసినట్లు చెప్పారు. ఇందులో భాగంగా జూన్ 5న పరేడ్ గ్రౌండ్‌లో 553 బస్సులను ప్రారంభించనున్నట్లు తెలిపారు. సోలార్ ఎనర్జీ అనగానే అదానీ, అంబానీ వంటి పెద్ద సంస్థలే గుర్తుకు వచ్చే పరిస్థితి మారిపోతుందని, రాష్ట్ర ప్రభుత్వం 1000 మెగావాట్ల సోలార్ ఎనర్జీ ప్లాంట్లను మహిళా సంఘాల ద్వారా ఏర్పాటు చేయించేందుకు చర్యలు తీసుకుంటోందన్నారు. రిలయన్స్ వంటి సంస్థలు నిర్వహించే పెట్రోల్ బంకుల వ్యాపారంలోనూ సంఘాలను భాగస్వాములుగా చేస్తున్నామని సీఎం వెల్లడించారు. జిల్లా కేంద్రాల్లో, ముఖ్యమైన ప్రాంతాల్లో మహిళా సంఘాల ఆధ్వర్యంలో పెట్రోల్ బంకులు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ భుజంగరావు, డీఆర్డీఓ సాయన్న, డీ డబ్ల్యూఓ పద్మ, జిల్లా, మండల సమాఖ్యల ప్రతినిధులు పాల్గొన్నారు.

## దివంగత పి. నర్సారెడ్డి విగ్రహావిష్కరణలో పాల్గొన్న మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి




ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి, మే 25,( విజన్ ఆంధ్ర) మాజీ మంత్రి దివంగత పి. నర్సారెడ్డి విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్మల్ జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డితో కలిసి ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా పి. నర్సారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజాసేవలో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని నాయకులు కొనియాడారు. రాజకీయాల్లో నిబద్ధతతో పనిచేసి ప్రజల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న నాయకుడిగా పి. నర్సారెడ్డి నిలిచారని పేర్కొన్నారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు ఆయన రాజకీయ ప్రస్థానం, ప్రజల కోసం చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో హన్మంత్ రావు, ఇంద్ర కరణ్ రెడ్డి, వేణు గోపాల్ చారీ, శ్రీ హరి రావు, లైబ్రరీ చైర్మన్ అర్జుమాండ్ అలీ, పత్తి రెడ్డి రాజేశ్వర్ రెడ్డి, కార్పొరేషన్ చైర్మన్ లు తాహిర్ బిన్ అంబదని, మనలా మోహన్ రెడ్డి, శేఖర్ గౌడ్, మాజీ డీసీసీబీ చైర్మన్ అద్ది భోజ రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ సంజీవ్ రెడ్డి మాజీ డీసీసీ సాజిద్ ఖాన్, మాజీ టీపీసీసీ జనరల్ సెక్రటరీ గంద్రత్ సుజాత.

# గండిపేట ప్రభుత్వ భూములపై నకిలీ జి.ఓల కలకలం

*సర్వే నంబర్ 18లో వంద ఎకరాలకు పైగా ఉన్న 'సర్కారీ కంచా'పై అక్రమార్కుల కన్ను*

*తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి ఫిర్యాదుతో నార్సింగి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు*

గండిపేట మే 25 (విజన్ ఆంధ్ర) : రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని గండిపేట మండలంలో కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములను కాజేసేందుకు కొందరు కేటుగాళ్లు భారీ స్కెచ్ వేశారు. ఏకంగా ప్రభుత్వ ఉత్తర్వులనే (G.O.) నకిలీవి సృష్టించి, ఆ భూములు తమవేనంటూ ప్రచారం సాగిస్తున్న కుంభకోణం వెలుగుచూసింది. గండిపేట మండల తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నార్సింగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

ఐదు నకిలీ జీఓల గుర్తింపు

గండిపేట గ్రామం సర్వే నంబర్ 18లోని ప్రభుత్వ భూమిని కొంతమంది వ్యక్తుల పేర్లపై క్రమబద్ధీకరించినట్లు చూపిస్తూ నకిలీ జి.ఓలు తయారు చేసి మార్కెట్లో ప్రచారం చేస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి శనివారం (మే 23న) పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెవెన్యూ అధికారుల ప్రాథమిక పరిశీలనలో ఐదు జి.ఓలు పూర్తిగా నకిలీవని తేలింది. కాముని నాగేశ్వరరావు పేరిట 1 ఎకరా 20 గుంటలు క్రమబద్ధీకరించినట్లు G.O.Ms.No.558 (తేదీ: 02.12.2025) సృష్టించారు. నిమ్మల రామస్వామి గౌడ్ పేరిట 2 ఎకరాల 02 గుంటలు ఉన్నట్లు G.O.Ms.No.553 (తేదీ: 02.12.2025) సృష్టించారు. నిమ్మల రాజేష్ గౌడ్ పేరిట 2 ఎకరాల 02 గుంటలు ఉన్నట్లు G.O.Ms.No.555 (తేదీ: 02.12.2025) సృష్టించారు. నిమ్మల వేణుగోపాల్ గౌడ్ పేరిట 2 ఎకరాల 02 గుంటలు ఉన్నట్లు G.O.Ms.No.554 (తేదీ: 02.12.2025) సృష్టించారు. గరేళ మంగ పేరిట 2 ఎకరాల 02 గుంటలు ఉన్నట్లు G.O.Ms.No.552 (తేదీ: 02.12.2025) సృష్టించారు.

రికార్డుల్లో లేని కలెక్టర్, తహసీల్దార్ లేఖలు

ఈ నకిలీ జి.ఓలలో పేర్కొన్న ఆధారాధేయాలను పరిశీలించగా అక్రమార్కుల గుట్టు రట్టయింది. ఈ ఉత్తర్వుల కోసం వాడినట్టుగా చూపించిన తహసీల్దార్ లేఖ నంబర్ 110/MOI/2025, అలాగే జిల్లా కలెక్టర్ నివేదిక లేఖ నంబర్ 96/RR/CC/2025 అసలు సంబంధిత కార్యాలయాల రికార్డుల్లోనే లేవని విచారణలో తేలింది. కేవలం భూమిని ఆక్రమించుకోవడానికే ఈ నకిలీ నంబర్లతో లేఖలను సృష్టించినట్లు అధికారులు గుర్తించారు.

అది పక్కా ప్రభుత్వ భూమి: రెవెన్యూ రికార్డులు

1954–55 నాటి ఖస్రా పహాణి మరియు ప్రస్తుత రెవెన్యూ రికార్డుల ప్రకారం... గండిపేట గ్రామం సర్వే నంబర్ 18లోని మొత్తం 104 ఎకరాల 25 గుంటల భూమి పక్కా ప్రభుత్వ భూమి. రికార్డుల్లో ఇది "సర్కారీ కంచా / పోరంబోకు కంచా"గా నమోదై ఉందని అధికారులు స్పష్టం చేశారు.

కఠిన చర్యలు తప్పవు: నార్సింగి ఎస్.హెచ్.ఓ

ప్రభుత్వ భూములపై తప్పుడు పత్రాలు సృష్టించి ప్రజల్లో గందరగోళం కలిగించడం, వివాదాలు రేపడం, అక్రమ ఆక్రమణలకు ప్రయత్నించడం వంటి తీవ్రమైన నేరాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నార్సింగి స్టేషన్ హౌస్ ఆఫీసర్ తెలిపారు. ప్రభుత్వ అధికారిక పత్రాలను నకిలీగా సృష్టించడం, వాటిని సోషల్ ఎవఎఖు వేదికల్లో ప్రచారం చేయడం చట్టరీత్యా భారీ శిక్షార్హమైన నేరమని ఆయన హెచ్చరించారు. ప్రజలెవరూ ఇటువంటి తప్పుడు ప్రచారాలను నమ్మి మోసపోవద్దని, ఎక్కడైనా అనుమానాస్పద సమాచారం లేదా పత్రాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మహిళా వారోత్సవాల్లో పాల్గొన్న మార్కెట్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి




ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి, మే 25, (విజన్ ఆంధ్ర) ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ఆదిలాబాద్ పట్టణంలో నిర్వహించిన మహిళా వారోత్సవాల కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి జిల్లా కలెక్టర్ రాజర్షి షాతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తోందన్నారు. మహిళల ఆర్థికాభివృద్ధి, భద్రత, సంక్షేమం కోసం అనేక వినూత్న పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. రూ.500కే గ్యాస్ సిలిండర్ అందించడం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడం వంటి పథకాలు మహిళల జీవితాల్లో మార్పు తీసుకొస్తున్నాయని పేర్కొన్నారు. మహిళలు ప్రతి రంగంలో ముందుకు రావడానికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందని, మహిళా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష, అధికారులు, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి

**-జిల్లా కలెక్టర్ రాజర్షి షా**

ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి, మే 25,( విజన్ ఆంధ్ర) ఆదిలాబాద్ జిల్లాలో ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలులో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని జిల్లా కలెక్టర్ రాజర్షి షా స్పష్టం చేశారు. ప్రజావాణి పోర్టల్‌లో నమోదయ్యే ప్రజా ఫిర్యాదులను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించడం అధికారుల ప్రాధాన్య కర్తవ్యమని ఆయన పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల అర్జీలను కలెక్టర్ స్వయంగా స్వీకరించారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, సామాజిక భద్రతా పెన్షన్లు, ఉపాధి హామీ పనులు, భూభారతి సమస్యలు తదితర అంశాలకు సంబంధించి మొత్తం 91 ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. వీటిపై తక్షణ చర్యలు తీసుకుని, సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణి ద్వారా అందే ప్రతి ఫిర్యాదును 30 రోజుల్లోపు పరిష్కరించాలని స్పష్టం చేశారు. మండల స్థాయిలో ఎంపీడీవోలు, ఇతర అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టి, సమస్యలపై తీసుకున్న చర్యల నివేదికలను సమయానికి పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. పదేపదే ఒకే సమస్యపై ఫిర్యాదులు రావడం జరుగకుండా శాశ్వత పరిష్కారాలపై దృష్టి సారించాలని, అప్పీల్ కేసులను రెండు నుంచి మూడు రోజుల్లోనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించిన అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ రాజేశ్వర్, అడిషనల్ కలెక్టర్ ఆర్ఎస్ చిత్రు, డిఆర్ఓ స్రవంతి, డీఆర్‌డీవో రవీందర్, డీఏండబ్ల్యూఓ కలీం, తహసీల్దార్ శ్రీనివాస్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## జూన్ 1న జిల్లావ్యాప్తంగా 'ఇందిరమ్మ ఇళ్ల' సామూహిక గృహప్రవేశాలు

**-కలెక్టర్ రాజర్షి షా**

ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి, మే 25, (విజన్ ఆంధ్ర) రాబోయే జూన్ 1వ తేదీన ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామాలు, మండలాలు, మున్సిపాలిటీ వార్డులలో ఇందిరమ్మ ఇళ్ల సామూహిక గృహప్రవేశాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. సోమవారం క్యాంపు ఆఫీసు నుండి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతి, సామూహిక గృహప్రవేశాలు, ఇతర అంశాలపై సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నిర్మాణంలో ఉన్న ఇళ్లను త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు, రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల సర్వే, నిలిచిపోయిన ఇళ్ల పనులపై అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో గృహప్రవేశాల కింద మొత్తం 2,773 ఇళ్ల లక్ష్యాన్ని నిర్దేశించగా, ఇప్పటివరకు 1,708 ఇళ్లు విజయవంతంగా పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన 1,065 ఇళ్లను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని హౌసింగ్, మండల అధికారులను ఆదేశించారు. జూన్ 1వ తేదీ నాటికి ఈ ఇళ్లన్నింటినీ సిద్ధం చేసి, లబ్ధిదారులతో ఉమ్మడిగా గృహప్రవేశాలు చేయించేలా అధికారులు క్షేత్రస్థాయిలో ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. మరోవైపు రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియలో భాగంగా జిల్లాలోని అర్హులైన లబ్ధిదారుల గుడిసెల వివరాలను గెజిటెడ్ అధికారుల ద్వారా క్షేత్రస్థాయిలో పారదర్శకంగా సర్వే చేయించాలని ఆదేశించారు. ఈ సర్వే నివేదికలను నేరుగా కలెక్టర్ లాగిన్‌కు పంపాలని, తద్వారా వీలైనంత త్వరగా వీటికి శాంక్షన్ ఉత్తర్వులు జారీ చేస్తామని స్పష్టం చేశారు. వీటితో పాటు జిల్లాలో ఇంకా పనులు ప్రారంభం కాని ఇళ్లు ఉంటే, వెంటనే లబ్ధిదారులతో మాట్లాడి పనులు ప్రారంభించి, వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో హౌసింగ్ నోడల్ అధికారి శంకర్, ఈడియం రవి, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, ఎంపీడీఓలు, ఈఈలు, ఏఈలు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి

**=స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె.అరుణ శ్రీ**



పెద్దపల్లి జిల్లా ప్రతినిది మే-25(విజన్ ఆంధ్ర)అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె.అరుణ శ్రీ సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు.సుల్తానాబాద్ మండలం మియాపూర్ గ్రామానికి చెందిన గండి సుగుణ తనకు అంత్యోదయ కార్డు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా పౌరసరఫరాల శాఖ అధికారిక రాస్తూ నిబంధనలు ప్రకారం అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.గోదావరిఖని చెందిన సువర్ణ గోదావరిఖని ఆసుపత్రిలో ఔట్సోర్సింగ్ ద్వారా పేషంట్ కేర్ విభాగం క్రింద తనకు పని చూపించినప్పటికీ 15 రోజులలో తొలగించారని తనకు పని ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా గోదావరిఖని ఆసుపత్రి సూపరింటెండెంట్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు పెద్దపల్లి పట్టణానికి చెందిన మాచర్ల సుగుణ తన భర్త మరణించారని తనకు వితంతు పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా సంబంధిత అధికారులకు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ కె.హరిత**

ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి మే 25, విజన్ ఆంధ్రప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపై వచ్చే దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టర్ భవన సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు లతో కలిసి హాజరై అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఆసిఫాబాద్ మండలం చిర్రకుంట గ్రామానికి చెందిన నాగేష్ తాను కొనుగోలు చేసిన భూమిని భూ భారతి ఆన్ లైన్ చేసి పాస్ పుస్తకాలలో నమోదు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. సిర్పూర్ యు మండలం మహాగాం గ్రామానికి చెందిన కొడప హిరామన్ తాను గ్రామీణ ఉపాధి హామీ పథకంలో క్షేత్ర సహాయకుడిగా పని చేస్తుండగా విధుల నుండి తొలగించినందున తిరిగి ఉపాధి కల్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. సిర్పూర్ యు మండలం కోహినూరు గ్రామానికి చెందిన మండాడి రంభ తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. పెంచికలపేట మండలం చెడ్వాయి గ్రామానికి చెందిన రాజయ్య తాను తెలంగాణ ఉద్యమంలో పనిచేసినందున తనకు ఆర్థిక సహాయం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. రెబ్బెన



మండలం కిష్టాపూర్ గ్రామానికి చెందిన సునార్ కార్ లింగయ్య తన భూ సమస్యను పరిష్కరించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. కాగజ్ నగర్ మండలం బోరిగం గ్రామానికి చెందిన సాహస్తి తనకు దివ్యాంగ పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఆసిఫాబాద్ మండల కేంద్రంలోని బ్రాహ్మణవాడకు చెందిన విజయ్ కుమార్ తనకు వృద్ధాప్య పింఛన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి అధికారుల సమన్వయంతో త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

# వెంకటాపూర్ వద్ద రోడ్డు ప్రమాదం

**ఎలక్ట్రిక్ స్కాటర్ ను డి కొట్టిన ఆర్ టి సి బస్ వ్యక్తి దుర్మరణం**

ఎల్లారెడ్డిపేట, మే 24 విజన్ ఆంధ్ర ఎల్లారెడ్డిపేట మండలంలోని వెంకటాపూర్ గ్రామ సమీపంలో ఎలక్ట్రిక్ స్కాటర్ ను ఆర్టీసీ బస్ డి కొట్టింది. ఈ ప్రమాదంలో ఎలక్ట్రిక్ స్కూటర్ నడుపుతున్న వ్యక్తి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి కామారెడ్డి జిల్లా బిక్కనూరు మండలం జంగంపల్లి గ్రామానికి చెందిన బక్కి నర్సయ్య గా మృతుని వద్ద లభించిన ఆదార్ కార్డు ద్వారా గుర్తించారు. ప్రమాదంపై ఎల్లారెడ్డి పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రజావాణికి 189 ఫిర్యాదులు

**జిల్లా కలెక్టర్ దీపక్ తివారి**



వికారాబాద్ జిల్లా ప్రతినిధి మే 25 ( విజన్ ఆంధ్ర) : జిల్లాలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి ఆదేశించారు. సోమవారము కల్లెక్టేట్ కార్యాలయ సమావేశము హాలు నందు ఏర్పాటు చేసిన "ప్రజావాణి" కార్యక్రమంలో అధికారులను ఉద్దేశించి జిల్లా కలెక్టర్ మాట్లాడారు. ప్రజావాణి ద్వారా వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలు విన్నవిస్తూ దరఖాస్తులు సమర్పించారని కలెక్టర్ తెలిపారు. ఆర్ డి ఓ తహసిల్దార్ ల పరిదిలో స్వీకరించిన దరకాస్తులను పెండింగ్ ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని , ప్రతి ఫిర్యాదు పై తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాశించారు.

ముఖ్యంగా భూసంబంధిత సమస్యలు, ఆసరా పెన్షన్లు, రేషన్ కార్డులు, గృహనిర్మాణము, వ్యవసాయం,ఉపాధి, జిల్లా పంచాయతి, భూ సర్వే వివిధ అంశాలపై వచ్చిన దరఖాస్తు లపై దృష్టి పెట్టాలన్నారు. ప్రజావాణి కార్యక్రమం ద్వారా 189 దరఖాస్తులు వచ్చాయని, ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని వేగంగా పరిష్కరించెందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమం లో అదనపు కలెక్టర్ వెంకటాచారి,అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్ . జడ్ పి సి ఇ ఓ సుధీర్, వివిధ శాఖ ల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు

# ఉద్యోగుల బదిలీలు పూర్తి పారదర్శకంగా

**కలెక్టర్ బి. చంద్రశేఖర్**

**గ్రేడ్-1,2,3 పంచాయతీ కార్యదర్శుల బదిలీలు పూర్తి.**

**భార్యాభర్తలు,వైద్య కేసులకు ప్రాధాన్యత**

ఉమ్మడి నల్లగొండ జిల్లా బ్యూరో, మే 24,(విజన్ ఆంధ్ర)రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నల్గొండ జిల్లాలో ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలను పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ తెలిపారు.ఆదివారం ఉదయాదిత్య భవన్‌లో నిర్వహించిన గ్రేడ్-1,గ్రేడ్-2, గ్రేడ్-3 పంచాయతీ కార్యదర్శుల బదిలీల కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు.ఈ సందర్భంగా బదిలీల ప్రక్రియపై పంచాయతీ కార్యదర్శులకు కలెక్టర్ క్షుణ్ణంగా వివరించారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలపై జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం బదిలీలకు అర్హత ఉన్న ఉద్యోగుల జాబితాను రూపొందించామని,వారు ఇచ్చిన ఆప్షన్స్



ప్రకారం ప్రత్యేక కేటగిరీలకు ప్రాధాన్యత ఇస్తూ బదిలీలు చేపట్టినట్లు వెల్లడించారు.జిల్లాలోని అన్ని శాఖలలో బదిలీలను పూర్తి పారదర్శకంగా,నియమ నిబంధనల ప్రకారం నిర్వహిస్తున్నామని తెలిపారు. బదిలీల సందర్భంగా భార్యాభర్తల కేసులు,వైద్య కారణాలు,ఇతర అన్ని రకాల కేటగిరీలను పరిగణనలోకి తీసుకొని బదిలీలు చేపట్టామని, ఎలాంటి బంధుప్రీతి,ఆశ్రిత పక్షపాతం లేకుండా పూర్తి పారదర్శకంగా బదిలీలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు.అదే విధంగా పంచాయతీ కార్యదర్శుల బదిలీలను సైతం చేపట్టినట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల ఇంచార్జి అదనపు కలెక్టర్ వై.అశోక్ రెడ్డి,జిల్లా పంచాయతీ అధికారి శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.అనంతరం జిల్లా పరిషత్‌లో నిర్వహించిన ఉద్యోగుల బదిలీల ప్రక్రియకు జిల్లా కలెక్టర్ హాజరయ్యారు.జడ్పీసీఓ ప్రేమ్ కరణ్ రెడ్డి పాల్గొన్నారు.

# రాష్ట్రవ్యాప్తంగా ఎనిమిది లక్షల 50 వేల మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటుంది మంత్రులు వెల్లడి

సిద్దిపేట జిల్లా ప్రతినిధి 25 మే సిద్దిపేట జిల్లా కేంద్రంలో రైతు సంక్షేమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం చేపట్టిన ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, ఖమ్మం జిల్లా నుండి రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వివిధ ప్రాంతాల నుండి రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, అడ్లూరి లక్ష్మణ్, పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, ఇతర అధికారులతో కలిసి ఇతర మంత్రులు, అన్ని జిల్లాల కలెక్టర్లు, అధికారులు, పార్లమెంట్ సభ్యులు, శాసనమండలి సభ్యులు, శాసన సభ్యులతో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 141 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం సాగు జరిగిందని, ఇందులో 75 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు లక్ష్యంగా కనీస మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 8 వేల 575 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ఇప్పటి వరకు 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి, 8 వేల 749 కోట్ల రూపాయల కనీసం మద్దతు ధరను విడుదల చేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 21 కోట్ల గోనెసంచులనుక్షేత్రస్థాయిలోఅందుబాటులో ఉంచడం జరిగిందని, కొనుగోలు కేంద్రాలలో వేచి ఉన్న 8 లక్షల 50 వేల మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు చేపట్టాలని తెలిపారు. ఈ నెల చివరికల్లా కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాలని, సరిహద్దు జిల్లాలలో చెక్ పోస్టులను ఏర్పాటు చేసి బయట రాష్ట్రాల నుంచి వరి ధాన్యము, జొన్నలు, మొక్కజొన్నలు రాకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని తెలిపారు. తాలు, తరుగు విషయంలో రైస్ మిల్లర్లు, దళారులు రైతులను మోసం చేస్తే




వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు త్వరగా టాబ్ లో నమోదు చేసి రైతులకు నగదు చెల్లింపు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, రైతులకు ఎలాంటి నష్టం రాకుండా చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. వరి ధాన్యం కొనుగోలు విషయంలో తప్పుడు వార్తలను ఖండించాలని, ప్రతికూల వార్తలపై అధికారులు వెంటనే స్పందించాలని, రికార్డు స్థాయిలో కొనుగోలు చేసిన విషయాలను ప్రచారం చేయాలని తెలిపారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని, సరిపడా హమాలీల సంఖ్యను పెంపొందించుకోవాలని తెలిపారు. గతంలో రైతులు వరి ధాన్యం కొనుగోలు నగదు చెల్లింపు విషయంలో నెలల తరబడి వేచి ఉండవలసి వచ్చేదని, ఇప్పుడువెంటనేచెల్లింపులు చేయడం జరుగుతుందని తెలిపారు. పట్టణాల అభివృద్ధిలో భాగంగా వాయు కాలుష్య నివారణకు చర్యలు తీసుకోవడంజరుగుతుందని, ఇందులో భాగంగా వ్యవసాయ వ్యర్థాల కాల్చివేసే రైతులకు వాయు కాలుష్య నివారణపై అవగాహన కల్పించాలని తెలిపారు.అనంతరం రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క), రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్,పంచాయతీరాజ్- గ్రామీణ అభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి దాన కిషోర్ లతో కలిసి 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మే 25 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్న మహిళా సంక్షేమ వారంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామ, మండల స్థాయిలో ఇందిరా మహిళా శక్తి భవనాలు, అంగన్వాడీ కేంద్రాల శంకుస్థాపన, మహిళల భద్రత, పోష్ చట్టంపై అవగాహన కల్పించడం, సోలార్ పవర్ ప్లాంట్ల స్థాపన, మహిళ మండల సమాఖ్యప్రత్యేక సాధారణ కార్యవర్గ సమావేశాల నిర్వహణ, ఉల్లాస్ కార్యక్రమం, అమ్మ మాట - అంగన్వాడి బాట కార్యక్రమాల నిర్వహణ తదితర అంశాలపై కార్యక్రమాలు నిర్వహించవలసి ఉటుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ కే . హైమావతి మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లాలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని, అకాల వర్షాల కారణంగా ధాన్యం దెబ్బ తినకుండా జిల్లాలో గుర్తించిన గోదాములు, కేటాయించిన ప్రకారం రైస్ మిల్లులకు ధాన్యం తరలించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా స్థాయి అధికారుల సమన్వయంతో ప్రతిరోజు వరి ధాన్యం ప్రక్రియ పురోగతిపై పర్యవేక్షించడం జరుగుతుందని, వేగవంతానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు సౌకర్యాలు కల్పించడంతో పాటు సీఎంఆర్ ప్రక్రియ పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా కార్యక్రమాలను అధికారులసమన్వయంతో సమర్థవంతంగానిర్వహిస్తున్నామ నితెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ లక్ష్మి కిరణ్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి తనూజ,జిల్లా మేనేజర్ గోపికృష్ణ, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి జయదేవ్ ఆర్యా, జిల్లా మార్కెటింగ్ అధికారి నాగరాజు, జిల్లా సంక్షేమ అధికారి శారద, జిల్లా సహకార అధికారి, తదితరులు పాల్గొన్నారు

# సిద్దిపేట జిల్లా లో క్షయ వ్యాధి అంతం మనందరి బాధ్యత

**జిల్లా కలెక్టర్ హైమావతి. పిలుపు**




సిద్దిపేట జిల్లా ప్రతినిధి మే 25టిబి ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా, వైట్ ఫీల్డ్ బయో ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ పోతారంగ్రామముమండలు బెజ్జంకి వారి సౌజన్యంతో ఫుడ్ బాస్కెట్ పంపిణీ కార్యక్రమాన్ని అర్బన్ హెల్త్ సెంటర్ నాసర్ పురా లో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి గౌరవ జిల్లా కలెక్టర్ కే.హైమావతి ముఖ్యఅతిథిగా విచ్చేసి టీబి పేషెంట్లకు డి ఎం హెచ్ ఓ ధనరాజ్ తో కలిసి అందజేయడం జరిగింది. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మన జిల్లాను క్షయ రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని, క్షయవ్యాధితోబాధపడుతున్న వారు తమ కుటుంబ సభ్యులకు, సమాజానికి రాకుండా తమ వంతు జాగ్రత్తలు తీసుకొని డాక్టర్లు సూచించిన విధంగా మందులు క్రమం తప్పకుండా తీసుకొని మంచి పోషక విలువలు ఉన్నఆహారాన్నితీసుకోవడం వలన వ్యాధి నిరోధక శక్తి పెరగడం వలన క్షయ వ్యాధి పూర్తిగా నయమవుతుందని వారిని టీబీ ఛాంపియల్గా మార్చవచ్చని తెలుపుతూ, మంచి పోషక విలువలు ఉ న్నఆహారంతీసుకునేందుకు తను స్వయంగా జిల్లా ఇండస్ట్రియల్ సెంటర్ జనరల్ మేనేజర్ గణేష్ రామ్, వైట్ ఫీల్డ్ బయో ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శివాజీ నాల్కర్ వారి సౌజన్యంతో క్షయ వ్యాధిగ్రస్తులకు ఏడు రకాల పోషక విలువలు ఉన్న ఆహార బుట్టలను (ఫుడ్ బాస్కెట్) పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది. క్షేత్రస్థాయిలో ఆరోగ్య సిబ్బంది ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చేవ్యాధి లక్షణాలను ముందస్తుగా గుర్తించి వ్యాధి తీవ్రతలు పెరగకుండా అవగాహన కల్పించాలని, గుర్తించిన చేవ్యాధిగ్రస్తులకు క్రమం తప్పకుండా మందులు మందులతో పాటు ఆరు నెలలు పోషక విలువలు ఉన్నటువంటి ఆహారం తీసుకునే విధంగా ప్రోత్సహించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇండస్ట్రియల్ జనరల్ మేనేజర్ గణేష్ రామ్, వైట్ ఫీల్డ్ బయో ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శివాజీ నాల్కర్, ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ నిర్మల రెడ్డి, డాక్టర్ వినోద్ బాబ్జి డాక్టర్ శ్రీకాంత్, డెమో నవీన్ రాజ్, సత్యనారాయణ,సూపర్వైజర్లు రాజేందర్ రమణ, రాజు, మల్లయ్య, తిరుపతి రెడ్డి ఆరోగ్య సిబ్బందిఆశకార్యకర్తలుపాల్గొన్నారు.


# గ్రీవెన్స్ డేలో 41 ఫిర్యాదుల స్వీకరణ

**బాధితులకు సత్వర న్యాయం అందించడమే లక్ష్యం**

**జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే**

రాజన్న సిరిసిల్ల బ్యూరో, మే 25 (విజన్ ఆంధ్ర):ప్రజల సమస్యలను నేరుగా స్వీకరించి త్వరితగతిన పరిష్కరించడమే లక్ష్యంగా ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ మీఘ్రవంష్ర దీ. +ఈవ మహేష్ బి. గితే తెలిపారు.సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి మొత్తం 41 ఫిర్యాదులు స్వీకరించినట్లు ఎస్పీ వెల్లడించారు. అందిన ఫిర్యాదులపై సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి, బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజలకు పోలీస్ సేవలను మరింత చేరువ చేయడం, వారి సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించడం పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని తెలిపారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు.వినతులు, ఫిర్యాదులను స్వీకరించి అవసరమైతే క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. దీంతో ప్రజల్లో పోలీస్ శాఖపై విశ్వాసం, భరోసా పెరుగుతుందని పేర్కొన్నారు. గ్రీవెన్స్ డేలో వచ్చిన ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి, వాటి పరిష్కార స్థితిని నిరంతరం సమీక్షిస్తున్నామని తెలిపారు. ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా వాటిని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు.

# శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన స్టాల్సమ్మేళనాన్నిసందర్శించిన జిల్లా కలెక్టర్



సిద్దిపేట జిల్లా ప్రతినిధి 25 మే ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రక్రియలో భాగంగా సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలో మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన పోషకాహార మేళ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె. హైమావతి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.పోషకాహార మేళ లో భాగంగా స్టాల్ లో ప్రదర్శించిన పలు పదార్థాలను రుచి చూసారు.చాలాబాగున్నాయని, అంగన్వాడీ ద్వారా గర్భిణులకు ఇలాంటి ఆహారం అందించాలని తెలిపారు. అనంతరం మహిళా శిశు సంక్షేమ సంబంధించి పలు పోస్టర్ లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రక్రియలో ప్రతి వారం ఒక్కోదీ వ్రైతాకార్యక్రమా లునిర్వహించడంజరు గుతుందని ఈ వారం మహిళ శిశు సంక్షేమం భాగంగా ఇక్కడ పోషకాహార మేళ నిర్వహించడం జరిగిందని తెలిపారు.ప్రభుత్వం గర్భిణీ మహిళలకు, శిశు సంక్షేమం కోసం అంగన్వాడీ ద్వారా పలు పోషక విలువలు కలిగిన బలవర్ధకమైన ఆహారాన్ని అందిస్తుంది.పోషకాహార మేళ ను ప్రజలకు, అధికారులకు ఒక అవగాహనకల్పించడం కోసం ఈ కార్యక్రమం నిర్వహించాం.ప్రతి వారం వారిగా గర్భిణీ మహిళలకు ఆకుకూరలు, పండ్లు, ప్రకృతిలో లభించే రకరకాల ఆహారాలు ఇలా ప్రతిదీ ప్రభుత్వం అందిస్తుందనీ వీటిని తినడం ద్వారా గర్భిణీలు ఆరోగ్యంగా ఉంటూ ఆరోగ్యవంతమైన శిశువుకు జన్మనిస్తుందని శిశువు జన్మించిన తరవాత కూడా కొన్ని వారాల పాటు ఈ పోషకాహారం ఉచితంగా అందించడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిడబ్ల్యూ ఓ శారద, డిఆర్ డిఓ జయదేవ్ ఆర్య, సిపిఓ దశరథం, డి ఎచ్ ఓ సువర్ణ, డిటిసిపిఓ రాము, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి లో 91 దరఖాస్తులు

## క్షేత్రస్థాయిలో క్షుణంగా పరిష్కరించాలి

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల జిల్లా ప్రతినిధి మే 25,(విజన్ ఆంధ్ర)ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు లతో కలిసి అర్జిదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. మంచిర్యాల పట్టణానికి చెందిన పొగాకు బుచ్చిబాబు తాము కొనుగోలు చేసిన భూమిలో ఇంటి నిర్మాణం చేపట్టి కొంతమేర చేసి అనివార్య కారణాలతో నిలిపివేయడం జరిగిందని, నిర్మాణ గడువును పొడిగిస్తూ అనుమతి పత్రం జారీ చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మందమర్రి పట్టణం ఒర్రెగడ్డ ప్రాంతానికి చెందిన బర్ల సుగుణ తన భర్తకు చెందిన ఆస్తిని ఆయన మరణానంతరం పెద్ద కుమారుడు తన పేరిట మార్పు చేసుకునేందుకు కుటుంబ సభ్యులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ఈ క్రమంలో ఆస్తి మార్పిడిపై విచారణ జరిపి తమను రక్షించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. నస్పూర్ మండలం సింగాపూర్ కు చెందిన సల్లూరి పోశమ్మ తన భర్త పేరిట ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాగా ఆయన మరణించారని అట్టి ఇంటిని తనకు మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. హాజీపూర్ మండలం నమ్నూర్ గ్రామానికి చెందిన మద్దెల గట్టయ్య తనకు గుడిపేట శివారులో గల భూమి రెవెన్యూ రికార్డులలో తప్పుగా నమోదు అయిందని, సవరించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల పట్టణ రాజీవ్ నగర్ కాలనీకి చెందిన బొల్లం సుజాత తాను ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకోగా ఎల్ 1 జాబితాలో ఉండి ఫేజ్ 1, 2 జాబితాలో పేరు రాలేదని, ఇల్లు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల పట్టణం జాఫర్ నగర్ కు చెందిన గెరిక దుర్గ తాము పూల వ్యాపారం చేసుకుంటూ జీవిస్తున్నామని, రెండు పడక గదుల ఇండ్లలో లక్కీ డ్రా పద్ధతిన ఇల్లు వచ్చిందని, సర్వే చేసి ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. హాజీపూర్ మండలం నర్సింగాపూర్ గ్రామానికి చెందిన మొహమ్మద్ సర్వర్ బి తన భర్త చనిపోయాడని, పిల్లల పోషణ కొరకు తనకు ఆసరా పెన్షన్ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో 91 దరఖాస్తులు వచ్చాయని, ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి అధికారుల సమన్వయంతో పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.
ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఏసీబీ కి పట్టుబడిన ఇరిగేషన్ డీఈ



హనుమకొండ జిల్లా ప్రతినిధి మే 25 (విజన్ ఆంధ్ర) : హనుమకొండలో ఏసీబీ అధికారులకు సోమవారం ఇరిగేషన్ డీఈ పట్టుబడ్డాడు. జనగామ జిల్లా పాలకుర్తి ఇరిగేషన్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న డీఈ శ్రీకాంత్ ను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. హనుమకొండ నగరం భవానీ నగర్ లోని తన ఇంట్లో రూ.50 వేల లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు శ్రీకాంత్ ను పట్టుకున్నారు. అధికారిక పనుల కోసం లంచం తీసుకుంటున్న సమయంలో దాడి చేసి ఆయనను అదుపులోకి తీసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి విచారణ కొనసాగిస్తున్నట్లు ఏసీబీ డీఎస్పీ పసునూరి సాంబయ్య తెలిపారు. కాగా ఇటీవల కాలంలో వరుసగా ఏసీబీ అధికారులు అవినీతి అధికారులను రెడ్ హ్యాండెడ్ గా పట్టు కుంటున్నారు. అయినప్పటికీ లంచము తీసుకునే అవినీతి పనితీరు మారడం లేదు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో గత సంవత్సరం కాలం పైగా ప్రతి వారం ఏదో ఒక చోట అవినీతి అధికారులు పట్టుబడుతుండడం సంచలనం సృష్టిస్తున్నది.

# జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ కొనసాగించాలి

### జిల్లా కలెక్టర్ ను కోరిన టీయూడబ్ల్యూజే (ఐజేయూ) నాయకులు

హనుమకొండ జిల్లా ప్రతినిధి మే 25 ( విజన్ ఆంధ్ర ) : హనుమకొండ జిల్లాలోని ప్రైవేట్, అన్ఎయిడెడ్ పాఠశాలల్లో జర్నలిస్టుల పిల్లలకు గతంలో అమలులో ఉన్న విధంగానే ఈ విద్యా సంవత్సరంలో కూడా 50 శాతం ఫీజు రాయితీ కొనసాగించేలా ఉత్తర్వులు జారీ చేయాలని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) హనుమకొండ జిల్లా శాఖ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ ను కోరింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు సమర్పించిన వినతిపత్రంలో జర్నలిస్టుల పిల్లలు ప్రైవేట్, అన్ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్నారని, గత కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేస్తోందని పేర్కొన్నారు. ప్రస్తుతం విద్యా ఖర్చులు గణనీయంగా పెరిగిన నేపథ్యంలో జర్నలిస్టు కుటుంబాలు తీవ్ర ఆర్థిక భారం ఎదుర్కొంటున్నాయని తెలిపారు. అందువల్ల గతంలో అమలులో ఉన్న విధంగానే ఈ విద్యా సంవత్సరానికి కూడా జిల్లాలోని అన్ని ప్రైవేట్, అన్ఎయిడెడ్ పాఠశాలల్లో జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ కల్పించేలా సంబంధిత అధికారులకు అవసరమైన ఉత్తర్వులు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించి డీఈఓను అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు గడ్డం కేశవమూర్తి, జిల్లా కార్యదర్శి ఊటుకూరు సాయిరాం, కోశాధికారి విష్ణువర్ధన్, ప్రెస్ క్లబ్ జనరల్ సెక్రటరీ బొల్లారం, కోశాధికారి అమర్, మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు కంకణాల సంతోష్, బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.

# చేర్యాల కోహెడ వ్యవసాయ మార్కెట్ కమిటీ కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్



సిద్దిపేట జిల్లా ప్రతినిధి25 మే సిద్దిపేటజిల్లాలో ధాన్యం కొనుగోలు వేగంగా జరుగుతుందని రైతులు సంయమనం పాటిస్తూ అధికారులతోసహకరించాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి విజ్ఞప్తి చేశారు. కోహెడ మండలంలోని వెంకటేశ్వరపల్లి లోని ఆధునిక మార్కెట్ కమిటీ మరియు చేర్యాల పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ లోని గోదాములో ధాన్యం దిగుమతి ప్రక్రియను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనికి చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. జిల్లాలో ధాన్యం కొనుగోలు సజావుగాకొనసాగుతుందని వేగవంతం చేయడానికి మిల్లులకు కాకుండా అందుబాటులో ఉన్న గోదాం లో ప్రస్తుతానికి దిగుమతి చేస్తున్నామని తెలిపారు. కోహెడ లోని గోదాం వద్ద ధాన్యం ట్రాక్టర్ లైన్ చాలా పెద్దదిగా ఉన్నందున ప్రతి ట్రాక్టర్ కి టోకెన్ ఇచ్చి ఒక ప్రణాళిక ప్రకారం వేగంగా దిగుమతి చేసేలా పనిచేయాలని మార్కెట్ కమిటీ మరియు రెవెన్యూ అధికారులనుఆదేశించారు. అనంతరం చేర్యాల మార్కెట్ కమిటీ ని పరిశీలించి చేర్యాల ఏఎంసి లో ధాన్యాన్ని మొత్తం గోదాములో దిగుమతి చేసిన తర్వాతనే వేరే సెంటర్ ల నుండి వచ్చే ధాన్యాన్ని దిగుమతి చెయ్యాలని సిబ్బందిని ఆదేశించారు. రైతులు పండించిన పంట చివరి గింజ వరకు కొనుగోలు చేస్తుందని హమాలీ మరియు లారీల కొరత ఉన్నందున వేగంగా జరగడం కోసం అధికార యంత్రాంగం శాయశక్తిలా పనిచేస్తుందనిసంయమనం పాటిస్తూ సహకరించాలని జిల్లా రైతాంగానికి విజ్ఞప్తి చేశారు.

# తెలంగాణ గ్రామ పంచాయతీలకు 9.968 నిధులను మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వం




సిద్దిపేట జిల్లా ప్రతినిధి మే 25:తెలంగాణ రాష్ట్రంలోని గ్రామపంచాయతీలు తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న నేపథ్యంలో గ్రామీణ స్థానిక సంస్థల బలోపేతానికి కేంద్ర 16వ ఆర్థిక సంఘం భారీగా నిధులను కేటాయించింది. గ్రామాల్లో వీధి దీపాలు, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం వంటి ప్రాథమిక సేవలను కొనసాగించడంలో పంచాయతీలు అనేక ఇబ్బందులుఎదుర్కొంటున్నాయి. కొంతకాలంగా పాలక వర్గాలు లేకపోవడంతో గ్రామపంచాయతీలకు నిధుల విడుదల కూడా నిలిచిపోయిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం 2026-27 నుంచి 2030-31 వరకు ఐదేళ్ల కాలానికి తెలంగాణకు మొత్తం రూ.9,968 కోట్ల నిధులను మంజూరు చేసింది. ఈ నిధుల వినియోగం, పర్యవేక్షణ, పారదర్శకతపై కేంద్రం స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేసింది. కేంద్రం తెలిపిన ప్రకారంఈనిధులనుగ్రామపంచాయతీల మౌలిక సదుపాయాల అభివృద్ధి, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, వ్యర్థాల నిర్వహణ, గ్రామీణ రహదారులు, స్ట్రీట్‌లైట్‌ల ఏర్పాటు వంటి ప్రజా సేవలకే వినియోగించాలి. ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలు, పెన్షన్ల చెల్లింపుల కోసం ఈ గ్రాంట్లనుఎట్టిపరిస్థితుల్లోనూ వినియోగించరాదనిస్పష్టంచేసింది. నిధులదుర్వినియోగాన్ని అరికట్టేందుకు కేంద్రం కఠిన పర్యవేక్షణ నిబంధనలను అమలు చేయనుంది. ప్రతి స్థానిక సంస్థ తమ వ్యయ వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని సూచించింది. అలాగే త్రైమాసిక, వార్షిక పురోగతి నివేదికలను రాష్ట్ర ప్రభుత్వానికిసమర్పించాల్సి ఉంటుంది. వాటి ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి సమగ్ర నివేదిక ఇవ్వాల్సి ఉంటుంది. ఆడిట్‌లలో లోపాలు బయటపడితే వెంటనే సరిదిద్దాలని, నిధుల దుర్వినియోగం లేదా అవకతవకలు తేలితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. దేశవ్యాప్తంగా 16వ ఆర్థిక సంఘం ఐదేళ్ల కాలానికి రూ.4,35,236 కోట్ల గ్రాంట్లను ప్రకటించింది. ఇందులో 80 శాతం నిధులునేరుగాగ్రామపంచా యతీలకు,10శాతం మండలపరిషత్‌లకు,మరో10శాతం జిల్లాపరిషత్‌లకుకేటాయించనున్నారు. ప్రతి ఏడాది జూన్, అక్టోబర్ నెలల్లో రెండు విడతలుగా ఈ నిధులను విడుదల చేయనున్నారు. 2026 అంచనాల ప్రకారం గ్రామీణ జనాభాకు 90 శాతం, రాష్ట్ర వైశాల్యానికి 10 శాతం వెయిటేజీ ఇవ్వగా, తెలంగాణకు గ్రామీణ జనాభా ఆధారంగా 1.92 శాతం, వైశాల్యం ఆధారంగా 0.37 శాతం వాటా లభించింది. ఈ లెక్కన రాష్ట్రానికి మొత్తం రూ.9,968 కోట్ల నిధులుమంజూరయ్యాయి.

# "ప్రభుత్వ ఐటీఐ కుకునూరుపల్లి మరియు అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ (ATC)లో అడ్మిషన్ల కోసం ఉచిత రిజిస్ట్రేషన్ శిబిరాలు"ఏర్పాటు




సిద్దిపేట జిల్లా ప్రతినిధి మే 25ప్రభుత్వ ఐటీఐ కుకునూరుపల్లి మరియు అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ (ఆజు)లో 202627/28 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ల కోసం ఉచిత రిజిస్ట్రేషన్ శిబిరాలు నిర్వహించబడుతున్నాయసోమవారం జిల్లా కలెక్టర్ హైమవతి, జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్ , అలాగే గజ్వేల్ ఆర్డీవో చంద్రకళ ఆదేశాల మేరకు సిద్ధిపేట కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం వెలుపల ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి, విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులకు అడ్మిషన్లపై అవగాహన కల్పిస్తూ కరపత్రాలు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఉచిత రిజిస్ట్రేషన్ ప్రక్రియను అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్ ప్రారంభించారు,అదేవిధంగా గజ్వేల్ నియోజకవర్గ పరిధిలోని అన్ని మండల కేంద్రాల్లో ఉన్న ఎమ్మార్వో కార్యాలయాలు, గజ్వేల్ ఆర్డీవో కార్యాలయం మరియు సిద్ధిపేట కలెక్టరేట్‌లో కూడా ఈ ఉచిత రిజిస్ట్రేషన్ క్యాంపులునిర్వహిస్తున్నాం. ఈ శిబిరాలు మూడు రోజులపాటుకొనసాగుతాయి. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు తమకు సమీపంలోని ఎమ్మార్వో కార్యాలయానికి వెళ్లి ఉచితంగా ఐ టి ఐ అడ్మిషన్ కొరకు రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవచ్చు. మూడు రోజుల ప్రత్యేక క్యాంపుల అనంతరం కూడా ప్రభుత్వ ఐటీఐ కుకునూరుపల్లి కార్యాలయంలో అడ్మిషన్ ప్రక్రియ ముగిసే వరకు ఉచిత రిజిస్ట్రేషన్ సదుపాయం అందుబాటులో ఉంటుంది. కార్యాలయ సమయాల్లో ఎప్పుడైనా వచ్చి నమోదు చేసుకోవచ్చు. విద్యార్థుల సౌకర్యార్థం శని, ఆదివారాలు మరియు ప్రభుత్వ సెలవు దినాల్లో కూడా ప్రత్యేక క్యాంపులు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రిన్సిపాల్ డి. వెంకట్ రమణ తెలిపారు. ఐటీఐ విద్యార్థులకు నెలకు రూ.2,000 స్టైఫండ్, ఉచిత యూనిఫాం వంటి సదుపాయాలను అందించే ప్రతిపాదనలను ప్రభుత్వం పరిశీలిస్తోంది, ఈ విషయాన్నిస్వయంగా, ముఖ్యమంత్రి ఁవంత్ రెడ్డి మల్లేపల్లి ఐటీఐ లో జరిగిన సభలో తెలిపారని, త్వరలో ఈ సదుపాయాలు అమలులోకి వచ్చే అవకాశం ఉంది అన్నారు. ప్రభుత్వ ఐటీఐ కుకునూరుపల్లిలో 2 ఐ టి ఐ కోర్సులు, మరియు ఏటీసీలో 6 కోర్సులు (అందులో 3 ఒక సంవత్సరం) ఉన్నట్లు తెలిపారు, ప్రభుత్వ ఐటీఐ కుకునూరుపల్లిలో చేరే విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక శిక్షణతో పాటు అప్రెంటిస్ అవకాశాలు, ప్రముఖ కంపెనీల్లో ఇండస్ట్రియల్ ట్రైనింగ్, అలాగే ప్రత్యక్షంగా పని నేర్చుకునే విధంగా ఆన్ జాబ్ ట్రైనింగ్ కల్పించబడుతుంది. ఇప్పటికే ఇక్కడ శిక్షణ పూర్తి చేసిన పలువురు విద్యార్థులకు ఉద్యోగాలు మరియు అప్రెంటిస్ అవకాశాలు కూడా లభించాయి. అందువల్ల పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ మంచి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వెంటనే ఉచిత రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలని కోరుతున్నాం. ప్రభుత్వం అందిస్తున్న సాంకేతిక విద్య, నైపుణ్యాభివృద్ధి అవకాశాలను వినియోగించుకుని భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకోవాలని ప్రిన్సిపాల్ వెంకటరమణప్రభుత్వ ఐటీఐ, కుకునూరుపల్లి విజ్ఞప్తి చేశారు

# ధాన్యం నాణ్యత పరిరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

## రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి

### జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్



నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి (విజన్ ఆంధ్ర): మే 23 తాడూరు మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనరసింహ రైస్ మిల్లు, మేడిపూర్ గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ ఆకస్మికంగా సందర్శించి వరి ధాన్యం నిల్వ సామర్థ్యం, కొనుగోలు ప్రక్రియలను కలెక్టర్ పరిశీలించారు. రైతుల నుండి కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎలా నిల్వ చేస్తున్నారో, గిడ్డంగుల సామర్థ్యం ఎంత ఉందో, ధాన్యం నాణ్యత పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలపై ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు.
మిల్లు సామర్థ్యం 8000 మెట్రిక్ టన్నుల వరి ధాన్యం అందించడం జరుగుతుందని, ప్రతిరోజు సీఎంఆర్ రైస్ మూడు ఏసీకేలు ప్రభుత్వానికి అందించాల్సి ఉంటుందని సివిల్ సప్లై అధికారి కలెక్టర్కు వివరించారు .ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. రైతులు పండించిన ప్రతి గింజకు సరైన విలువ దక్కేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. రైతులు తీసుకొచ్చే ధాన్యాన్ని ఆలస్యం లేకుండా కొనుగోలు చేసి, తేమ శాతం, నాణ్యత ప్రమాణాలను పరిశీలించి పారదర్శకంగా నమోదు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. రైతులు ధాన్యం అమ్మకానికి వచ్చినప్పుడు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా తాగునీరు, నీడ, కూర్చునే సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. రైస్ మిల్లులో నిల్వ ఉంచిన వరి ధాన్యం రాశులను పరిశీలించిన కలెక్టర్, ధాన్యం తడవకుండా మరియు నాణ్యత దెబ్బతినకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నిల్వ గిడ్డంగుల పరిశుభ్రత, రక్షణ చర్యలు, రవాణా సౌకర్యాలపై కూడా సమీక్ష నిర్వహించారు. రైతుల నుండి వచ్చిన ధాన్యాన్ని వేగంగా మిల్లింగ్ ప్రక్రియకు పంపించే విధంగా చర్యలు తీసుకోవాలని మిల్లర్లకు సూచించారు. రైతులతో నేరుగా మాట్లాడిన కలెక్టర్ వారి సమస్యలను తెలుసుకుని, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎటువంటి ఇబ్బందులు చోటుచేసుకోకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని, రైతులు కూడా నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని కోరారు. జిల్లా కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ రెవిన్యూ అమరేందర్, సివిల్ సప్లై అధికారి నరసింహారావు డీఎం సివిల్ సప్లై రాజేందర్, వ్యవసాయ శాఖ అధికారులు, పౌర సరఫరాల శాఖ సిబ్బంది, రైస్ మిల్ నిర్వాహకులు మరియు రైతులు ఉన్నారు

# పెట్టుబడులు సమీకరించుకున్న స్కాపియా

హైదరాబాద్, మే 25 (విజన్ ఆంధ్ర) : భారత్ లోని ప్రముఖ ట్రావెల్-ఫిన్ టెక్ సంస్థల్లో ఒకటైన స్కాపియా, జనరల్ క్యా టలిస్ట్ నేతృత్వంలో నిర్వహించిన పెట్టుబడి సమీకరణలో 63 మిలియన్ డాలర్లను సమీకరించిందని స్కాపియా వ్యవస్థాపకుడు, సీఈవో అనిల్ గోటేటి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జనరల్ క్యాటలిస్ట్ ఇండియా, మెనా సీఈవో నీరజ్ అరోరా, ఇన్వెస్టర్లు పీక్ వీఎక్స్ పార్ట్నర్స్ కు చెందిన సాక్షి చోప్రా, జెడ్-47 ఎండీ విక్రమ్ వైద్యనాథన్ లతో కలసి ఆయన మాట్లాడుతూ ఈ పెట్టుబడి రౌండ్ తో స్కాపియా దేశ వ్యాప్తంగా లక్షలాది మంది వినియోగ దారులకు విస్తరించడంతో పాటు, ఉత్పత్తులు, బృందాల అభివృద్ధిలో ఏఐ-ఫస్ట్ విధానాన్ని మరింత వేగవంతం చేయనుందని తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే ప్లాట్ ఫామ్ లో ఫ్లైట్ బుకింగ్స్ 5 నుం చి 6 రెట్లు, హోటల్ బుకింగ్స్ 8 రెట్లు పెరిగాయన్నారు. ముఖ్యంగా టయర్-2, టయర్-3 నగరాల నుంచి బుకింగ్స్ లో గణనీయమైన వృద్ధి నమోదైనట్లు చెప్పారు.

# రైట్స్ ఇష్యూను జారీ చేసిన శక్తి ప్రెస్ లిమిటెడ్

హైదరాబాద్, మే 25 (విజన్ ఆంధ్ర) : మధ్య భారత్ లోని ప్రింటింగ్, ప్యాకేజింగ్ పరిశ్రమలో అభివృద్ధి చెందుతున్న సంస్థ అయిన శక్తి ప్రెస్ లిమిటెడ్, తన విస్తరణ ప్రణాళికలకు నిధులు సమకూర్చుకోవడానికి రైట్స్ ఇష్యూ ద్వారా రూ.49.28 కోట్ల వరకు సమీకరించాలని యోచిస్తోందని రైట్స్ ఇష్యూపై శక్తి ప్రెస్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ రాఘవ్ కైలాష్నాథ్ శర్మ సోమవారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అయన మాట్లాడుతూ మే 07న సబ్స్ క్రిప్షన్ కోసం ప్రారంభమైన ఈ రైట్స్ ఇష్యూ మే 29న ముగుస్తుందని తెలిపారు. ఆర్థిక స్థితిని బలోపేతం చేయడానికి, వృద్ధి కార్యక్రమాలకు నిధులు సమకూర్చేందుకు ఒక్కో షేరుకు రూ.20 ధరతో రైట్స్ ఇష్యూను ప్రారంభించినట్లు తెలిపారు. ఇది ప్రస్తుత వాటాదారులకు కంపెనీలో తమ ఈక్విటీని పెంచుకునే అవకాశాన్ని అందిస్తుందని తెలిపారు.

# ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కార విధానంలో సంస్కరణలు,

### నేటి ప్రజావాణికి 61 దరఖాస్తులు,జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్



నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి (విజన్ ఆంధ్ర): మే25 జిల్లా కేంద్రంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలకు మరింత వేగవంతమైన సేవలు అందించడంతో పాటు అధికారుల జవాబుదారితనం పెంచే దిశగా జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ కీలక మార్పులను అమలు చేశారు. ప్రజల సమస్యలు త్వరితగతిన పరిష్కారం కావడం, ఫిర్యాదుల పరిశీలనలో పారదర్శకత పెరగడం, సంబంధిత శాఖలతో నేరుగా సమన్వయం కల్పించడం లక్ష్యంగా ఈ కొత్త విధానాన్ని తీసుకువచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. ఇప్పటి వరకు ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదుదారులు నేరుగా జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రాలు సమర్పించేవారు. దీంతో అన్ని రకాల ఫిర్యాదులు ఒకేచోట చేరి సంబంధిత శాఖలకు పంపడంలో ఆలస్యం ఏర్పడుతుందని అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో సమస్యల పరిష్కార ప్రక్రియను మరింత సమర్థవంతంగా మార్చేందుకు కలెక్టరేట్‌లో కొత్త విధానాన్ని ప్రవేశపెట్టారు. కొత్త విధానం ప్రకారం ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులను ముందుగా సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన వివిధ విభాగాల సూపరింటెండెంట్లు పరిశీలిస్తారు. ఫిర్యాదు కొత్తదా, ఇప్పటికే నమోదైందా, ఏ శాఖకు సంబంధించినదో గుర్తించి ఫిర్యాదుదారులను సంబంధిత అధికారుల వద్దకు మార్గనిర్దేశం చేస్తారు. ఆ తరువాతఫిర్యాదుదారులు నేరుగా సంబంధిత శాఖ ఉన్నతాధికారులను కలిసి తమ సమస్యలను వివరించి ఫిర్యాదులనుసమర్పించనున్నారు. శాఖ అధికారులు ఫిర్యాదులను స్వీకరించి సమస్య పరిష్కారానికి చేపట్టే చర్యలు, ప్రస్తుత స్థితి, సాధ్యమైన పరిష్కార మార్గాలపై స్పష్టమైన సమాచారం అందించనున్నారు. అవసరమైతే వెంటనే చర్యలు కూడా తీసుకోనున్నారు. అధికారుల స్థాయిలో పరిష్కారం కాని లేదా ఉన్నతస్థాయి జోక్యం అవసరమైన అంశాలే జిల్లా కలెక్టర్దృష్టికితీసుకురావాలని వ్యవస్థ రూపొందించారు. దీంతో కలెక్టర్ వద్దకు చేరే ప్రతి ఫిర్యాదు ముందస్తు పరిశీలనతో ఉండటమే కాకుండా సమస్య పరిష్కార ప్రక్రియ వేగవంతం అవుతుందని అధికారులు భావిస్తున్నారు. ఈ మార్పుల వల్ల శాఖల మధ్య సమన్వయం పెరగడంతో పాటు ప్రజలు కార్యాలయాల చుట్టూ అనవసరంగా తిరగాల్సిన అవసరం తగ్గుతుందని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా నిర్వహించిన సోమవారం ప్రజావాణిలో మొత్తం 61 ఫిర్యాదులు అందినట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవ సహాయం, కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# 'ప్రజావాణి' దరఖాస్తుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలి

### జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా



కరీంనగర్ (విజన్ ఆంధ్ర బ్యూరో), మే 25.ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యత ఇనస్తా క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ చిత్రా మిశ్రా అన్నారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి కలెక్టర్ దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 353 మంది అర్జీదారులు ప్రజావాణిలో దరఖాస్తులు సమర్పించారు. కొన్ని దరఖాస్తులను అక్కడికక్కడే పరిష్కరించగా మరికొన్నింటిని అధికారులకు బదిలీ చేశారు. త్వరితగతిన దరఖాస్తులు పరిష్కరించాలని, పెండింగ్ దరఖాస్తులు క్లియర్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ మహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# నిందితులను కఠినంగా శిక్షించాలి

## న్యాయవాదుల రక్షణ చట్టాన్ని వెంటనే అమలు చేయాలి

## అడిషనల్ స్టాండింగ్ కౌన్సిల్ మెంబర్ నర్సింగోజు నరేష్ కుమార్




బోడుప్పల్,మే 25( విజన్ ఆంధ్ర) :తెలంగాణ): హైదరాబాద్‌లో సీనియర్ న్యాయవాది ఖాజా మొయినుద్దీన్‌పై జరిగిన దాడి చేసిన నిందితులను వెంటనే పట్టుకుని కఠినంగా శిక్షించాలని అడిషనల్ స్టాండింగ్ కౌన్సిల్ మెంబర్ నర్సింగోజు నరేష్ కుమార్ పోలీసులను, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. న్యాయవాది ఖాజా మొయినుద్దీన్ హత్యకు నిరసనగా సోమవారం ఉప్పల్ కోర్టు కాంప్లెక్స్‌లో న్యాయవాదులు విధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ మేరకు అడిషనల్ స్టాండింగ్ కౌన్సిల్ మెంబర్ నర్సింగోజు నరేష్ కుమార్ మాట్లాడుతూ న్యాయవాది మృతిపై దర్యాప్తునకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి నిందితులను త్వరగా అరెస్టు చేయాలని డీజీపీ, హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్‌ను డిమాండ్ చేశారు. న్యాయవాదుల రక్షణ చట్టాన్ని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో న్యాయవాదులు రాఘవరెడ్డి,సత్యనారాయణ, పవన్, శ్రీనివాస్,వెంకట్ రాములు, రాధాకృష్ణ,శ్రీకాంతుడు,ప్రసన్న, శేఖర్,శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# హత్యకేసులో 5 గురు నిందితుల అరెస్ట్

## 24 గంటల్లోనే హంతకులను గుర్తించిన పోలీసులు


## సూర్యాపేట జిల్లా ఎస్పీ కే నరసింహ



సూర్యాపేట మే 25:(విజన్ ఆంధ్ర)సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయం నందు నిర్వహించిన మీడియా సమావేశంలో కేసు దర్యాప్తు, నిందితుల అరెస్ట్ వివరాలు సోమవారం సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ వెల్లడించారు.శనివారం సూర్యాపేట రూరల్ పరిధి ఏర్కారం గ్రామ శివారు రోడ్డు కల్వర్టు క్రింద దొరికిన మృతదేహం కేసులో పోలీసులు వేగవంతమైన దర్యాప్తు చేశారు. ఐదుగురు నిందితులను అరెస్ట్ చేశారు. హత్యకు గురైన వ్యక్తి ఏర్కారం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ భర్త 42 సంవత్సరాల చింతలపాటి మధు గా గుర్తించారు. కాగా మధు శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో సూర్యాపేటలో కుడకుడ రోడ్డులో అద్దెకు ఉంటున్న ఇంట్లో నుండి వెళ్లి రాత్రి వరకు రాకపోవడంతో అతని భార్య మౌనిక శుక్రవారం రాత్రి సూర్యాపేట పట్టణ పోలీసు స్టేషన్ నందు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై మిస్సింగ్ కేసు నమోదు చేసి వేగంగా పోలీస్ డీఎస్పీ పర్యవేక్షణ,జిల్లా ఎస్పీ ఆదేశంతో మధు కోసం గాలింపు చేపట్టారు. ఏర్కారం గ్రామ శివారులో కల్వర్టు క్రింద గోనే బస్తా మూటలో మధు మృతదేహాన్ని గుర్తించారు. మిస్సింగ్ కేసును హత్యకేసుగా మార్పు చేసి 5 ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేసి కేసును దర్యాప్తు చేపట్టారు.సూర్యాపేట పట్టణ కేంద్రం తాళ్లగడ్డ లో సైదులు నివాసం ఉంటున్న కిరాయి ఇంటిని పోలీసులు గుర్తించారు.హత్య జరిగిన ఇంటి వద్ద క్లూస్ టీం, కేసు దర్యాప్తు అధికారులు ఆధారాలను సేకరించారు.సంఘటన జరిగిన 24 గంటలోపే హత్యకు పాల్పడిన వారిని గుర్తించడం జరిగిందన్నారు.పాత కక్షల నేపథ్యంలో హత్య జరిగినట్లు నిర్ధారించామన్నారు.2007 సంవత్సరంలో ఏర్కారం గ్రామ సర్పంచ్ మిద్దె రవీందర్ ను హత్య చేసిన కేసులో చింతపాటి మధు ప్రధాన నిందితుడు, ఈ విషయంలో ప్రతీకారం పెంచుకున్న మిద్దె రవీందర్ కొడుకు మిద్దె జీవన్ ఈ హత్యకు పథకం పన్ని ప్రత్యక్షంగా, ప్రధానంగా ఉన్నట్లు గుర్తించారు. ఈ విశాగా కేసు దర్యాప్తు చేస్తున్న దర్యాప్తు అధికారి సూర్యాపేట పట్టణ ఇన్స్పెక్టర్ వెంకటయ్య ఆధ్వర్యంలో బృందం సూర్యాపేట రూరల్ పరిధి టేకుమట్ల గ్రామం వద్ద జాతీయ రహదారి 65 పై ఖమ్మం హైవే టీ-జంక్షన్ వద్ద సోమవారం ఉదయం 6 గంటల సమయంలో ఏ1 నిందితుడు మిద్దె జీవన్ ను, ఏ4 నిందితుడు మిద్దె ఆనంద్ లను అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. విచారణలో భాగంగా తన తండ్రి మిద్దె రవీందర్ ను హత్య చేసిన విషయంలో ప్రతీకారంగాను, మధు బతికి ఉంటే తనకు ప్రాణహాని తప్పదు అని భావించి మధు ను ఎలాగైనా చంపాలనే పథకం ప్రకారం హత్య చేశామని నిందితుడు జీవన్ తెలిపాడని మధును హత్య చేసే విషయంలో మధుకు స్నేహితులైన, నిందితుని దూరపు బంధువులైన సూర్యాపేట రూరల్ మండలం రామన్నగూడెం కు చెందిన ఏ2 నిందితుడు చింత సైదులు, అర్వపల్లి మండలం రామన్నగూడెం గ్రామానికి చెందిన ఏ3 మేదిరి ప్రసాద్ లను జీవన్ స్నేహితులుగా చేసుకున్నాడు. వీరు ముగ్గురు కలిసి మందు దావతులు చేసుకునేవారు, మా తండ్రిని చంపిన మధును ఎలాగైనా చంపాలి అన్న విషయాన్ని సైదులు, ప్రసాదులకు జీవన్ తెలియజేసి అందుకు సహకరించాలని డబ్బు ఇస్తానని కోరాడు.అలాగే మధును చంపాలన్న విషయాన్ని జీవన్ కు తమ్ముడు వరసైన యర్కారం గ్రామానికి మిద్దె ఆనంద్ కు చెప్పాడు. మధు ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తుండగా కారుతో యాక్సిడెంట్ చేసి చంపాలని 2021లో ప్రయత్నించి విఫలమయ్యారు. మరోసారి నిమ్మికల్ లో ఫంక్షన్ హాల్ వద్ద హత్య చేయాలని ప్రయత్నించి విఫలమయ్యారు.మధును ఎలాగైనా చంపాలని పథకం ప్రకారం ఏ2 నిందితుడు సైదులుకు సూర్యాపేట జిల్లా కేంద్రంలో తాళ్లగడ్డలో ఒక ఇల్లు అద్దెకు తీసుకొని ఇల్లు కిరాయి కరెంటు వారి ఖర్చులు కూడా జీవన్ భరిస్తున్నాడు. మధును చంపాలన్న విషయాన్ని సైదులు భార్య భవానికి తెలిపి అందుకు సహకరిస్తే మూడు లక్షలు ఇస్తానని ఒప్పించాడు. తాళ్లగడ్డ ప్రాంతానికి చెందిన కక్కిరేణి భరత్ కు మధును చంపాలన్న విషయాన్ని జీవన్ తెలియజేసి సహకరించాలని కోరాడు. తాళ్లగడ్డలో కిరాయికి తీసుకున్న ఇంట్లో సైదులు, ప్రసాద్, మధు ముగ్గురు మందు దావతులు చేసుకునేవారు. సైదులు భార్య భవాని వారికి చికెన్, మటన్ తయారు చేసి పెడుతుండేది. ఇదే క్రమంలో శుక్రవారం 22 మే 2026 మధ్యాహ్నం చేపలు, మందు తెచ్చాము దావత్ చేసుకుందామని రమ్మని సైదులు, ప్రసాద్ లు మధుకి ఫోన్ చేసి పిలిచారు.మధ్యాహ్నం రెండు గంటల సమయంలో మధు కిరాయి ఇంటి వద్దకు రాగా ఈ విషయాన్ని జీవన్ కు సైదులు ఫోన్ చేసి తెలియజేసి మందు పంపమని చెప్పాడు. జీవన్ ఏ6 నిందితుడు భరత్ ద్వారా రెండు సార్లు మందు పంపించారు. కారులో జీవన్,ఆనంద్ ఇద్దరు వచ్చి ప్రభుత్వాసుపత్రి వద్ద వేచి ఉంటారు,సుమారు 7:30 గంటల సమయంలో మధు మద్యం మత్తులో ఉన్నప్పుడు అదునైన సమయం చూసి విషయాన్ని జీవన్ కు తెలుపగా జీవన్, ఆనంద్ లు ఇద్దరు కారులో మధు ఉన్న ఇంటికి చేరుకుని ఇంటిలోకి వెళ్లారు. ఇంటిలోకి వెళ్ళగానే ప్రసాద్ మధు యొక్క కాళ్లు చేతులు పట్టుకోగా అప్పటికే సిద్ధంగా పెట్టుకున్న మటన్ కొట్టే కత్తితో సైదులు మధు పై దాడి చేస్తాడు. వెంటనే సైదులు వద్ద ఉన్న కత్తిని జీవన్ తీసుకుని మధు మెడ, మొహం, భుజంపై తీవ్రంగా దాడి చేసి హత్య చేసాడని,హత్య చేసిన అనంతరం మృతిదేహాన్ని గోనెసంచి బస్తాలో కట్టి కారులో వేసుకొని వెళ్లి యర్కారం శివారులో కల్వర్టు కింద పడేశారు.మధు యొక్క బైకును ఆనంద్ తీసుకుని వెళ్లి బాలెంల శివారులో నయారా పెట్రోల్ బంక్ కు సమీపంలో వదిలేసారు. అలాగే ప్రసాద్ బైక్ పై ప్రసాదు, సైదులు ఇద్దరు వెళ్లిపోయి హత్యకు ఉపయోగించిన కత్తిని, మధు యొక్క సెల్ ఫోను అడివేముల గ్రామ శివారు కొద్ది దూరంలో కెనాల్ లో పడివేశారు. తదుపరి నిందితులు అక్కడి నుండి పారిపోయారు.నమ్మదగిన సమాచారంపై ఏ1, ఏ4 లను అదుపులోకి తీసుకొని వారు చెప్పిన వివరాల ఆధారంగా మరో ఏ2, ఏ3, ఏ6 ముగ్గురు నిందితులను సోమవారం ఉదయం 10 గంటల సమయంలో ఈనాడు ఆఫీస్ వద్ద అదుపులోకి తీసుకున్నారు.వీరి నుండి ఒక కారు, ఒక బైక్,హత్య చేసిన కత్తి, ఐదు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును అన్ని కోణాల్లో పటిష్టంగా దర్యాప్తు చేసి హంతకులకు త్వరితగతిన శిక్షలు పడేలాగా పోలీస్ శాఖ కృషి చేస్తుందని,పిడి యాక్ట్ సైతం నమోదు చేస్తాం, ఎవరైనా చట్ట ఉల్లంఘన చర్యలకు పాల్పడుతూ భౌతిక దాడులకు హత్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు హెచ్చరించారు. గతంలో జరిగిన హత్య కేసులలో నేరస్తులకు జీవిత ఖైదీ శిక్షలు పడ్డాయని గుర్తు చేశారు.పోలీస్ శాఖ నాణ్యమైన దర్యాప్తు చేస్తూ కేసులను వేగవంతంగా సాంకేతిక కోణంలో దర్యాప్తు చేస్తుందని పక్క ఆధారాలు, సాక్షాలు నమోదు చేసి కోర్టులకు పంపిస్తున్నామని త్వరితగతిన శిక్షలు అమలు అవుతున్నాయని అన్నారు.ఈ కేసులో బాగా పనిచేసి పర్యవేక్షణ చేసిన సూర్యాపేట డివిజన్ డీఎస్పి ప్రసన్నకుమార్ ను, పట్టణ సిఐ వెంకటయ్య, రూరల్ సిఐ రాజశేఖర్, సిసిఎస్ ఇన్స్పెక్టర్ శివకుమార్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, ఎస్సైలు ఏడుకొండలు, శివతేజ,మహేందర్ నాథ్, రూరల్ ఎస్సై బాలు నాయక్,స్పెషల్ బ్రాంచ్,పట్టణ పోలీస్ స్టేషన్ సిబ్బంది, టెక్నికల్ టీం ను అభినందించారు.

# ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు సమన్వయంతో పనిచేయాలి

## అదనపు కలెక్టర్ వేణుగోపాల్



కొత్తగూడెం బ్యూరో మే 26(విజన్ ఆంధ్ర)ఐడిఓసి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్ ప్రజల నుండి వినతులు, ఫిర్యాదులను స్వీకరించి సమగ్రంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ పద్మ, జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి శ్రీరామ్ పాల్గొన్నారు. జిల్లాలోని పలు మండలాలు, గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై తమ వ్యక్తిగత, సామూహిక సమస్యలను అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారంలో శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమని తెలిపారు. ప్రతి వినతిపత్రాన్ని బాధ్యతాయుతంగా పరిశీలించి తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. వెంటనే పరిష్కరించగల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, మిగిలిన సమస్యలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖలకు చెందిన జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# స్త్రీలలో రక్తహీనత లోపం లేకుండా ఉండాలి

## డాక్టర్ సత్య శారదా దేవి కలెక్టర్ వరంగల్



హన్మకొండ జిల్లా ప్రతినిధి మే 25 (విజన్ ఆంధ్ర) తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి సాంబశివరావు గారి అధ్యక్షతన నేడు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చింతల్లో గర్భిణీ స్త్రీలకు మహిళలకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించడం జరిగినది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కలెక్టర్ జిల్లా మెజిస్ట్రేట్ వరంగల్ డాక్టర్ సత్య శారదా దేవి ప్రత్యేక వైద్య శిబిరాన్ని పరిశీలించి ప్రజలకు ఈ క్రింది సూచనలు చేయడం జరిగినది ప్రతి స్త్రీ ప్రభుత్వము నిర్వహిస్తున్న ఈ ప్రత్యేక వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకొని వారి ఆరోగ్య పరీక్షలు చేయించుకొని వ్యాధులు నిర్ధారణ అయితే దానికి తగిన చికిత్సలు తీసుకోవాలని కోరినారు స్త్రీలలో ఎక్కువగా రక్తహీనత ఉండటం వలన వివిధ రకాలైన వ్యాధులకు గురి అయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుంది కాబట్టి ప్రతి స్త్రీ తన ఆరోగ్యం గురించి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లయితే ఆ కుటుంబం ఆర్థికంగా ఆరోగ్యంగా సమృద్ధిగా ఉంటుందని తెలిపినారు ఇదే కాక ప్రతి మంగళవారం ఆరోగ్య మహిళ క్లినిక్లు జిల్లాలో నిర్వహిస్తున్నారు అట్టి కేంద్రాలకు వెళ్లి రక్తహీనత సంక్రమిత వ్యాధులు అసంక్రమిత వ్యాధులు ఒబిసిటీ గర్భ సంబంధిత వ్యాధులకు తగిన పరీక్షలు చేయించుకోవాలని వైద్యుల సలహా ప్రకారం చికిత్సలు తీసుకోవాలని కోరినారు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి సాంబశివరావు మాట్లాడుతూ లో ప్రతి ప్రాథమిక మరియు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో స్త్రీల కొరకు ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినామని తెలిపినారు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి వైద్య సేవలు పొందాలని కోరినారు ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి ,డి డబ్ల్యు ఓ వరంగల్, వైద్యాధికారులు వైద్య ఆరోగ్యశాఖ ,అంగన్వాడి సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

# రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

## అదనపు కలెక్టర్ వేణుగోపాల్



కొత్తగూడెం బ్యూరో మే 26(విజన్ ఆంధ్ర)జూన్ 2 తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్ అధికారులను ఆదేశించారు.సోమవారం ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరంలో అన్ని శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జూన్ 2న జిల్లా కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించనున్న రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై శాఖల వారీగా అధికారులకు దిశానిర్దేశం చేశారు.వేడుకలు ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా అట్టహాసంగా నిర్వహించేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమ ప్రాంగణంలో పారిశుధ్యం, తాగునీటి సౌకర్యం, విద్యుత్ సరఫరా, వేదిక అలంకరణ, కుర్చీలు, ధ్వని వ్యవస్థ, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు.జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమం సజావుగా జరిగేలా అన్ని శాఖలు తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని తెలిపారు. రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా నిర్వహించాలని సూచించారు.ఈ సమావేశంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఎండల తీవ్రత నేపథ్యంలో పారిశుధ్య కార్మికుల పని వేళల మార్పు

## ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలను పరిశీలించిన మేయర్ మహంకాళి స్వామి



గోదావరిఖని మే-25(విజన్ ఆంధ్ర)ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో పారిశుధ్య కార్మికుల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని వారి పని వేళలను సవరించినట్లు సోమవారం రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి తెలిపారు.వడదెబ్బ ప్రభావం అధికమవుతున్న దృష్ట్యా పారిశుధ్య కార్మికులు ఉదయం 4 గంటలకు విధులకు హాజరై, ఉదయం 11 గంటలకల్లా పనులు ముగించుకుని ఇంటికి వెళ్లాలని సూచించారు. ఎండ తీవ్రత తగ్గే వరకు ఈ కొత్త పని వేళలు అమల్లో ఉంటాయని వెల్లడించారు. విధి నిర్వహణలో కార్మికులు తగిన జాగ్రత్తలు తీసుకుని వడదెబ్బ బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.అనంతరం మేయర్ ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి వడదెబ్బ బాధితులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. ఆసుపత్రి వార్డులను సందర్శించి రోగులతో మాట్లాడిన ఆయనకు వైద్యుల గైర్హాజరు, ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలు పనిచేయకపోవడం, తాగునీటి సమస్యలు ఉన్నట్లు రోగులు ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా వైద్యులు ఆసుపత్రికి అదనంగా 10 కూలర్లు, 20 ఫ్యాన్లు అవసరమని మేయర్ దృష్టికి తీసుకెళ్లారు. అవసరాలపై నివేదిక అందిస్తే ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మేయర్ హామీ ఇచ్చారు.వడదెబ్బ నివారణ చర్యల్లో భాగంగా ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ప్రత్యేక ఏసీ గదులు, అంబులెన్స్‌లు అందుబాటులో ఉండాలని, బాధితులకు అన్ని వేళలా వైద్య సేవలు అందేలా చూడాలని ఆసుపత్రి అధికారులను మేయర్ ఆదేశించారు.

# మిల్లర్లు ధాన్యాన్ని వెంటనే దిగుమతి చేసుకోవాలి

## .జిల్లా కలెక్టర్ కె.హరిత




ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి మే 25, విజన్ ఆంధ్రరైస్ మిల్లర్లు యాసంగి వరి ధాన్యాన్ని వెంటనే దిగుమతి చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల పాలనాధికారి చాంబర్ లో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా లతో కలిసి రైస్ మిల్లర్లు, వాహనాల కాంట్రాక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలలో రైతుల వద్ద నుండి మద్దతు ధర చెల్లించి నిబంధనల ప్రకారం కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన ప్రకారం రైస్ మిల్లులకు పంపించడం జరుగుతుందని, ఈ క్రమంలో రైస్ మిల్లర్లు ధాన్యాన్ని వెంటనే దిగుమతి చేసుకోవాలని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం దిగుమతి వేగవంతంగా చేయాలని, జాప్యం ఉండకూడదని తెలిపారు. హమాలీల కొరత లేకుండా స్థానికంగా ఉన్న హమాలీలను వినియోగించుకోవాలని, ధాన్యం తరలింపులో వాహనాల కొరత లేకుండా సంబంధిత కాంట్రాక్టర్లు వాహనాలను అందుబాటులో ఉంచాలని అవసరం మేరకు స్థానికంగా ఉన్న వాహనాలను వినియోగించుకోవాలని తెలిపారు. కొనుగోలు కేంద్రంలో తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే కేటాయించిన రైస్ మిల్లులకు తరలించాలని, గోనె సంచుల కొరత లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులకు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరమణాల శాఖ అధికారులు, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

# తెలంగాణను సందర్శించనున్న మేఘాలయ యువజన ప్రతినిధి బృందం




హన్మకొండ జిల్లా ప్రతినిధి మే 25 (విజన్ ఆంధ్ర)యువ సంగమ్ కార్యక్రమం కింద తెలంగాణను సందర్శించనున్న మేఘాలయ యువజన ప్రతినిధి బృందానికి ఎన్ఐటీ వరంగల్ ఆతిథ్యంభారత ప్రభుత్వం విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్" కార్యక్రమంలోని యూవ సంగమ్ ఫేజ్ ▪ఎ× కింద మేఘాలయ రాష్ట్రానికి చెందిన 49 మంది యువజన ప్రతినిధి బృందానికి జాతీయ సాంకేతిక విద్యాసంస్థ (ఎన్ఐటీ) వరంగల్ మే 25 నుండి 31, 2026 వరకు ఆతిథ్యం ఇస్తోంది. ఈ బృందాన్ని ఐఐఎం షిల్లాంగ్ సమన్వయం చేస్తోంది. దేశంలోని విభిన్న ప్రాంతాల యువత మధ్య జాతీయ సమైక్యత, సాంస్కృతిక అవగాహన మరియు భావోద్వేగ అనుబంధాన్ని పెంపొందించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యంమే 25 సాయంత్రం 5:30 గంటలకు అంబేద్కర్ లెర్నింగ్ సెంటర్‌లో జరిగిన ప్రారంభ కార్యక్రమంలో ఎన్ఐటీ వరంగల్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి, డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ ప్రొఫెసర్ కె. కిరణ్ కుమార్ మరియు ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ ఫ్యాకల్టీ అడ్వైజర్, ప్రొ.హరిప్రసాద్ రెడ్డి ఫ్యాకల్టీ కోఆర్డినేటర్లు, విద్యార్థి వాలంటీర్లు మరియు సంస్థ అధికారులు ప్రతినిధి బృందానికి ఘన స్వాగతం పలికారు. అనంతరం తెలంగాణ సాంప్రదాయాలు, సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబించే సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు మేఘాలయ ప్రతినిధుల ప్రత్యేక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.ఈ సందర్భంగా ఎన్ఐటీ వరంగల్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి మాట్లాడుతూ, యూవ సంగమ్ వంటి కార్యక్రమాలు యువతకు భారతదేశ వైవిధ్యభరిత సంస్కృతులను ప్రత్యక్షంగా అనుభవించే అవకాశం కల్పిస్తాయని, పరస్పర గౌరవం, జాతీయ ఏకత్వం మరియు సుహృద్భావాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. మేఘాలయ మరియు తెలంగాణ యువత మధ్య దీర్ఘకాలిక స్నేహబంధాలు, సాంస్కృతిక అవగాహన మరియు విద్యా సహకారం మరింత బలోపేతం అవుతాయని ఆయన పేర్కొన్నారు.డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ ప్రొఫెసర్ కె. కిరణ్ కుమార్ ప్రతినిధులకు స్వాగతం పలికి, క్యాంపస్‌లో సంతోషకరమైన అనుభవం కలగాలని ఆకాంక్షించారు.ఈ వారాంతర పర్యటనలో భాగంగా ప్రతినిధులు తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక వారసత్వం, స్టార్టప్ ఎకోసిస్టమ్, గ్రామీణాభివృద్ధి నమూనాలు మరియు సాంకేతిక పురోగతిని అవగాహన చేసుకునేందుకు రామప్ప దేవాలయం (యునెస్కో ప్రపంచ వారసత్వ స్థలం), వేయి స్తంభాల గుడి, వరంగల్ కోట, లక్షణవరం సరస్సు, తాడ్వాయి గిరిజన మ్యూజియం, హైదరాబాద్‌లోని టి-హబ్, పారిశ్రామిక సంస్థలు, టీఎస్‌జెన్‌కో విద్యుత్ కేంద్రం మరియు కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌ను సందర్శించనున్నారు.అలాగే స్టార్టప్ వ్యవస్థాపకులు, ఆవిష్కర్తలు, స్వయం సహాయక సంఘాలు, గ్రామీణ ప్రజలు, అధ్యాపకులు మరియు స్థానిక ప్రతినిధులతో పరస్పర చర్చలు నిర్వహించి తెలంగాణలోని ఆవిష్కరణలు, పారిశ్రామికాభివృద్ధి, సాంస్కృతిక వైవిధ్యం మరియు గ్రామీణ రూపాంతర నమూనాలను తెలుసుకోనున్నారు.అనుభవాత్మక అధ్యయన కార్యక్రమాల్లో భాగంగా గంగాదేవిపల్లి మోడల్ గ్రామాన్ని సందర్శించడంతో పాటు శ్రమదానం, యోగా, ధ్యానం, మొక్కల నాటకం మరియు సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఈ కార్యక్రమాలు యువతలో నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత మరియు ప్రజల మధ్య అనుబంధాన్ని పెంపొందించేందుకు దోహదపడనున్నాయి.

# గొల్లపల్లి న్యూ బైపాస్ లోని పెద్దమ్మ టెంపుల్ దగ్గర పందుల బెడద

ఎల్లారెడ్డిపేట, (విజన్ ఆంధ్ర) రాజన్న సిరిసిల్ల :మే 25 :ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లి న్యూ బైపాస్ రోడ్ లోని పెద్దమ్మ గుడి సమీపంలో ఊర పందులబెడద ఎక్కువ అయిందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు, న్యూ బైపాస్ రోడ్డులో పెద్దమ్మ గుడి సమీప ప్రాంతంలో రైతులు వేలాది రూపాయలు ఖర్చు చేసి సాగుచేసిన వ్యవసాయ పంటలను ఊర పందులు ధ్వంసం చేసి రైతులను నష్టం చేస్తున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు, ఊర పందులు పంటలను ధ్వంసం చేసి నష్టపరుస్తుంటే రైతులు నష్టపోతున్నారని పెంపకం దారులు మాత్రం ఊరు మీద ఊర పందులను పెంచుతూ విక్రయించుకొని లాభాలు పొందుతున్నారని రైతులు వాపోయారు, పెంపకం దారులకు ఎన్ని సార్లు చెప్పిన పట్టించుకోవడంలేదని రైతులు ఆరోపిస్తున్నారు, ఊర పందులను పెంచుకునే పెంపకం దారులు ఊరికి చివరున షెడ్డులు వేసి పెంచుకునే విధంగా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు, ఇప్పటికైనా తహసిల్దార్ ఎస్సై ఎంపీడీవో స్థానిక సర్పంచ్ పాలకవర్గం పంచాయతీ కార్యదర్శి ఊర పందుల పెంపకం దారులకు నోటీసులు ఇచ్చి గ్రామపంచాయతీకి పిలిపించి ఊర పందుల నుండి పంట పొలాలను కాపాడాలని ఇబ్బందులు లేకుండా చేయాలని రైతులు కోరుతున్నారు,

## మహిళా వారోత్సవాలను పకడ్బందీగా నిర్వహించాలి

### .జిల్లా కలెక్టర్ కె.హరిత



అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి మే 25,విజన్ ఆంధ్రప్రజా పాలన– ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈనెల 25వ తేదీ నుండి 30వ తేదీ వరకు జిల్లా మహిళ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన మహిళ వారోత్సవాలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు, జిల్లా సంక్షేమ అధికారి స్వరూపారాణి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్త రావు లతో కలిసి మహిళా వారోత్సవాల సంబంధిత గోడప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 25న గ్రామ సంఘాల భవనాలు, మండల సమాఖ్య భవనాలు, భవనాల భూమి పూజ, శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించడం, అంగన్వాడి టీచర్లు, పిల్లల తల్లిదండ్రుల కోసం వంట పోటీలను నిర్వహించాలని తెలిపారు. 26వ తేదీన "బాల్య వివాహం-బ్రతుకు ఆగం" నినాదంతో బాల్య వివాహాల వలన కలిగే నష్టాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, 27వ తేదీన మహిళల భద్రత పోష్ చట్టంపై అవగాహన కల్పించడం, మండల సమాఖ్యలో ప్రత్యేక సాధారణ సమావేశం నిర్వహించాలని తెలిపారు. 29వ తేదీన రుణ మేళాలు నిర్వహించడం, స్వయం సహాయక సంఘాల జీవనోపాధి, యూనిట్ల రౌండింగ్ ప్రారంభించాలని తెలిపారు. 30వ తేదీ చివరి రోజున అమ్మ మాట - అంగన్వాడీ బాట నినాదంతో అంగన్వాడీ కేంద్రాలలో పిల్లలకు ఏకరూప దుస్తుల పంపిణీ, విద్య ఆరంభ ధ్రువపత్రాల జారీ, కిశోర బాలికల కొరకు స్నేహ కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. మహిళా వారోత్సవాల విజయవంతంకి అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సి.డి.పి.ఓ.లు, సూపర్వైజర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గర్భిణులు సరైన పోషకాహారం తీసుకునే విధంగా అవగాహన కల్పించాలి

**హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**

**హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మహిళా వారోత్సవాలు**

హనుమకొండ జిల్లా ప్రతినిధి మే 25 (విజన్ ఆంధ్ర): గర్భిణీలు సరైన పోషకాహారం తీసుకునే విధంగా అంగన్వాడీ టీచర్లు అవగాహన కల్పించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మే 25 నుండి 30వ తేదీ వరకు జరుగుతున్న



మహిళా వారోత్సవాలను పురస్కరించుకొని పోషణ మేళా, వంటల పోటీ, గర్భిణులకు రక్త పరీక్షలను నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ జిల్లా మహిళా శిశు సంక్షేమ, వైద్య ఆరోగ్యశాఖలు సమన్వయంతో జరుగుతున్న ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. గర్భిణులు సరైన పోషక ఆహారాన్ని తీసుకునేవిధంగా అంగన్వాడీ టీచర్లు అవగాహన కల్పించాలన్నారు. జంక్ ఫుడ్ ను తీసుకోవద్దని, ఆహార విధానంలో ఇంట్లో తయారు చేసుకున్న ఆహార పదార్థాలను తినే విధంగా అవగాహన కల్పించాలన్నారు. రోజువారి ఆహారంలో ప్రోటీన్ ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలను తీసుకోవాలన్నారు. రెండు సంవత్సరాల వరకు పిల్లలకు నూనె, సాల్ట్, షుగర్ ఇవ్వకూడదన్నారు. అంగన్వాడీ కేంద్రాలలో ప్రతిరోజు పోషకాహారాన్ని అందిస్తున్నామని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి విశ్వజ మాట్లాడుతూ సమతుల ఆహారం పట్ల ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతిరోజు వివిధ రకాల ఆహార పదార్థాలను తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అప్పయ్య మాట్లాడుతూ మహిళలు గర్భం దాల్చినప్పటి నుండి ప్రసవం అయ్యేవరకు ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సరైన సమయంలో గర్భిణీలు టీకాలు వేసుకోవడం ద్వారా పుట్టబోయే బిడ్డకు వ్యాధి నిరోధక శక్తిని అందించిన వాళ్ళవుతారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వివిధ అంగన్వాడి కేంద్రాల నుండి పోషకాహార పదార్థాలను తయారుచేసి ప్రదర్శించగా కలెక్టర్ వాటిని పరిశీలించి వంటల పోటీని నిర్వహించారు. గర్భిణీలకు రక్త పరీక్షలను నిర్వహించి ఆరోగ్య సూచనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిడిపివోలు స్వరూప, స్వాతి, ఏసిడిపిఓ సింధూరాణి, సూపర్వైజర్లు, పోషణ్ అభియాన్ డిసి సుమలత, డిపిఎ , బీసీ లు డిఎంసీ కళ్యాణి, డి హెచ్ ఈ డబ్ల్యూ సిబ్బంది అంగన్వాడీ టీచర్లు, గర్భిణులు, తదితరులు పాల్గొన్నారు.

## టన్నెల్ లైనింగ్ పనులు పూర్తి చేయాలి - మంత్రి తుమ్మల

### యాతాలకుంట టన్నెల్ ను పరిశీలించిన మంత్రి తుమ్మల

ఖమ్మం జిల్లా బ్యూరో, మే 25(విజన్ ఆంధ్ర): ఆగస్టు 15లోపు యాతాలకుంట టన్నెల్ లైనింగ్ పనులను ఎట్టి పరిస్థితుల్లో పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. సత్తుపల్లి మండలం యాతాలకుంట గ్రామంలో నిర్మాణంలో ఉన్న యాతాలకుంట టన్నెల్ ను సోమవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సందర్శించి పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు దివాకర్ టిఎస్, అంకిత్, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ లను వెంట తీసుకొని మంత్రి స్వయంగా ట్రాక్టర్ నడుపుకుంటూ టన్నెల్ లోపలికి వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఖమ్మం జిల్లాకు గోదావరి జలాలు అందించడం ఇక్కడి ప్రజల చిరకాల స్వప్నమని అన్నారు. ఏటూరునాగారం నుంచి పాపికొండల వరకు గోదావరి పరివాహక ప్రాంతం ఉన్నప్పటికీ ఇప్పటి వరకు ఆ జలాలను వినియోగించు కోలేకపోయామని తెలిపారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ ఖమ్మం సరిహద్దుల వరకు వచ్చినా సిల్ట్ సమస్యలు, ఇతర ప్రాంతాల ఆయకట్టు కారణంగా జిల్లాకు నీరు అందలేదని అన్నారు. నాగార్జునసాగర్ ఎడమ కాలువ కొంత మేర ఉపశమనం ఇచ్చినా, ఖమ్మం జిల్లా ఎత్తైన ప్రాంతంలో ఉండటంతో గోదావరి జలాలను వినియోగించుకోవాలంటే లిఫ్ట్ ఇరిగేషన్ మాత్రమే మార్గమని తెలిపారు. ఎన్టీఆర్ హయాం నుంచి ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరకు ప్రతి ముఖ్యమంత్రిని ఖమ్మం జిల్లాకు లిఫ్ట్ ఇరిగేషన్ మంజూరు చేయాలని



కోరుతూ పోరాడానని పేర్కొన్నారు. గత ప్రభుత్వం టన్నెల్ నిర్మించాలా, పైపులైన్ వేయాలా అనే విషయంలో నిర్ణయం తీసుకోలేదని, భద్రాచలం పర్యటన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఒత్తిడి తీసుకువచ్చి పెండింగ్ పనులను ప్రారంభించామని తెలిపారు. ఇప్పటికే ఈ ప్రాజెక్టుపై 10 వేల కోట్లు ఖర్చు చేశామని, మరో 7 నుంచి 8 వేల కోట్లు వెచ్చిస్తే కాలువల పనులు పూర్తి చేసి ప్రాజెక్టును పూర్తి స్థాయిలో పూర్తి చేయవచ్చని పేర్కొన్నారు. రాజీవ్ లింక్ కాలువను ఆరు నెలల్లో పూర్తి చేశామని, వచ్చే జూన్ నాటికి గోదావరి జలాలతో వైరా ప్రాజెక్టును నింపి లక్షన్నర ఎకరాలకు సాగునీరు అందిస్తామని తెలిపారు. యాతాలకుంట టన్నెల్ పూర్తైతే మరో లక్ష ఎకరాలకు గోదావరి జలాలు అందుతాయని పేర్కొన్నారు. యాతాలకుంట టన్నెల్ పనులు 16 నెలల క్రితం ప్రారంభమై, ఏజెన్సీ అధికారులు రాత్రింబవళ్లు కష్టపడి టన్నెల్ నిర్మాణాన్ని పూర్తి చేశారని అభినందించారు. టన్నెల్ లైనింగ్ పనులను కూడా త్వరగా పూర్తి చేయాలని, రెండు వైపులా పనులు వేగవంతం చేయాలని సూచించారు. వచ్చే వర్షాకాలానికే యాతాలకుంట టన్నెల్ ద్వారా గోదావరి జలాలు బేతుపల్లి చెరువుకు చేరాలనేది తన కోరిక అని అన్నారు. ప్రధాన కాలువ భూసేకరణ పూర్తి చేసిన కలెక్టర్ లకు మంత్రి అభినందనలు తెలిపారు. డిస్ట్రిబ్యూటరీ కాలువల కోసం ఇంకా 11వేల ఎకరాల భూమి అవసరమని, భూసేకరణపై కలెక్టర్లు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. గత ప్రభుత్వం డిస్ట్రిబ్యూటరీ కాలువలను నిర్లక్ష్యం చేసిందని, ప్రస్తుత ప్రభుత్వం సవరించిన అంచనాలకు ఆమోదం తెలిపిందని తెలిపారు. మొదట పినపాక, తరువాత కొత్తగూడెం, అశ్వారావుపేట నియోజకవర్గాలకు ఈ ఏడాదిలోనే ప్రయోజనం చేకూరుతుందని, కాలువల పనులు త్వరగా పూర్తవ్వాలంటే ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులు రైతులతో సమన్వయం చేసి భూసేకరణకు సహకరించాలని కోరారు. యాతాలకుంట టన్నెల్ లైనింగ్ పనులు ఆగస్టు 15లోపు పూర్తి చేయాలని, ఏ సమస్య వచ్చినా వెంటనే ఎమ్మెల్యేలు, కలెక్టర్ల దృష్టికి తీసుకురావాలని ఏజెన్సీకి సూచించారు. భూమి ఇచ్చిన రైతులకు మంచి పరిహారం అందిస్తున్నామని, ప్రాజెక్ట్ కోసం రైతులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా మొత్తం 7 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని, జూలూరుపాడు టన్నెల్ పూర్తైతే పాలేరు వరకు గోదావరి జలాలు చేరుతాయని, ఖమ్మం జిల్లాలో మొత్తం 10 లక్షల ఎకరాలు సాగునీటి పరిధిలోకి వస్తాయని మంత్రి తెలిపారు. జూలూరుపాడు టన్నెల్ టెండర్ ప్రక్రియ పూర్తయ్యిందని, యాతాలకుంట టన్నెల్ లైనింగ్ అనంతరం జూలూరుపాడు టన్నెల్ పనులు వేగవంతం అవుతాయని అన్నారు. భూసేకరణ సమస్యలను త్వరగా పరిష్కరించి పనులు పూర్తి చేయాలని సూచించారు. డిస్ట్రిబ్యూటరీ కాలువల పనులు స్థానిక ఎమ్మెల్యేలు, రైతుల సహకారంపైనే ఆధారపడి ఉన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏసిపి వసుంధర, ప్రజా ప్రతినిధులు, ఇరిగేషన్ అధికారులు, ఏజెన్సీ ప్రతినిధులు, రైతులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా వినతులను సత్వరమే పరిష్కరించాలి

### జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్

### ప్రజావాణిలో ప్రజల అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్



ఖమ్మం జిల్లా బ్యూరో, మే 25(విజన్ ఆంధ్ర): ప్రజలు సమర్పించిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి ప్రజల అర్జీలను స్వీకరించారు. వేంసూరు మండలం భీమవరం గ్రామానికి చెందిన కంచపోగు సురేష్ తన కుమారుడు అభిషేక్ కు బెస్ట్ అవైలబుల్ స్కూల్ లో సీటు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా ఎస్సి అభివృద్ధి అధికారికి రాస్తూ నిబంధన ప్రకారం అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఖమ్మం అర్బన్ మండలం, అల్లిపురం గ్రామానికి చెందిన పి.భవాని తమకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, పిడి హౌసింగ్ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఏన్కూరు మండలం తిమ్మారావుపేట గ్రామానికి చెందిన ఆంజనేయులు తన తాతగారికి సర్వే నెంబర్ 30 లో 9 ఎకరాల 38 గుంటలు భూమి ఉందని, అందులో నాలుగు ఎకరాల 38 గుంటల భూమి వేరే వ్యక్తి మీద పట్టా అయిందని అది రద్దు చేసి తమ భూమి తిరిగి ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, తహసిల్దార్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లను మరింత వేగవంతం చేయాలి

**అన్‌లోడింగ్ ప్రక్రియలో ఆలస్యం లేకుండా చర్యలు తీసుకోవాలి**

**జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశాలు**

**ధాన్యం కొనుగోళ్ల పురోగతిపై టెలీ కాన్ఫరెన్స్ నిర్వహణ**

రాజన్న సిరిసిల్ల బ్యూరో, మే 25 (విజన్ ఆంధ్ర):జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను మరింత వేగవంతం చేసి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ +ఖుతీఱఎఖి౼ాస్త్రతీఖుఖుశ్రీ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. అన్‌లోడింగ్ ప్రక్రియలో ఎటువంటి జాప్యం చోటుచేసుకోకుండా క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ నిర్వహించాలని సూచించారు. సోమవారం ఉదయం జిల్లా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, పౌర సరఫరాలు, సహకార, గ్రామీణాభివృద్ధి, మెప్మా, రవాణా శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ, అన్‌లోడింగ్, గోదాంలలో నిల్వ, ఆన్‌లైన్ ట్యాబ్ ఎంట్రీ పురోగతి వంటి అంశాలపై సమీక్ష చేపట్టారు. మండలాల వారీగా కొనుగోలు కేంద్రాల పరిస్థితి, నిల్వ సామర్థ్యం తదితర వివరాలను అధికారులు కలెక్టర్‌కు



వివరించారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ధాన్యం సేకరణ కొనసాగించాలని, కొనుగోలు కేంద్రాల పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. రైస్ మిల్లులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం టార్గెట్లు కేటాయించి, వారం రోజుల్లోగా కొనుగోలు ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

రైస్ మిల్లులు, గోదాంలు, అపెరల్ పార్క్‌లలో హమాలీల సంఖ్య పెంచి అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని చెప్పారు. తుది దశలో ఉన్న కొనుగోలు కేంద్రాల్లో మరింత చురుకుదనం ప్రదర్శించి కొనుగోళ్లు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. జిల్లాలో గన్నీ బ్యాగుల కొరత లేదని, అవసరాలకు అనుగుణంగా ముందస్తుగా సరఫరా చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. తూకం వేసిన ధాన్యం బస్తాలను తరలించేందుకు సరిపడా వాహనాలు అందుబాటులో ఉంచాలని, ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు.

## కీలక బాధ్యతలకు ప్రమాణ స్వీకారం చేసిన విజన్ ఆంధ్ర రిపోర్టర్లు




వేములవాడ ఆర్‌సి మే 25 (విజన్ ఆంధ్ర)తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టీయూడబ్ల్యూజే హెచ్143) వేములవాడ ప్రెస్ క్లబ్ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ నూతన పాలకవర్గంలో విజన్ ఆంధ్ర తెలుగు దినపత్రికకు చెందిన పాత్రికేయులు కీలక పదవులను చేపట్టారు. విజన్ ఆంధ్ర రాజన్న సిరిసిల్ల బ్యూరోకు చెందిన చింతలతాడెం దేవరాజ్ ఉపాధ్యక్షులుగా, వేములవాడ రిపోర్టర్ జింక శ్రీధర్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా, నవీన్ కార్యవర్గ సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా విజన్ ఆంధ్ర రాజన్న సిరిసిల్ల బ్యూరో మరియు ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు చింతలతాడెం దేవరాజ్ మాట్లాడుతూ, నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన కోలిపాక నరసయ్యకు శుభాకాంక్షలు తెలిపారు. యూనియన్ బలోపేతానికి కృషి చేస్తూ, జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు పాత్రికేయులు, ప్రెస్ క్లబ్ సభ్యులు పాల్గొని నూతన పాలకవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

## వానాకాలం పంటల ప్రణాళక రూపొందించాలి

### తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు చల్లారపు తిరుపతి రెడ్డి

సిద్దిపేట జిల్లా ప్రతినిధి మే, 25 వానాకాలం పంటల ప్రణాళక రూపొందించాలనీతెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు చల్లారపు తిరుపతి రెడ్డి అధికారులను కోరారు. సోమవారం ఆర్డిఓ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో వివిధ అంశాలపై వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వం ప్రకటించిన 16 పంటలకు కనీస మద్దతు ధర తగ్గకుండా మార్కెట్లో కొనుగోలు చేయడానికి నిర్ణయాలు తీసుకొని, ఏ పంట ఎంత పండించిన నిమిత్తం లేకుండా కొనుగోలు చేయాలని కోరారు. మార్కెట్లలో ఎం ఎస్ పి ధర దక్కనప్పుడు మార్కెట్లో ఉన్న గోడౌన్ లో రైతుబంధు పథకం కింద రైతు పంటను మొత్తం కొనుగోలు చేసి గోదాములలో నిలువ చేసి, రైతు పండించిన పంట మొత్తానికి నూటికి 70 శాతం రూపాయల చొప్పున బ్యాంకుల నుంచి రైతులకు డబ్బులు ఇప్పించాలని కోరారు. పంట పూర్తిగా అమ్మిన తర్వాత మిగతా 30 శాతం రూపాయలు మొత్తాన్ని బ్యాంకు నుంచి రైతుల ఖాతాలో వేసి రైతులను ఆదుకోవాలని, మార్కెట్లలో రైతులు అనేక ఇబ్బందులుఎదుర్కొంటున్నారనీ, బెజ్జంకి, సిద్దిపేట, తొగుట, హుస్నాబాద్, గజ్వేల్, మిడిదొడ్డి కొనుగోలు కేంద్రాలలో పొద్దు తిరుగుడు పంట కొనుగోలు చేయక, రెండు నెలల నుంచిరైతు లుఇబ్బందులుఎ దుతున్నారని అన్నారు. తక్షణమే పొద్దుతిరుగుడు పంటను కొనుగోలు చేసి వారిని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పొద్దు తిరుగుడు పంటను అమ్మిన రైతులకు రెండు నెలలు గడిచిన వారికి పంట అమ్మిన డబ్బులుచేతికిఅందకపోవడం వల్ల, రైతులు వ్యాపారు దగ్గర అప్పు తెచ్చి, మళ్లీ పంటలకుసిద్ధమవుతున్నారని అన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం కొనుగోలు చేస్తున్న వరి ధాన్యం తరలించడానికి లారీల కొరత ఎక్కువగా ఉందన్నారు. రైతుల సమస్యలనుపరిష్కరించాలని కోరారు.

## టీయూడబ్ల్యూజే హెచ్-143 వేములవాడ ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం



వేములవాడ ఆర్ సి మే 24 (విజన్ ఆంధ్ర)వేములవాడ పట్టణంలోని మున్నూరు కాపు కళ్యాణ మండపంలో ఆదివారం టీయూడబ్ల్యూజే హెచ్-143 వేములవాడ ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జర్నలిస్టులు, సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు కొలిపాక నరసయ్య, ప్రధాన కార్యదర్శి సయ్యద్ అలీ లను వర్కింగ్ ప్రెసిడెంట్ పాశం భాస్కర్ రెడ్డి తదితరులను సంఘ సభ్యులు గజమాలలు వేసి, శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం అధ్యక్షుడు కొలిపాక నరసయ్య మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్న సంఘ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. సంఘ బలోపేతం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి నిబద్ధతతో పని చేస్తానని పేర్కొన్నారు. సంఘ అభివృద్ధికి ప్రతి సభ్యుడు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సయ్యద్ లాయక్ పాషా అధ్యక్షులు కొలిపాక నరసయ్య ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పాశం భాస్కర్ రెడ్డి, గౌరవ సభ్యులుగా కొత్వాల్ శ్రీనివాస్, జితేందర్ రావు, కట్టెకోల రాంప్రసాద్, నేరెళ్ల కరుణాకర్, ఉపాధ్యక్షులుగా దేవరాజ్, అబ్దుల్ జబ్బార్, విష్ణు, క్యాషియర్‌గా పంపరి నాగరాజు, సంయుక్త కార్యదర్శిగా ఫహద్ పాషా, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా జింక శ్రీధర్, చౌటిపల్లి వెంకటేష్, ప్రచార కార్యదర్శులుగా డెబ్బేటి ప్రవీణ్, శ్రీ రామోజీ వేణు, కార్యవర్గ సభ్యులుగా షబ్బీర్, గంగాధర్, బూర్ల ప్రదీప్, సంటి రాజేందర్, పండుగ స్వామి, ఆసిమ్, లక్ష్మీనారాయణ, నవీన్, పి. వేణు, రాము లను నియమించారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. తమకు బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర ఉపాధ్యక్షులు, జిల్లా అధ్యక్షుడు సయ్యద్ లాయక్ పాషా, నూతన అధ్యక్షుడు నర్సయ్యలకు సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సంఘం బలోపేతానికి కృషి చేస్తూ జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ కోసం ఐక్యంగా పని చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలియజేశారు.

## గర్భిణీలు పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి : జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదలి



వరంగల్ జిల్లా ప్రతినిధి వే25(విజన్ ఆంధ్ర);-ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మొదటి రోజు మహిళా వారోత్సవాల్లో మొదటి రోజు న్యూట్రిషన్ మిషన్ కార్యక్రమాలను జిల్లా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పరిశీలించారు. మహిళలు, పిల్లల ఆరోగ్య పరిరక్షణలో పోషకాహారం కీలకమని ఆమె పేర్కొన్నారు. జిల్లా కలెక్టరేట్ లో ఫుడ్ క్యాంపిషన్ ఏర్పాటు చేయడం జరిగింది. ఇందులో స్వయం సహాయక గ్రూప్ నెంబర్లతో ప్రోటీన్ విటమి హెల్తి ఫుడ్ తయారీ చేసి వాటి యొక్క ప్రయోజనాలను జిల్లా కలెక్టర్ గారికి వివరించడం జరిగింది. జిల్లాలో నిర్వహించిన పోషకాహార అవగాహన కార్యక్రమాలు, వంటల పోటీలు, గృణీల ఆరోగ్య పరీక్షలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. గర్భిణీలు తరచుగా హెమోగ్లోబిన్ పరీక్షలు చేయించుకోవాలని, ఐరన్ మాత్రలతో పాటు విటమిన్-సి అధికంగా ఉండే ఆహారం తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా స్థానికంగా లభించే మిల్లెట్స్, పప్పుధాన్యాలు, ఆకుకూరలు వంటి పోషకాహార ఆహారాలను ప్రతిరోజూ ఆహారంలో భాగం చేసుకోవాలని మహిళలకు సూచించారు. పోషకాహార లోపం, రక్తహీనత తగ్గించడం ద్వారా మహిళలు, పిల్లల ఆరోగ్య స్థితిని మెరుగుపరచడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ జి. సంధ్యారాణి, అదనపు కలెక్టర్ లోకల్ బాడీ గణేష్ డిఆర్ఓ విజయలక్ష్మి,జిల్లా సంక్షేమ అధికారి బి. రాజమణి, వైద్య ఆరోగ్య శాఖ అధికారి సాంబశివరావు, మెప్మా డిఎంసి రేణుక అధికారులు, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వచ్చిన అర్జీలను మళ్లీ రాకుండ చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్

సిద్దిపేట జిల్లా ప్రతినిధి25 మే 2 సిద్దిపేట జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణి సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయం లోని సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం ద్వారా జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్ ఫిర్యాదుదారుల నుంచి దరఖాస్తులనుస్వీకరించారు. వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు సత్వరమే న్యాయం చేయాలని జిల్లా అధికారులనుఆదేశించారు. జిల్లా నలుమూలల నుంచి పలువురు అర్జిదారుల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజావాణిలో అర్జిలు మొత్తం 86 వచ్చాయి. అర్జిదారులకు న్యాయం చేసి తిరిగి అర్జి పెట్టుకోకుండా పని చెయ్యాలని అదే విధంగా ప్రజావాణి పాత పోర్టల్ లో పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను 2 వారాల్లోగా



పరిష్కరించాలనిఅధికారులనుఆదేశించారు. ఇట్టి కార్యక్రమంలో డిఆర్ఓ నాగరాజమ్మ, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వేములవాడలో రోడ్లపైనే వ్యాపారాలు

## ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురై ఇబ్బందులు ఎదుర్కొంటున్న పాదచారులు ట్రాఫిక్ సమస్యలతో ఆందోళన వ్యక్తం చేస్తున్న స్థానికులు



వేములవాడ రాజన్న సిరిసిల్ల బ్యూరో, మే 25 (విజన్ ఆంధ్ర):ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడకు ప్రతిరోజూ వేలాది మంది భక్తులు, ప్రయాణికులు చేరుకుంటుంటారు. ముఖ్యంగా కోరుట్ల బస్టాండ్ ప్రాంతం నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంగా గుర్తింపు పొందింది. అయితే ప్రస్తుతం ఈ ప్రాంతంలో ఫుట్‌పాత్‌లు, రహదారులు ఆక్రమణలకు గురవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.కోరుట్ల బస్టాండ్ సమీపంలోని ఫుట్‌పాత్‌లపై పండ్ల దుకాణాలు, జ్యూస్ సెంటర్లు ఏర్పాటు చేయడంతో పాదచారులు రోడ్డుపైనే నడవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొంతమంది వ్యాపారులు నడిరోడ్డుపైనే కుర్చీలు వేసి వ్యాపారాలు నిర్వహిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. దీంతో వాహనాల రాకపోకలకు ఆటంకం కలుగుతూ ట్రాఫిక్ సమస్యలు అధికమవుతున్నాయి.ప్రయాణికులు తమ వాహనాలను రహదారిపైనే నిలిపి కొనుగోళ్లు చేయడంతో ట్రాఫిక్ జామ్‌లు సాధారణంగా మారాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రద్దీ సమయాల్లో ప్రాంతంలో ప్రయాణించడం కష్టంగా మారిందని అంటున్నారు.ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిదన్న ప్రశ్న స్థానికుల్లో వ్యక్తమవుతోంది. ఫుట్‌పాత్ ఆక్రమణలు పెరుగుతున్నప్పటికీ మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. అక్రమాలపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని ఫుట్‌పాత్‌లను ఆక్రమణల నుంచి వెంటనే విముక్తి చేయాలని, రహదారులపై జరుగుతున్న వ్యాపారాలను నియంత్రించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రమాదాలు జరిగే ముందు ముందస్తు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# ఫోక్సో కేసు లో జీవిత కాలం జైలు శిక్ష

ఖమ్మం జిల్లా బ్యూరో, మే 25 (విజన్ ఆంధ్ర) : ఖమ్మం పట్టణం నకు చెందిన నిందితుడు బత్తుల చంద్రశేఖర్ కు మైనర్ బాలిక పై లైంగిక దాడి చేసిన కేసు లో జీవిత కాలం జైలు శిక్ష తో పాటు ఒక లక్ష ల రూపాయి ల జరిమాన విధిస్తూ ఖమ్మం జిల్లా ఫోక్స్1 ఇన్ ఛార్జ్ న్యాయాధికారి మొదటి అధనపు జిల్లా న్యాయాధికారి బి. శ్రీనివాసరావు సోమవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం 6 మే 2024 నాడు మైనర్ బాలిక కు మాయమాటలు చెప్పి ఇంటి లోకి తీసుకొని పోయి నిందితుడు మైనర్ బాలిక పై లైంగిక దాడికి పాల్పడాడని 6 మే 2024 న ఖానాపురం హవేలి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసి కేసు ను విచారించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసును విచారించిన న్యాయాధికారి నేరం రుజువు కావడంతో నిందితుడికి జీవితం ఖైదు తో పాటు ఒక లక్ష రూపాయల నగదు జరిమానా విధించారు . ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ జమ్ముల శరత్ కుమార్ రెడ్డి,లైజన్ ఆఫీసర్ శ్రీనివాస్, హోమ్ గార్డు చిట్టిబాబు లు సహకరించారు.

# ప్రజావాణికి డుమ్మా కొట్టిన అధికారులకు షోకాజ్ నోటీస్

## జిల్లా కలెక్టర్ దీపక్ తివారి



వికారాబాద్ జిల్లా ప్రతినిధి మే 25 (విజన్ ఆంధ్ర) : ప్రజావాణికి గైర్హాజరు అయిన అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేశామని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.విధులకు అనధికారికంగా గైర్హాజరు కావడం, విధులకు హాజరు కాకపోవడంపై డిసిహెచ్ఎస్ సూపరింటెండెంట్ డాక్టర్ డి.ఆనంద్, ఎంసిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వినయ్, 108 కోఆర్డినేటర్ బి.రఘురాం లకు జిల్లా కలెక్టర్ షోకాజ్ నోటీసులు జారీ చేస్తూ వివరణ కోరారు. ముందస్తు అనుమతి పొందకుండా ఎటువంటి సమాచారాన్ని ఇవ్వకుండా విధులకు గైర్హాజరైనట్లు అందువల్ల విధులకు అనధికారికంగా గైర్హాజరు కావడానికి గల కారణాలను తెలుపుతూ లిఖితపూర్వక వివరణను సమర్పించాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. లిఖితపూర్వకంగా వివరణ ఇవ్వనట్లయితే సస్పెన్షన్‌తో సహా క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ హెచ్చరించారు. వివరణలో జాప్యం చేసినట్లయితే తదుపరి నోటీసు లేకుండా, అమలులో ఉన్న నియమ, నిబంధనల ప్రకారం క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందనిఅంతేకాక, అదే విషయం మళ్ళీ పునరావృతమైతే పని చేయడానికి ఆసక్తి లేదని భావించి, ఆ విషయాన్ని ప్రభుత్వానికి నివేదించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ షోకాజ్ నోటీసు ద్వారా తెలిపారు.

# మార్కెట్‌కు వరుసగా ఐదు రోజులు సెలవు 27 నుంచి 31 వరకు నిలిచిపోనున్న కొనుగోళ్లు

వరంగల్ జిల్లా ప్రతినిధి మే25(విజన్ ఆంధ్ర);-వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ కు వరుసగా ఐదురోజులు సెలవులు రానున్నాయి. మంగళవారం ఒక్క రోజు లావాదేవీలు జరగనుండగా, ఈ నెల 27 నుంచి 31 వరకు వరుసగా కొనుగోళ్లు నిలిచిపోనున్నాయి. ఈ మేరకు వరంగల్ మార్కెట్ అధికారులు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మంగళవారం మార్కెట్ కొనసాగనుండగా, బుధవారం రోజున కొంతకాలంగా సెలవు పాటిస్తూ వస్తున్నారు. ఇక ఈ గురువారం బక్రీద్ పండుగ కావడంతో ఆ రోజు ప్రభుత్వం అధికారికంగా సెలవు ప్రకటించింది. వేసవి దృష్ట్యా ఎండలు తీవ్రత నేపథ్యంలో వ్యాపారులు శుక్రవారం కూడా సెలవు ఇవ్వాలని అధికారులను కోరగా, శుక్రవారం సైతం మార్కెట్ బంద్ కానుంది. శనివారం, ఆదివారం వారాంతపు సెలవులు. ఈ లెక్కన బుధవారం నుంచి ఆదివారం వరకు ఐదు రోజులు వరుసగా మార్కెట్ బంద్ పాటిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. జూన్ ఒకటో తేదీన మార్కెట్ తిరిగి తెరుచుకోనున్నా.. ఆ మరుసటి రోజు జూన్ రెండో తేదీన తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మార్కెట్ కు సెలవు వచ్చే అవకాశం ఉందనే అభిప్రాయాలు వెల్లడవుతున్నాయి. ఆ మరుసటి రోజు బుధవారం కూడా బందే. మొత్తంగా జూన్ 4వ తేదీ నుంచి మార్కెట్ యథావిధిగా కొనసాగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని రైతులు గమనించి.. మార్కెట్ అధికారులకు, వ్యాపారులకు సహకరించాల్సి ఉంటుంది.

# మూసాపేట్ మండలం వేముల లో పి.పి.సి సెంటర్ ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా



అకాల వర్షాల నేపథ్యంలోకొనుగోలు చేసిన వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల నుండి మిల్లులకు తరలించే ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అన్నారు. సోమవారం మూసాపేట మండలంలోని వేముల గ్రామం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ( పి.పి.సి) జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, హైదరాబాద్ నుండి వచ్చిన పౌర సరఫరాల డైరెక్టర్ జి . వి. శ్యామ్ ప్రసాద్ లాల్ తో కలిసి సందర్శించి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అకాల వర్షాల వల్ల కొనుగోలు చేసిన ధాన్యం తడిసిపోకుండా ఉండేందుకు కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని పి.పి.సి సెంటర్ నిర్వాహకులను ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రం లో నింపి ఉన్న గన్నీ సంచులను మిల్లులకు ఎందుకు తరలించలేదని అధికారులను ప్రశ్నించారు. సరిపడా రవాణా వాహనాలు అందుబాటులో లేకపోవడం వల్ల ఆలస్యం జరుగుతోందని నిర్వాహకులు తెలిపారు.దీని పై స్పందించిన కలెక్టర్ జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ రవి నాయక్, జిల్లా పౌర సరఫరాల అధికారి గంప శ్రీనివాస్‌లకు అదనపు లారీలను వెంటనే ఏర్పాటు చేసి ధాన్యం సంచులను తక్షణమే మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే మిల్లుల వద్ద కూడా ధాన్యం సంచుల అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని, ట్రక్ షీట్ వివరాలను ఓపిఎంఎస్ యాప్‌లో ఆలస్యం చేయకుండా అప్‌లోడ్ చేయాలని సూచించారు. రైతులకు చెల్లింపులు త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.మూసాపేట మండలంలో ఇప్పటివరకు ఎంత ధాన్యం కొనుగోలు చేశారు అని కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. మండలంలోని నాలుగు కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 420 మంది రైతుల నుంచి 2,617.2 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు అధికారులు తెలిపారు. మరో మూడు నుంచి నాలుగు రోజుల్లో సుమారు 3,000 ధాన్యం బస్తాలు కొనుగోలు చేసే అవకాశం ఉందని వివరించారు.కార్యక్రమంలో ఎస్.పి డి. జానకి, జిల్లా పౌర సరఫరాల సంస్థ డి.ఎం రవి నాయక్, జిల్లా పౌర సరఫరాల అధికారి గంప శ్రీనివాస్ , మూసాపేట్ మండల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి అర్జీలను వేగంగా పరిష్కరించాలి



రాజన్న సిరిసిల్ల బ్యూరో, మే 26 (విజన్ ఆంధ్ర):ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను సకాలంలో పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా సిరిసిల్ల సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుంచి నేరుగా దరఖాస్తులు స్వీకరించారు.ఈ సందర్భంగా వివిధ సమస్యలపై వచ్చిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులు ప్రాధాన్యతగా తీసుకుని త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణికి మొత్తం 300 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు.ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలిప్రతి సోమవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం తోపాటు సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవో కార్యాలయాల్లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయా రెవెన్యూ డివిజన్ కార్యాలయాల్లో కూడా ప్రజావాణి కొనసాగుతుందని, స్థానిక ప్రజలు తమ సమస్యలను దరఖాస్తుల రూపంలో అందించాలని సూచించారు.సిరిసిల్ల ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ రాజేందర్ రెడ్డి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అక్కడ మొత్తం 9 దరఖాస్తులు అందగా, సంబంధిత శాఖల అధికారులకు పంపించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.వేములవాడ ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ కే ఎస్ బీ కుమారి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అక్కడ మొత్తం 12 దరఖాస్తులు అందగా, వాటిని సంబంధిత శాఖలకు పంపించి పరిష్కార చర్యలు చేపట్టాలని సూచించారు.ఐడీఓసీ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, హౌసింగ్ పీడీ వెంకట మాధవ రావు తదితర అధికారులు పాల్గొన్నారు.

# కేఎల్ యూనివర్సిటీకి సీఐఐ ఈహెచ్ఎస్ గోల్డ్ అవార్డు

హైదరాబాద్, మే 25 (విజన్ ఆంధ్ర) : కేఎల్ డీమ్డ్ టూ బీ యూనివర్సిటీకి కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ(సీఐఐ) ఈహెచ్ఎస్ ఎక్సలెన్స్ అవార్డ్స్-2025లో ప్రతిష్టాత్మక గోల్డ్ అవార్డు లభించిందని కేఎల్ డీమ్డ్ టు బీ యూనివర్సిటీ ఛాన్సలర్ కొనేరు సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ పర్యావరణం, ఆరోగ్యం, భద్రత రంగాల్లో ఉత్తమ ప్రమాణాల అమలుకు యూనివర్సిటీ కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. గ్రీన్ క్యాంపస్, ఇంధన సంరక్షణ, వ్యర్థాల నిర్వహణ, సామాజిక బాధ్యత కార్యక్రమాల ద్వారా సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. సీఐఐ ఈహెచ్ఎస్ ఎక్సలెన్స్ అవార్డ్స్-25 చైర్మన్, టయోటా కిర్లోస్కర్ మోటార్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అండ్ డైరెక్టర్ సుదీప్ దాల్వీ చేతుల మీదుగా, ఇసుజు మోటార్స్ ఇండియా ప్రెసిడెంట్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ రాజేష్ మిట్టల్ సమక్షంలో న్యూ ఢిల్లీలో ఈ పురస్కారం యూనివర్సిటీ తరఫున ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్ సీనియర్ డైరెక్టర్ కమాండర్ గురుమూర్తి గంగాధరన్ అవార్డును స్వీకరించారని తెలిపారు.




# ప్రకృతి పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత మంత్రి కొండా సురేఖ

## -పర్యావరణ పరిరక్షణతోనే భావితరాలకు భద్రమైన భవిష్యత్ మంత్రి దామోదర రాజనర్సింహ



సంగారెడ్డి బ్యూరో , మే,25(విజన్ ఆంధ్ర)అడవుల నరికివేత, పెరుగుతున్న గ్లోబల్ వార్మింగ్ ప్రభావంతో వాతావరణంలో అనూహ్య మార్పులు చోటుచేసుకుంటున్నాయని, ప్రకృతిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలో రూ.1.44 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన జిల్లా అటవీశాఖ కార్యాలయ భవనాన్ని రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి మరియు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, టి జి ఐ సి చైర్పర్సన్ నిర్మల జగ్గారెడ్డితో కలిసి సోమవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 99 రోజుల ప్రజా పాలన ' ప్రగతి ప్రణాళికలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా వన మహోత్సవ కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా సంగారెడ్డి జిల్లా బొంతపల్లి సమీపంలో “అమృతవనం”, “హరితవనం” పేర్లతో రెండు ఆధునిక ఎకో పార్కులను అభివృద్ధి చేసినట్లు వెల్లడించారు.సంగారెడ్డి, పరిసర ప్రాంతాల ప్రజలు కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి ప్రకృతి అందాలను ఆస్వాదించేలా పార్కుల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించినట్లు మంత్రి తెలిపారు. పర్యాటకుల స్పందన ఆధారంగా 'నైట్ స్టే' సౌకర్యాలను కూడా ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.అడవుల సంరక్షణ కోసం అటవీశాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోందని, రిజర్వ్ ఫారెస్టుల చుట్టూ పటిష్టమైన ఫెన్సింగ్ ఏర్పాటు చేసి అడవి జంతువులు గ్రామాల్లోకి రాకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. త్వరలోనే నారాయణఖేడ్, జహీరాబాద్‌తో పాటు జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో కూడా ప్రకృతి వనాల ఏర్పాటుకు అనువైన స్థలాలను పరిశీలిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కనైనా నాటి, దానిని సంరక్షించడం ద్వారా ప్రకృతి పరిరక్షణలో భాగస్వాములు కావాలని ప్రజలకు ఆమె పిలుపునిచ్చారు.ప్రకృతి సంపదను సంరక్షించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, పర్యావరణ పరిరక్షణ ద్వారానే భావితరాలకు భద్రమైన భవిష్యత్ అందించగలమని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, మరియు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. వన మహోత్సవ కార్యక్రమాల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున మొక్కలు నాటడం, ప్రకృతి వనాలను అభివృద్ధి చేయడం జరుగుతోందని తెలిపారు. సంగారెడ్డి జిల్లా బొంతపల్లి వద్ద ఏర్పాటు చేసిన అమృతవనం, హరితవనం వంటి ఎకో పార్కులు ప్రజలకు ప్రకృతి సౌందర్యాన్ని చేరువ చేయడంతో పాటు పర్యావరణ సమతుల్యతకు దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పి జి ఐ ఐ సి చైర్ పర్సన్ నిర్మల జయప్రకాష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరతోష్ పంకజ్, నారాయణఖేడ్ శాసనసభ్యులు డా. సంజీవరెడ్డి, సంగారెడ్డి మున్సిపల్ చైర్పర్సన్ వనిత సంతోష్, జిల్లా అటవీశాఖ అధికారి, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# బురాన్ పల్లిలో డ్వాక్రా భవనం నిర్మాణానికి భూమి పూజ

## 10 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులు మంజూరు గ్రామ సర్పంచ్ రాందాస్ రాథోడ్ సిఈఓ ససుధీర్, ఎంపిఓ దుర్గని దయానంద్



వికారాబాద్ జిల్లా ప్రతినిధి మే 25 (విజన్ ఆంధ్ర) : మహిళా సంఘాల సభ్యులు అందరూ ఒకే చోట కూర్చొని సాధక బాధకాలు చర్చించుకుంటారని సిఈఓ సుధీర్ అన్నారు. వారికంటూ ఒక ప్రత్యేకమైన భవనం ఉండనుందని ఆయన స్పష్టం చేశారు. సోమవారం వికారాబాద్ మండల పరిధిలోగల బురాన్ పల్లిలో సిఈఓ సుధీర్ ముఖ్యఅతిథిగా హాజరై, గ్రామ సర్పంచ్ రాందాస్ రాథోడ్ ఆధ్వర్యంలో డ్వాక్రా భవనం నిర్మాణానికి ఎంపీఓ దుర్గని దయానంద్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పటేల్ మనోహర్ గౌడ్ తో కలిసి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని సీఈఓ మాట్లాడుతూ డ్వాక్రా సంఘం మహిళా సభ్యులు సమస్యలు ఒకరికొకరితో చర్చించుకుని పరిష్కరించుకునేందుకు చక్కని వేదిక కాగలదని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. పది లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో డ్వాక్రా భవనం నిర్మాణం కానున్నదని ఆయన స్పష్టం చేశారు. గ్రామాభివృద్ధికి డ్వాక్రా మహిళా సంఘం సభ్యులు చేదోడువాదోడుగా నిలవాలని ఆయన సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న రుణ సహాయాన్ని పొందుతూ మహిళలు తమ కాళ్లపై తాము నిలబడతారని ఆయన పేర్కొన్నారు. తమ కుటుంబాన్ని ఆర్థికంగా ఎదిగేందుకు మహిళలు చేసే కృషి వెలకట్టలేనిదని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి స్వాతి ఉపసర్పంచ్ మంజుల వార్డు సభ్యులు మహిళా సంఘం సభ్యులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

## ప్రజావాణి దరఖాస్తులు 92.. జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



సూర్యాపేట మే 25:(విజన్ ఆంధ్ర)ప్రజల సమస్యల పరిష్కారమే వేదికగా సాగుతున్న ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చి సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం అనంతరం అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా మరియు డివిజన్ స్థాయి ప్రజావాణి దరఖాస్తులను తప్పనిసరిగా ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. పాత ప్రజావాణి పోర్టల్‌లో ఇంకా పరిష్కారం కాకుండా ఉన్న దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కొత్తగా అందుతున్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. అధికారులు ప్రజలు పెట్టుకున్న అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా, నిర్ణీత గడువులోగా వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.డివిజన్ స్థాయి ప్రజావాణికి అన్ని శాఖల డివిజనల్ అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా జిల్లా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. స్థానిక సమస్యలు స్థానికంగానే పరిష్కారమైతే ప్రజలకు ఇబ్బందులు తప్పుతాయని ఆయన పేర్కొన్నారు.సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం లో భూ సమస్యలకి సంబందించి 54 దరఖాస్తులు, డిఆర్డిఏ 7, డీపీఓ 5, ల్యాండ్ రికార్డ్స్ 4, డిడబ్ల్యుఓ 3, మిగిలిన 19 దరఖాస్తులు వివిధ శాఖలకి చెందినవని, మొత్తం 92 దరఖాస్తులు వచ్చాయాని వాటిని పరిష్కరించేందుకు శాఖల వారీగా పంపించటం జరిగిందని కలెక్టర్ ఈ సందర్భంగా అన్నారు.ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, డిఆర్డిఓ సన్యాసయ్య,హౌసింగ్ పీడీ సిద్ధార్థ్, డిఎంహెచ్ఓ వెంకటరమణ,డి ఏ ఓ శ్రీధర్ రెడ్డి జిల్లా అధికారులు, తదితరులు హాజరైనారు.

# దర్శకుడిగా ఎదగాలంటే కష్టంతోనే కలలు కనాలి

- యువ దర్శకుడు ఎస్ ఎస్ వర్మను అభినందించిన ప్రముఖ దర్శకుడు ఉడుగుల వేణు
- వేణు ఉడుగుల చేతుల మీదుగా సింగిల్ రాజు టైటిల్ గ్లిమ్స్ విడుదల

హైదరాబాద్, మే 25 (విజన్ ఆంధ్ర) : టాలీవుడ్‌లో మరో గ్రామీణ ప్రేమకథ ప్రేక్షకుల ముందుకు రానుంది. విశ్వస్, మౌనిక, దివ్య ప్రధాన పాత్రల్లో, ఎస్. ఎస్.వర్మ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం సింగిల్ రాజు, విభిన్నమైన టైటిల్‌తో ఇప్పటికే ఆసక్తి రేకెత్తిస్తున్న, ఈసినిమా టైటిల్ పోస్టర్, గ్లిమ్స్ విడుదల కార్యక్రమం హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో ఘనంగా నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ దర్శకుడు ఉ డుగుల వేణు ముఖ్య అతిథిగా హాజరై సింగిల్ రాజు టైటిల్ పోస్టర్‌తో పాటు గ్లిమ్స్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఉడుగుల వేణు మాట్లాడుతూ.. సినిమా రంగంలో అవకాశాల కోసం ఎదురు చూడకుండా తమ ప్రతిభను నమ్ముకుని ముందుకు సాగాలి. కథపై నమ్మకం, నిరంతర శ్రమ, పట్టుదల ఉంటేనే దర్శకుడిగా గుర్తింపు, విజయం ఒక్క రోజులో రాదు, ప్రతి దర్శకుడి వెనుక ఎన్నో నిరాకరణలు, ఎన్నో రాత్రుల కష్టం



దాగి ఉంటుంది. అవకాశాల కోసం ఎదురు చూడకుండా, తమ కథలను తామే సృష్టించుకుని ముందుకు వెళ్లే ధైర్యం ఉండాలి అని అన్నారు. ఎస్.ఎస్.వర్మ, విశ్వస్ ఇద్దరూ నాకు ఎంతో ఇష్టం, ఈ సినిమా కథ వినగానే చాలా ఆసక్తికరంగా అనిపించింది. ఎంతో ధృడ సంకల్పంతో ఈ సినిమాను ప్రారంభించారు. చిత్ర యూనిట్ మొత్తం ఎంతో కష్టపడి పనిచేస్తోంది. ఈ సినిమా పెద్ద విజయాన్ని అందుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అని తెలిపారు. దర్శకుడు ఎస్.ఎస్.వర్మ మాట్లాడుతూ.. వేణు ఉడుగుల తమకు అందించిన ప్రోత్సాహం మరువలేనిది అని, ప్రేక్షకులను అలరించే మంచి ఎంటర్ టైనర్‌గా సింగిల్ రాజు నిలుస్తుందనే నమ్మకం ఉంది అన్నారు. హీరో విశ్వస్ మాట్లాడుతూ మేమంతా ఎంతో ప్యాషన్‌తో ఈ సినిమా చేస్తున్నాం, గ్రామీణ ప్రాంతాల్లో షూటింగ్ సమయంలో అందరూ ఎంతో సహకరించారు. మా సినిమాను ప్రేక్షకులు ఆదరించాలని అన్నారు. హీరోయిన్లు మౌనిక, దివ్య మాట్లాడుతూ విలేజ్ బ్యాక్ డ్రాప్‌లో సాగే ఈ కథలో అన్ని ఎలిమెంట్స్ ఉంటాయి. ప్రేక్షకులకు తప్పకుండా నచ్చుతుంది అని తెలిపారు, టైటిల్ లోగోలో కనిపిస్తున్న బ్రోకెన్ హార్ట్ ఎమోజీని బట్టి ఈ చిత్రం యూత్‌ఫుల్ లవ్ ఎంటర్ టైనర్‌గా రూపొందుతున్నట్టు, గ్రామీణ నేపథ్యంతో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ఇప్పటికే సినీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. త్వరలోనే నటీ నటులు ఇతర విశే షాలను చిత్ర బృందం అధి కారికంగా ప్రకటించనుంది. ఈ చిత్రానికి సాంకేతిక బృందంగా దర్శకత్వం ఎస్.ఎస్.వర్మ, పాటలు గోరటి వెంకన్న, మిట్టపల్లి సురేందర్, ఛాయా గ్రహణం సాయితేజ కుందారపు, నితీష్, ఎడిటింగ్ యునిక్ బొజ్జపల్లి, ప్రొడక్షన్ డిజైనర్ రాజ్ మామిడి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ రాఘవేందర్ వర్మ, సీఈఓ శివ వర్మ సుంకరి, క్రియేటివ్ పబ్లిసిటీ గణేష్ రత్నం, పీఆర్‌వో డిజిటల్ మమత రెడ్డి కాసం, అశోక్ దయ్యాల నిరంతరం శ్రమించారని, తమ సినిమాను ప్రేక్షకులు ఆదరి స్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. యువ రచయిత తరుణ్ కూడా ఈ కార్య క్రమంలో పాల్గొన్నారు.

# ఘనంగా మహిళా వారోత్సవాలు ప్రారంభం



- చిరుధాన్యాలను ఆహారంలో ఎక్కువగా వినియోగించాలి
- అదనపు కలెక్టర్ నర్సింగరావు

గద్వాల మే 25( విజన్ ఆంధ్ర) : ప్రతి ఒక్కరూ సమతుల పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చని, ఆహారంలో చిరుధాన్యాలను ఎక్కువగా వినియోగించాలని అదనపు కలెక్టర్ నర్సింగరావు అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల షెడ్యూల్లో భాగంగా నిర్వహిస్తున్న మహిళా వారోత్సవాల్లో సోమవారం న్యూట్రిషన్ గురించి ఐడిఓసి సమావేశపు మందిరంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, బాలింతలు, గర్భిణీ స్త్రీలకు ప్రభుత్వం పౌష్టికాహారాన్ని అందిస్తోందన్నారు. అధికంగా ప్రాసెస్ చేసిన పదార్థాలను, ఎక్కువ కొవ్వు, చక్కెర, ఉప్పు, నూనెలు ఉండే ఆహారాన్ని తగ్గించాలన్నారు. రోజు తగినంత నీరు తాగాలని, కృత్రిమ శీతల పానీయాలను తీసుకోవడం సరికాదని మజ్జిగ, కొబ్బరి నీరు, నిమ్మరసం వంటి ఆరోగ్యకరమైన పానీయాలను తీసుకోవాలన్నారు. శరీరానికి ఎండ తగిలితే అవసరమైనంత విటమిన్ డీ లభిస్తుందన్నారు. రోజుకు 8 గంటల నిద్ర అవసరమని, మొబైల్, టీవీలను చూడడం తగ్గించాలన్నారు. ఆరోగ్యంగా ఉండేందుకు యోగ, వ్యాయామం, క్రీడలు కూడా దోహదపడతాయని పేర్కొన్నారు. అనంతరం పోషణ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన పౌష్టికాహార ప్రదర్శనను తిలకించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో భూపాల్ రెడ్డి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి సునంద, పలువురు జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయడమే ప్రజాప్రభుత్వం లక్ష్యం



- రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి
- ఒకే రోజు, ఏకకాలంలో 8వేల ఇందిరాగాంధీ స్త్రీ శక్తి భవనాలకు వర్చువల్ విధానంలో శంకుస్థాపనలు
- ఆదిలాబాదు జిల్లా పరిషత్ సమావేశ మందిరం నుండి హాజరైన జిల్లా కలెక్టర్ రాజర్షి షా, అధికారులు

ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి , మే 25,(విజన్ ఆంధ్ర) రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే ప్రజాప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం "ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక" మహిళా వారోత్సవాల్లో భాగంగా, రాష్ట్రవ్యాప్తంగా మహిళా సంఘాలకు సంబంధించిన పలు అభివృద్ధి కార్యక్రమాలు మరియు గ్రామ సంఘ భవనాల (ఇందిరాగాంధీ స్త్రీ శక్తి భవనాలు) భూమి పూజ కార్యక్రమాన్ని సీఎం వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, మహిళా సంఘాలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు డి.అనసూయ, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, దుద్దిల్లా శ్రీధర్ బాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, దేశ చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా ఒకేసారి 8వేల ఇందిరాగాంధీ స్త్రీ శక్తి భవనాలకు శంకుస్థాపనలు చేయడం గర్వించదగ్గ విషయమని పేర్కొన్నారు. ఈ భవనాలు మహిళా సంఘాల ఆత్మగౌరవానికి ప్రతీకలుగా నిలుస్తాయని తెలిపారు. రెండేళ్లలో మహిళా సంఘాలకు రూ.60,470 కోట్ల రుణాలు అందించామని, దీని ద్వారా సుమారు 5 లక్షల మంది మహిళలు వ్యాపారవేత్తలుగా మారారని సీఎం వెల్లడించారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడమే కాకుండా, వారిని బస్సుల యజమానులుగా కూడా తీర్చిదిద్దామని అన్నారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో పెట్రోల్ బంకులు, సోలార్ యూనిట్లు, రైస్ మిల్లులు, గోదాములు, మహిళా శక్తి సూపర్ బజార్లు ఏర్పాటు చేసుకోవాలని, ఇందుకు ప్రభుత్వం పూర్తి ప్రోత్సాహాన్ని అందిస్తుందని తెలిపారు. హైదరాబాద్ నుండి సీఎం నిర్వహించిన ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరం నుండి జిల్లా కలెక్టర్ రాజర్షి షా, స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ రాజేశ్వర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రవీందర్ రాథోడ్, జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, ఇతర జిల్లా అధికారులు మరియు స్వయం సహాయక సంఘాల మహిళా సభ్యులు, ఇతర అధికారులు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో మహిళా సంఘాల బలోపేతానికి, వారి ఆర్థికాభివృద్ధికి జిల్లా యంత్రాంగం తరఫున మరింత ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి సూచించిన విధంగా మహిళా సంఘాల ద్వారా గ్రామాల్లో పంటల మార్పిడి, సేంద్రియ వ్యవసాయ పద్ధతులపై విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం మహిళల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, జిల్లాలోని మహిళా స్వయం సహాయక సంఘాలు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా మరింత ఎదగాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లాకు చెందిన పలువురు అధికారులు, వివిధ మండలాల మహిళా సమాఖ్య ప్రతినిధులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో ఘనంగా ప్రారంభమైన "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" మహిళా వారోత్సవాలు




- ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి, మే 25, (విజన్ ఆంధ్ర) మహిళలు అన్ని రంగాల్లో రాణించి ఆర్థికంగా ఎదగాలని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" లో భాగంగా సోమవారం జిల్లా కేంద్రంలోని ఎస్టీయూ భవనంలో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన "మిషన్ శక్తి" మహిళా వారోత్సవాలను ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మహిళల రక్షణ, భద్రత, ఆరోగ్యం, వారి ఆర్థిక స్వావలంబన సాధించడమే "మిషన్ శక్తి" యొక్క ముఖ్య ఉద్దేశమని, సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో ముందడుగు వేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం మహిళా వారోత్సవాలను ప్రత్యేకంగా నిర్వహిస్తోందని తెలిపారు. ఈ వారోత్సవాలు నేటి (మే 25) నుండి 30 వరకు జిల్లావ్యాప్తంగా మహిళా చట్టాలు, ప్రభుత్వ పథకాలు, ఆరోగ్యం, స్వయం ఉపాధి వంటి పలు కీలక అంశాలపై విస్తృతంగా అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో గర్భిణులకు అన్ని రకాల స్కానింగ్‌లు, వైద్య పరీక్షలు ఉచితంగా అందుబాటులో ఉన్నాయని, ప్రైవేట్ సెంటర్లకు వెళ్లి డబ్బులు వృథా చేసుకోవద్దని సూచించారు. మహిళలు రక్తహీనతను జయించడానికి నిత్యం ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, గుడ్లు వంటి పోషకాహారం తీసుకోవాలన్నారు. అధిక మొత్తంలో ఉప్పు, చక్కెర ఉండే ప్యాకేజ్డ్, జంక్ ఫుడ్స్ వల్ల చిన్న వయసులోనే బీపీ, డయాబెటిస్ వంటి వ్యాధులు వస్తాయని హెచ్చరిస్తూ "సే నో టు జంక్ ఫుడ్" అని పిలుపునిచ్చారు. ఇంట్లో వండుకునే జొన్న రొట్టెలు, సాంప్రదాయ ఆహారానికే ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ నెల 30వ తేదీ వరకు గ్రామ, వార్డు స్థాయిల్లో జరిగే అన్ని అవగాహన కార్యక్రమాల్లో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. మహిళల్లో ఈ అంశాలపై ఆశా కార్యకర్తలు, టీచర్లు, ఏఎన్ఎంలు నిరంతరం అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మెడికల్, అంగన్వాడీ స్టాల్ లను సందర్శించి, ఉత్తమ ప్రతిభ కనబరిచిన మహిళ ఉద్యోగులకు మెమొంటో లను ముఖ్య అతిథిలు అందజేశారు.. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బండారి అనూష, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్, జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి నరేందర్ రాథోడ్, సంబంధిత శాఖల అధికారులు, పర్యవేక్షకులు, అంగన్‌వాడీలు, మహిళలు, సఖి కేంద్రం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ కార్యదర్శుల బదిలీల కౌన్సెలింగ్ నిర్వహణ

### 77 మంది కార్యదర్శులకు నూతన గ్రామ పంచాయతీల కేటాయింపు



రాజన్న సిరిసిల్ల బ్యూరో, మే 25 (విజన్ ఆంధ్ర): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సాధారణ బదిలీల ప్రక్రియలో భాగంగా జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులకు సోమవారం బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ గరిమ అగ్రవాల్ సమక్షంలో ఈ ప్రక్రియ చేపట్టారు. జిల్లా పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో మొత్తం 77 మంది పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. కౌన్సెలింగ్ అనంతరం వారికి నూతన గ్రామ పంచాయతీలను కేటాయించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి షరీఫుద్దీన్‌తో పాటు శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# అడ్మిషన్ల టార్గెట్లతో అల్లాడుతున్న ప్రైవేట్ టీచర్లు

- టార్గెట్లు పూర్తి చేయకపోతే ఉద్యోగాలకే ముప్పు..!
- వేసవి సెలవులు లేకుండా అడ్మిషన్ల వేట..
- కుటుంబ జీవితాలపై తీవ్ర ప్రభావం




కొత్తగూడెం బ్యూరో, మే 26( విజన్ ఆంధ్ర) : ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ప్రస్తుతం అడ్మిషన్ల టార్గెట్ల ఒత్తిడితో తీవ్ర మానసిక వేదన అనుభవిస్తున్నట్లు సమాచారం. ఒకప్పుడు విద్యార్థులకు పాఠాలు చెప్పి వారి భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యతలు నిర్వర్తించిన టీచర్లు ఇప్పుడు అడ్మిషన్ల కోసం ఇంటింటికీ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి సంవత్సరం వేసవి సెలవులు మొదలయ్యే సరికి కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల మధ్య అడ్మిషన్ల పోటీ తీవ్రంగా మారుతోంది. ఈ పోటీలో యాజమాన్యాలు ఉపాధ్యాయులను అడ్మిషన్ల యంత్రాలుగా మార్చేస్తున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. "ఎన్ని అడ్మిషన్లు తీసుకొచ్చారు?", "ఈరోజు ఎంతమందిని కలిశారు?", "టార్గెట్ ఎందుకు పూర్తి కాలేదు?" అంటూ ప్రతిరోజూ టీచర్లపై ఒత్తిడి పెంచుతున్నారని తెలుస్తోంది. వేసవి సెలవులు, ఆదివారాలు, వ్యక్తిగత సమయం అనే తేడా లేకుండా ఉదయం నుంచి రాత్రి వరకు అడ్మిషన్ల కోసం తిరగాల్సి వస్తోందని టీచర్లు వాపోతున్నారు. విద్యార్థుల ఇళ్లకు వెళ్లి, తల్లిదండ్రులను ఒప్పించి, "సార్.. మేడం.. మీ పిల్లలను మా స్కూల్లో చేర్పించండి. ఫీజులో తగ్గింపు మాట్లాడిస్తాం" అంటూ అభ్యర్థించాల్సిన పరిస్థితి నెలకొన్నట్లు చెబుతున్నారు. ఇక కొన్ని పాఠశాలల్లో అయితే అడ్మిషన్ తీసుకురాలేకపోతే ఉద్యోగం నుంచి తొలగిస్తామని నేరుగా హెచ్చరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉద్యోగ భయం కారణంగా చాలామంది టీచర్లు మౌనంగా వేధింపులు భరిస్తున్నారని సమాచారం. కొందరు ఉపాధ్యాయులు తమ సొంత డబ్బులతోనే విద్యార్థుల ఫీజులు చెల్లిస్తున్నారని, మరికొందరు అప్పులు చేసి మరీ ఫీజులు కడుతున్నారనే విషయం ఆందోళన కలిగిస్తోంది. అడ్మిషన్ కోసం తీసుకొచ్చిన విద్యార్థి ఫీజు కట్టకపోతే ఆ భారం కూడా టీచర్లపైనే మోపుతున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇదిలా ఉండగా, అడ్మిషన్ల ఒత్తిడి టీచర్ల వ్యక్తిగత జీవితాలను కూడా దెబ్బతీస్తోందని తెలుస్తోంది. కుటుంబ సభ్యులతో గడపాల్సిన సమయం లేకపోవడం, రోజంతా అడ్మిషన్ల కోసం తిరగడం వల్ల ఇంట్లో గొడవలు జరుగుతున్నాయని పలువురు చెబుతున్నారు. టీచర్లు చెబుతున్న వివరాల ప్రకారం, పాఠశాలల్లో బోధన కంటే అడ్మిషన్లకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. విద్యార్థుల ప్రతిభ, బోధన నాణ్యత కంటే "ఎంత మంది అడ్మిషన్లు తీసుకొచ్చారు?" అనే లెక్కలే ముఖ్యమైపోయాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు యాజమాన్యాలు రోజువారీ రిపోర్టులు, కాల్స్, వాట్సాప్ అప్‌డేట్లు కోరుతూ మానసిక ఒత్తిడి పెంచుతున్నట్లు సమాచారం. మరోవైపు బోధనేతర సిబ్బందిని కూడా అడ్మిషన్ల కోసం వినియోగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఆయాలు, అటెండర్లు, డ్రైవర్లు, కార్యాలయ సిబ్బందికి సైతం అడ్మిషన్ టార్గెట్లు ఇస్తున్నారని తెలుస్తోంది. టార్గెట్ పూర్తి చేయకపోతే జీతాలు నిలిపివేయడం, ఉద్యోగ భద్రతపై అనుమానాలు కలిగించడం జరుగుతోందని సిబ్బంది వాపోతున్నారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది తమపై జరుగుతున్న ఈ వేధింపులను అరికట్టాలని జిల్లా ఉన్నతాధికారులు, విద్యాశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులను వేడుకుంటున్నారు. టీచర్లను బోధనేతర పనులకు బలవంతం చేయకుండా స్పష్టమైన మార్గదర్శకాలు తీసుకురావాలని, విద్యా వ్యవస్థను వ్యాపార ధోరణి నుంచి కాపాడాలని వారు కోరుతున్నారు.

# మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలన్నదే ప్రభుత్వ లక్ష్యం

- మిరాస్‌పల్లిలో మహిళా సంఘాల పెట్రోల్ బంక్‌కు భూమిపూజ
- రెండు ఆర్టీసీ బస్సులనుప్రారంభించిన ఎమ్మెల్యే
- జి. మధుసూదన్ రెడ్డి, కలెక్టర్ఆదర్శ్ సురభి










వనపర్తి జిల్లా ప్రతినిధి, మే 25 (విజన్ ఆంధ్ర): ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా జూన్, 25 నుండి ప్రారంభమైన మహిళా శక్తి వారోత్సవాల్లో భాగంగా సోమవారం దేవరకద్ర శాసన సభ్యులు జి. మధుసూదన్ రెడ్డి కొత్తకోట బస్టాండ్ లో దేవరకద్ర నియోజకవర్గానికి చెందిన మహిళా సంఘాల రెండు ఆర్టీసీ బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం అదే బస్సులో మహిళా సంఘాల సభ్యులతో కలిసి మిరాస్ పల్లి వరకు ప్రయాణించి మిరాస్ పల్లి జాతీయ రహదారిపై మహిళా సంఘాలకు ప్రభుత్వ సబ్సిడీ పై రూ. 2.00 కోట్ల అంచనా వ్యయంతో మంజూరు చేసిన భారత్ పెట్రోలియం బంక్ కు భూమి పూజ చేశారు. అనంతరం శాసన సభ్యులు మీడియాతో మాట్లాడుతూ ఒకప్పుడు మహిళలు కేవలం పొదుపు చర్యలకు మాత్రమే పరిమితం అమయ్యేదని కానీ రాష్ట్ర ముఖ్యమంత్రి కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి అనేక సంక్షేమ పథకాలను మహిళా సంఘాల సభ్యులకు అందజేయడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగానే సబ్సిడీ పై ఆర్టీసీ బస్సులు ఇప్పించడం, పెట్రోల్ బంక్ లు కేటాయించడం, క్యాంటీన్లు ఏర్పాటు చేయడం వంటి వ్యాపారాభివృద్ధి పనులు ఇవ్వడం జరుగుతుందన్నారు. నారాయణపేట జిల్లాలో మహిళా సంఘాల సభ్యులకు మంజూరు చేసిన పెట్రోల్ బంక్ ద్వారా మహిళలు అన్ని ఖర్చులు పోను ఏడాదికి 13 లక్షల లాభాలు ఆర్జించారని తెలియజేశారు. ఆర్టీసీ బస్సులకు యజమానులు చేయడం ద్వారా ఆర్టీసీ యాజమాన్యానికి అద్దెకు బస్సులు ఇచ్చి ప్రతి నెల 70 వేల రూపాయలు అద్దె వసూలు చేస్తున్నట్లు తెలియజేశారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక అనేది భారత దేశంలోనే మొదటిదని, ఇందులో భాగంగా చివరిదైన మహిళా శక్తి వారోత్సవాలు మే, 25 నుండి ప్రారంభం అయ్యాయన్నారు. అందులో భాగంగానే ఈరోజు మహిళా సంఘాలకు సంబంధించిన పెట్రోల్ బంక్ భూమి పూజ, బస్సు ప్రారంభోత్సవ కార్యక్రమాలు నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. జాతీయ రహదారిపై ఎంతో విలువైన ఒక ఎకరం భూమిని తన నియోజకవర్గంలోని మహిళా సంఘాలకు కేటాయించినందుకు జిల్లా కలెక్టర్ కు ధన్యవాదాలు తెలిపారు. వచ్చే 90 రోజుల్లో పెట్రోల్ బంక్ పనులు పూర్తి చేసుకొని ప్రారంభోత్సవ కార్యక్రమం ఏర్పాటు చేసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ జిల్లాలోని మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు జిల్లా యంత్రాంగం చేయుతనందిస్తుందని తెలిపారు. అందులో భాగంగా భారత్ పెట్రోలియం సంస్థతో ఒప్పందం చేసుకొని రూ. 3.00 కోట్ల విలువైన ఎకరం స్థలాన్ని మహిళా సంఘాలకు పెట్రోల్ బంక్ ఏర్పాటుకు కేటాయించడం జరిగిందన్నారు. 2 కోట్ల అంచనా వ్యయంతో భారత్ పెట్రోలియం సంస్థ వారు పెట్రోల్ బంక్ ఏర్పాటు చేస్తుందన్నారు. మహిళా సంఘాల పెట్రోల్ బంక్ జాతీయ రహదారి పై ఉండటం ఇదే మొదటిదని, బంక్ ప్రారంభించాక మహిళలు మంచి లాభాలను ఆర్జించవచ్చని అన్నారు. పి.డి.డి.ఆర్డీఓ ఉమాదేవి, భరత్ పెట్రోలియం ట్రేడింగ్ మేనేజర్ శఫాలి సింగ్, ఇంజనీరింగ్ సింగ్, ఇంజనీరింగ్ మేనేజర్ అభిషేక్ సింగ్, మదనపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రశాంత్, ఆర్టీసీ డిపో మేనేజర్, ఇతర ప్రజా ప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# జీవనదిలో రహదారులు నీటి ప్రవాహానికి అడ్డుకట్ట ...

- భారీ యంత్రాలతో అడ్డుకట్ట వేసిన ఇసుకాసురులు
- రామానుజవరం ర్యాంపు లో పట్టపగలే టిప్పర్లతో ఇసుక తోలకాలు
- చోద్యం చూస్తున్న మణుగూరు తహసిల్దార్
- మచ్చుకైనా కానారాణి టిఎండిసి అధికారులు...




మణుగూరు, మే 25(విజన్ఆంధ్ర): స్వచ్ఛమైన పల్లె వాతావరణంతో స్వచ్ఛతకు మరో పేరు పిలవబడుతున్న రామానుజవరం గ్రామం ఇసుకాసురుల దిగ్బంధంలో విలపిస్తుంది. గోదావరి గుండెల్ని చీల్చి అడ్డుకట్టగా మరో రహదారిని నిర్మిస్తున్న కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవడంలో మణుగూరు మండల అధికారులు విఫలమయ్యారు. అక్రమంగా గ్రావెల్ తోలకాలు జరుపుతున్న నిమ్మకు నీరెత్తినట్లు మణుగూరు రెవిన్యూ అధికారులు వ్యవహరిస్తున్నారు. టిఎస్ఎండిసి అధికారులు మచ్చుకైన కానరాకపోవడంతో మండల వ్యాప్తంగా సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. అధికారుల కనుసన్నల్లో జరగవలసిన పనులు కాంట్రాక్టర్ కనసన్నుల్లో జరగటంతో ఇస్మాయం వ్యక్తం చేస్తున్నారు. డీసిల్టేషన్ పేరుతో టిప్పర్లతో రాత్రికి రాత్రి తోలకాలతో కుప్పలు కుప్పలుగా ఇసుక గుట్టలు కనబడుతున్నాయి. దీనిపై ఉన్నతాధికారుల సమీక్ష లేకపోవడంతో కోఆర్డినేట్స్ ఇష్టం వచ్చినట్లు పెట్టుకొని వారు ఆడిందే ఆట పాడిందే పాటగా కొనసాగుతోంది. గోదావరి నదిని రెండుగా చీల్చి, ఇసుకను మూడు మీటర్ల కంటే ఎక్కువ లోతు తీస్తూ ఇసుకను దండుకుంటున్నారు. దీనిపై మండల రెవెన్యూ అధికారులు, జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని సామాన్య గ్రామ ప్రజలు కోరుతున్నారు. అనునిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సేవ చేసే అధికారులే కాసులకు కక్కుర్తి పడి, కాంట్రాక్టర్లతో చేతులు కలపడం ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. సృష్టిలో సందర్భంగా ఏర్పడిన ఇసుక సంపదను ఎక్కడినుండో వచ్చిన కాంట్రాక్టర్లు తరలించకపోవడంతో స్థానికంగా ఉన్న వారికి అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేదోడు వాదోడుగా ఉంటూ కాంట్రాక్టర్లకు సహాయ సహకారాలు అందిస్తున్న అధికారులపై జిల్లా కలెక్టర్ స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

EDITED,PRINTED, PUBLISHED AND OWNED BY J.NARENDER PRINTED AT SREE DATTA SAI GRAPHICS,# H.NO.1-1-651/8. GANDHINAGAR.HYDERABAD-500020.TELANGANA STATE,PUBLISHED AT J.N.PUBLICATIONS,H.NO.2-1-340/A/4,G.H.M.C NO 12, NEAR FEVER HOSPITAL, BESIDE SBI ATM CENTRE, O.U.ROAD, NALLAKUNTTA MAIN ROAD, HYDERABAD-500044, TELANGANA STATE. RNI.NO.70731/1999 EDITOR : J.NARENDER, CELL:9440897445, Mail visionandhra1999@gmail.com.